భూస్వాముల గుండాల దౌర్జన్యకాండకు బలియైన
విరసం కార్యవర్గ సభ్యుడు

కామ్రేడ్ పరిటాల శ్రీరాములుకు
విప్లవ జోహార్లు



పిల్లల ప్రత్యేక సంచిక

69

జూన్ 1975

150 పైసలు

సృజన

ఉరికొయ్యలు చెరసాలలు విప్లవాన్ని ఆపలేవు

కా(మేడ్స్ కిష్టాగౌడ్ భూమయ్య మేము ఒకేతల్లి బిడ్డలం.

ఈ రైతాంగ గెరిల్లా యోధుల్ని ఉరితియ్యాలని ఈ దుష్ట ప్రభుత్వం కుట్రచేస్తే ఈ గెరిల్లా యోధుల్ని ప్రభుత్వ కబంధ హస్తాల నుండి కాపాడేందుకు నేడు ప్రజాస్వామిక శక్తులు మరింత శక్తివంతంగా పోరాటం కొనసాగిస్తున్నారు.

ఈ కుట్ర విఫలం కాక తప్పదు.

ఇది విప్లవాల యుగం. ఇది నక్సల్బరి తరం. ఉరికొయ్యలు, చెరసాలలు విప్లవాన్ని ఆపలేవు. కా(మేడ్స్ కిష్టాగౌడ్ భూమయ్యలకు మా లాల్‌సలాం.

విప్లవం వర్ధిల్లాలి।

విశాఖ కోర్టులో – కా(మేడ్స్ తరఫున

కె. జి. సత్యమూర్తి

మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ రైతాంగ గెరిల్లాలు కా(మేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు రద్దుచేయాలి

ఏదో చారిత్రకమైన పొరపాటువల్ల ఫక్రుద్దీన్ అలీఅహ్మద్, ఇందిరాగాంధీలను ఉరి తియ్యడం జరిగితే ఎక్కడో అలాస్కాలో ఉన్న ఎస్కిమోలు పట్టించుకోకపోవచ్చును అలాగే భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీస్తే అహ్మద్, ఇందిరాగాంధీలకు చీమకుట్టినట్లయినా ఉండకపోవచ్చును. కాని ఒకప్పుడు సక్కో; వాంజెట్టీలను ఎలక్ట్రిక్ కుర్చీలపై ఎక్కించి అమెరికా ఆర్జించుకున్న అప్రతిష్టకు ఏమాత్రము తగ్గిపోదు ఇండియా ఈనాడు భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీస్తే। సాటి దేశాలచేత ఇండియా ఇప్పటికే 'ఛీ ఛీ' అనిపించుకుంటోంది. (సిక్కింను కబళించడం లాంటి చర్యలతో) ఎన్నో సభ్యరాజ్యాలు నిషేధించిన ఉరిశిక్షను రద్దు చెయ్యకపోవడంతో ఇండియా ఇప్పటికీ పాతరాతియుగంలోనే జీవిస్తున్నట్టు మరోమాటు నిరూపించుకుంటుంది. కనీసం భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలను రద్దుచేసే అవకాశం ఇండియా ప్రభుత్వానికి ఇప్పటికైనా లేకపోలేదని హెచ్చరిస్తున్నాను.

హైదరాబాదు
12–5–75

శ్రీ శ్రీ

అమరుడు కామ్రేడ్ పరిటాల శ్రీరాములు ఆశయం ముందుకే సాగుతుంది

వి.ర.సం. కార్యవర్గసభ్యుడు, కామ్రేడ్ పరిటాల శ్రీరాములు మరి ముగ్గురు అతని సహచరులను, కొందరు భూస్వాముల కిరాయిగుండాలు పరమ కిరాతకంగా కాల్చి చంపారు. 29–5–75 నాడు కామ్రేడ్ శ్రీరాములు తనబంధుమిత్రులతో కర్నాటక రాష్ట్రంలోని బంధువుల పెళ్ళికి బస్సులో ప్రయాణం చేస్తుండగా క్యాతగానిచెర్ల అనే సరిహద్దు గ్రామంవద్ద ఈ దారుణ సంఘటన జరిగింది. దుండగులు దారికాచి బస్సునిలిపి కామ్రేడ్ శ్రీరాములను కాల్చివేశారు.

పేదప్రజలపై కొనసాగుతున్న భూస్వాముల తీవ్రమయిన దోపిడీ దౌర్జన్యాలను సహించలేక కామ్రేడ్ శ్రీరాములు తన 16వ ఏటనే కమ్యూనిస్టు రాజకీయాల్లో ప్రవేశించి అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పీడిత ప్రజల హక్కులకై పోరాటం సాగించాడు. 1952 లోనే ఎన్నికల రొంపిలో దిగిన కమ్యూనిస్టుపార్టీ 1964 లో రివిజనిస్టు, నయా రివిజనిస్టు ముఠాలుగా చీలిపోయి ప్రజాపోరాటాలకు వెన్నుపోటు పొడిచింది. ఈ పార్లమెంటు బురద రాజకీయాలు పేదప్రజల విముక్తిని సాధించలేవని, కొంతకాలం నిరాశకులోనైన కామ్రేడ్ శ్రీరాములలో 1967 నక్సల్‌బరీ రైతాంగ సాయుధపోరాటం కొత్తఆశను, ఎర్రని చైతన్యాన్ని రేకిత్తించింది. రైతుకూలీ సంఘాల నేర్పాటుచేసి భూస్వాముల దోపిడీకి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదరైతాంగాన్ని సంఘటిత పరిచాడు. బంజరు భూముల ఆక్రమించుకునే రైతుకూలీ ఉద్యమాల్లో అగ్రభాగాన నిలిచి పోరాడాడు. భూస్వాములనుండి సుమారు వెయ్యి ఎకరాల భూమిని, పేదరైతాంగం స్వాధీనం చేసుకొన్నది, పీడిత ప్రజల సంఘటితశక్తినిచూసి భూస్వాములు గంగవెర్రులెత్తి పొయ్యారు. కామ్రేడ్ శ్రీరాములు వారిగుండెల్లో గాలమైనిలిచాడు. తమదోపిడీ దౌర్జన్యాలు విచ్చలవిడిగా సాగకుండా అడ్డు తగులుతున్న యీ కామ్రేడ్‌ను ఏ విధంగానైనా హత మార్చాలని భూస్వాములు కుట్రపన్నారు.

తమ పెత్తనం సాగటంలేదనీ, తమ దిగజారుడు రాజకీయాల పస బయట పడి పోయిందనీ ఎర్రజెండా ముసుగులో ప్రజాపోరాటాలకు తూట్లు పొడిచే రివిజనిస్టులు, నయారివిజనిస్టులు భూస్వాములతో మిలాఖత్ ఆయి కామ్రేడ్ శ్రీరాములుపై కత్తిగట్టారు. పేదప్రజల విముక్తి పోరాటాల నెత్తురుటేర్లలో ముంచుతున్న ప్రభుత్వం, దోపిడీదారుల కావలికుక్కగా వ్యవహరిస్తూ, కామ్రేడ్ శ్రీరాములుపై ఎన్నో తప్పుడు కేసులుపెట్టి భూస్వాములకు అండగానిలిచింది. ఇన్ని ప్రజావ్యతిరేకశక్తులమధ్య కామ్రేడ్ శ్రీరాములు గుండెబెదరకుండా ఎర్రజెండా విడువకుండా పోరాటమే జీవన సూత్రంగా, పీడిత ప్రజా సేవయే ధ్యేయంగా, పేదరైతుల సంఘటిత పరుస్తూ, పోరాటాల నిర్మిస్తూ ముందుకు

సాగిపోయాడు. ఈ ప్రజాపోరాటాల అణచడానికి గుండగుడైన ఒక భూస్వామి ఒక రైతు కార్యకర్త కాళ్ళుచేతులు విరగ్గొట్టినపుడు, కోపోద్రిక్తులైన ప్రజలు, భూస్వామిని పట్టుకపోయి వందలమంది జనులమధ్య, అంటే ప్రజాకోర్టులో అతని నేరాల విచారించి ఉరితీయాలని నిర్ణయించారు. తన నడవడిని మార్చుకుంటానని తనకు క్షమాభిక్ష పెట్టమని ఆ భూస్వామి ప్రాధేయపడితే అత్యున్నత మానవతావాదులయిన ప్రజలు అతన్ని క్షమించి వదిలిపెట్టారు. నిజంగా ప్రజలు ఎంత గొప్పవారు? కాని ప్రజాశత్రువు మనసు మారిందా? పేదప్రజల నెత్తురురుచి మరిగినవాడి మనసు మారుతుందా? వర్గశత్రు స్వభావంలో మార్పు ఎలా వస్తుంది?

వర్గసమాజం ఉన్నంతకాలం, వర్గశత్రుత్వం, వర్గపోరాటం కొనసాగుతూనే ఉంటుంది. అందుకే కామ్రేడ్ శ్రీరాములు భూస్వాముల రక్తదాహానికి బలైపోయాడు. నిరుపేద రైతుల కార్మికుల, కష్టజీవులపై, హరిజనుల గిరిజనులపై యీ దేశంలో ప్రతిరోజూ జరుగుతున్న భూస్వాముల, ఫ్యాక్టరీ యజమానుల, పోలీసుల అత్యాచారాలు వర్ణించ నలవికానివి. కాల్చివేతలూ, కళ్ళు పీకేయటమూ, మానభంగాలూ, సజీవదహనాలూ వీరి నిత్యకృత్యాలు. వీటన్నిటినీ రక్షించి పోషించేది యీ దేశాన్ని యేలుతున్న దోపిడీ ప్రభుత్వం. అందుకే ఈ ప్రభుత్వాన్ని కూల్చనిదే. దోపిడీ వర్గాన్ని నాశనం చేయందే పీడిత ప్రజలకు విముక్తి లేదు. దానికి కార్మిక కర్షక పీడితజనుల ఐక్యతతో కూడిన సాయుధ పోరాటమే ఏకైకమార్గం, పిడికెడు దోపిడీ శక్తులపై అశేష పీడిత జనుల విజయం తథ్యం.

రైతుపోరాటాల వీరుడు, విప్లవకారుడు, కవి కామ్రేడ్ పరిటాల అమరవీరులు సుబ్బారావు పాణిగ్రాహికి, వెంపటాపు సత్యానికి నిజమైన వారసుడు, ఆయన మరణం విప్లవ రచయితల సంఘానికి, ముఖ్యంగా పేదరైతాంగానికి తీరనినష్టం. అయితే త్యాగాలులేనిదే ఫలితాలులేవు. బలిదానాలులేనిదే ఎర్రని భవిష్యత్తు లేదు కామ్రేడ్ పరిటాల సాగించిన పోరాటం ఆగదు, ప్రజలకోసం ప్రాణాల్ని తృణప్రాయంగా ఎంచి పోరాడిన కామ్రేడ్ పరిటాల ఆదర్శంపట్ల మన ప్రగాఢ విశ్వాసం, విప్లవంయెడ మన చిత్తశుద్ధి మనల్ని ముందుకునడిపిస్తుంది. కామ్రేడ్ శ్రీరాములు ఎర్రనిఆశయం జయించి తీరుతుంది. ఆ అమరవీరునికి మా విప్లవ జోహార్లు.

[విరసం అనంతపురం జిల్లాశాఖ కరపత్రం ఆధారంగా]

సృజన జూలై '75 సంచిక కామ్రేడ్ పరిటాల శ్రీరాములు స్మృతికి అంకితమవుతుంది. ఆయన రాజకీయ. సాహిత్య జీవితంతో సన్నిహిత సంబంధమున్న కామ్రేడ్స్ ఆయనతో పంచుకున్న పోరాటానుభవాల గురించి వెంటనే రాసి పంపవలసిందిగా కోరుతున్నాం.

సం॥

తెలుగుదేశంలో తెల్లబీభత్సాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

ఒకవైపున విప్లవ కార్యకర్తలపై, రచయితలపై, కళాకారులపై అనేక కుట్ర కేసులద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్ష సాధిస్తూవుంటే మరొకవైపున భూస్వాములు, వారి బంట్లుగా మారిన తెల్లకమ్యూనిస్టులు దౌర్జన్యచర్యలకు పూనుకుంటున్నారు. అనంతపురం జిల్లాలో కొత్తగాదిగుంట గ్రామంలో జననాట్యమండలి ప్రదర్శనమీద భూస్వాములు, జనసంఘీయులు, తెల్లకమ్యూనిస్టులకు చెందిన యువజనసంఘ సభ్యులు రాళ్ళవర్షం కురిపించారు. గుంటూరు జిల్లా కారంచేడులో చీరాల జననాట్యమండలి ప్రదర్శనను భగ్నంచేసి కొందరు కార్యకర్తలను సజీవంగా దహనంచేసేందుకు భూస్వాములు ప్రయత్నించారు. తుమ్మలపాలెంలో అమరవీరుల స్మారకసభకు వచ్చినవారిపై గూండాలను ప్రయోగించి తెల్లకమ్యూనిస్టులు బీభత్సాన్ని సృష్టించారు. శ్రీకాకుళం జిల్లా పార్వతీపురంలో హైదరాబాద్ జననాట్యమండలివారిని, విరసం కార్యవర్గసభ్యుడు భూషణంను పోలీసులు నిష్కారణంగా నిర్బంధించి రాజద్రోహమనేపేర కేసు మోపారు.

వీటన్నిటికంటే ఘాతుకమైన చర్య విరసం కార్యవర్గసభ్యుడు, రైతాంగ పోరాట నాయకుడైన కామ్రేడ్ పరిటాల శ్రీరాములు హత్య. అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా గ్రామాల పేదరైతాంగం కంటికిరెప్పలానిలిచి, భూస్వాములను, తెల్లకమ్యూనిస్టులను ప్రతిఘటించి, గొప్పపోరాటాన్ని నడిపిన కామ్రేడ్ శ్రీరాములును ఆంధ్ర సరిహద్దుఆవల తూముకూరు జిల్లాలో బస్సుదింపి భూస్వాముల గూండాలు కాల్చివేశారు.

ఇటీవల గుంటూరు జిల్లా చెరుకుపల్లి పోలీసుస్టేషన్పై జరిగిన దాడిని సాకుగా తీసుకొని గుంటూరు, ప్రకాశం జిల్లాలకుచెందిన విప్లవాభిమానులందరినీ విచ్చలవిడిగా పోలీసు క్యాంపులలో ఇంటరాగేషన్ పేర చిత్రహింసలకు గురిచేస్తున్నారు. పళనియప్పన్ పోలీసు దురాగతాలను గుర్తుకుతెచ్చే విధంగా భయోత్పాతాన్ని కలిగిస్తున్నారు

ప్రభుత్వం, భూస్వాములూ, విప్లవవిద్రోహులైన తెల్లకమ్యూనిస్టులు కలిసి సాగిస్తున్న ఈ తెల్లబీభత్సాన్ని తీవ్రంగా ఖండించక తప్పదు.

కె. వి. రమణారెడ్డి
తాత్కాలిక కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం

కావలి
3_6_75

* * *

విరసం కార్యవర్గసభ్యుడు, రైతాంగనాయకుడు కామ్రేడ్ పరిటాల శ్రీరాములుపై జరిగిన దారుణ హత్యాకాండను ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, విరసం అనంతపురం జిల్లాశాఖ, హైదరాబాద్ నగరశాఖ, సామ్యవాద సాహిత్యసమితి, కదిరి వేర్వేరు ప్రకటనలద్వారా ఖండించాయి.

పీడిత ప్రజలందరూ యిటువంటి సంఘటనలు జరగకుండా భూస్వాములకు, వాటి గూండాలకు తగినరీతిలో బుద్ధిచెప్పడానికి చైతన్యవంతులు కావల్సిందిగా కోరుతూ యీ విషయంలో న్యాయవిచారణ జరిపించడానికి అన్ని ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు కదలవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

అరెరే దమ్మిడీ....

— శ్రీ శ్రీ

అరెరే దమ్మిడి దొరికింది
దాన్తో ఏమిటి చేస్తావు?

దీన్తో పలక కొంటాను
నాకో బలపం కొంటాను

ఇంకా ఏమిటి కొంటావు?

దీన్తో బటానీలు, మిఠాయిలు
పరోటాలు కొంటాను

ఇంతేనా? ఇంకేమైనా...?

రెక్కల యేనుగు కొంటాను
గజ్జెలగుర్రం కొంటాను

ఇంకా యేంచేస్తావు?

అక్కడ రాజుగారి కూతుర్ని కొంటాను
ఆమెను నా సంచీలో పడేస్తాను
తాళిబొట్టు మూడుసార్లు ముడేస్తాను

ఆ తర్వాత? ...

ఆకాశంలో యేనుగుమీద షికార్లుచేస్తాను
భూలోకంలో గుర్రంమీద పచార్లుచేస్తాను
మజా ఉడాయిస్తాను
ధుమాగా జమాయిస్తాను

ఓరోరి ఎర్రినాయనా!
ఎంత సేపూ నీ సొంతగొడవేనా
ఇంతమంది ప్రజలకోసం
ఏమైనా చెయ్యలేవూ?

ఊఁ: ఎందుకు చెయ్యలేనూ?
విలువైనది నా దమ్మిడీ
వెలకందనిది నా దమ్మిడీ
దీన్తో బాకులు కొంటానూ
తుపాకులు కొంటాను
దీన్తో బాంబులు కొంటాను
బోలెడు టాంకులు కొంటాను
నౌకలు కొంటాను
విమానాలు కొంటాను

అవన్నీ యేంచేస్తావు?

అన్నీ అందరికీ పంచిపెడతాను
పేదలకీ సాదలకీ
చిన్నలకీ పెద్దలకీ
ఆడా మొగా స్టూడెంట్లకీ
కూలోళ్లకీ రైతోళ్లకీ
ఆయుధాలు అందజేస్తాను

చేసి?

ప్రజాసేన నిర్మిస్తాను
ప్రజాయుద్ధం ప్రకటిస్తాను

ఎవరి మీద?

అక్రమాల నెత్తి మీద
అన్యాయాల నడ్డిమీద
ఏరులాగ ఎర్రసేన
జోరుగ ప్రవహిస్తుంటే
వాడ వాడ ఇంటింటా
వీరులు ప్రభవిస్తూంటే
ఎర్రసేనలో నేనొక సిపాయినౌతాను
నల్లధనపు రాజ్యంమీద లడాయిచేస్తాను
ఎర్రకోట రగిలించేస్తాను
ఎర్రజెండా ఎగరేస్తాను
ప్రమాదాలు తీరుస్తాను
ప్రపంచాన్ని మారుస్తాను
సమసమాజమే రూపొందిస్తాను
నవసమాజమే మీకందిస్తాను.

రెండు పాటలు — యాత్రిక్

పోరాడి నేర్చుకో పోరాటము

అల్లాడి అల్లాడి అడుగనేర్చిన పాప
అంబాడి అంబాడి నడువనేర్చిన పాప
అడుగందె అమ్మయిన పెట్టదని తెలిసెనా
నడువందె గమ్యము చేరమని తెలిసెనా ||అల్లాడి||

ఉక్కాలు, ఉంగాలు ఏడుపులు అలకలు
కాళ్లుచేతులు విసిరి గట్టిగా విరసనలు
చిన్న పొట్టాకొరకె ఎన్ని పోరాటాలు ||అల్లాడి||

ఎన్ని తప్పులుచెప్పి అమ్మ అనగలిగావు
ఎన్ని అడుగులు తప్పి అడుగేయగలిగావు
ఎన్ని కాయలు కొరికి గట్టిపడె నీ పళ్లు
ఎన్ని గాయాలతో గట్టిపడె నీ వొళ్లు ||అల్లాడి||

చదువు రావాలంటె చదువుకోవాలిగద
ఈత రావాలంటె నీళ్లలో దూకాలి
నువ్వు చదివితేనె నీకు చదువొస్తుంది
నువ్వు ఈదితేనె నీకు ఈతొస్తుంది ||అల్లాడి||

ఈ నిత్య సత్యాన్ని చెయిర్మన్ చెప్పాడు
ఎదుగుతున్న పాప ఇది నువ్వు పాటించు
"పోరాడి నేర్చుకో పోరాటము"— ||అల్లాడి||

ప్రపంచ పౌరులు

"From the four oceans and five continents, children of the world march forward together in high Spirits towards the rising Sun."
(పెకింగ్‌లోని ఒక ప్రాథమిక పాఠశాల పిల్లలు 30 దేశాలకుపైగా తమలో చేరిన ఇతర బడిపిల్లలతో కలిసి చేసుకున్న అంతర్జాతీయ బాలల దినోత్సవం (జూన్ 1) రోజు పాడిన పాటలో భాగం)

ఐదూ ఖండాల నుంచి
నాల్గూ సంద్రాలమీంచి
ఉరికురికీ వచ్చినాము
ఉదయించే సూర్యుడా
ఉప్పెనలా లేచినాము
ఉదయించే సూర్యుడా
ఉద్యమాలు తెచ్చినాము
ఉదయించే సూర్యుడా
ఉత్తేజం నీవె మాకు
ఉదయించే సూర్యుడా

మెత్తని నీ చెయ్యి తాకి
పువ్వులమై పూసినాము
వెచ్చని నీ చూపు సోకి
మంచులవలె కరిగినాము
నీ వల్లనె నేలంతా
జల్లులమై కురిసినాము
నీ వలనే శత్రువుపై
ఎండలమైమండినాము ॥ఉదయించే॥

నీకోసం పిట్టలమై
ఆకసాన ఎగిరినాము
నీకోసం చేపలమై
నీటిలోన ఈదినాము
కళ్ళల్లో కలలమైన
నీళ్ళల్లో అలలమైన
మా కన్నుల కలవునీవు
మాతలలో అలవు నీవు ॥ఉదయించే॥

తల్లిపాలతో ఎదిగే
పిల్లలమను తీగెలం
విప్లవ బాధ్యత మోసే
భవిష్యత్తు వేగులం
కులంలేదు మతంలేదు
పేరులేదు ఊరులేదు
వెలుగే మా సరిహద్దు
శ్రమలో పొడిచేపొద్దు ॥ఉదయించే॥

నాన్నకోసం

భూపాల్

నాకూ ఉన్నారంట
నాన్నగారంటూ ॥నాకూ॥

ముక్కు పచ్చలారనీ
మూణ్ణాళ్ళ ప్రాయంలో
అమ్మతో నైనాహూ
చెప్పకా వెళ్ళెనంట ॥నాకూ॥

నాన్న యేడవి నేను
అమ్మనడిగితేను
మారూ మాటాడక
కన్నీరు కార్చేను ॥నాకు॥

అనుభవజ్ఞులు మీరు
అన్నీ తెలిసినవారు
మానాన్న గురుతులు
మీరన్న చెప్పరా ॥నాకూ॥

నక్సలైటని అంటూ
నరరూప రాక్షసులు
కన్నేమో పొడిచిరట
ఖైదు చేశారంట ॥నాకూ॥

బీదోళ్ళకోసమై
బందూకు పట్టెనట
బండన్న పేరింటే
కొండలెరుపెక్కునట ॥నాకూ॥

నాన్న బాటలో నేను
నడిచి తీరుతాను
జైళ్ళు బద్దలుగొట్టి
నాన్ననూ తెస్తాను ॥నాకూ॥

[ప్రస్తుతం రాజమండ్రి జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీ కార్యకర్త కామ్రేడ్ బండయ్యగారి పాప మాటలే ఈ పాటకు ఊపిరి.]

పిల్లల్లారా అడగండీ

వసంత

పిల్లల్లారా అడగండీ
పాపల్లారా అడగండీ
పాఠంచెప్పే టీచరునూ
ప్రశ్నలు అడిగే టీచరునూ ॥పిల్ల॥

పొలాలనన్నీ దున్నీ కోసీ
సంపదపెంచీ మెతుకుల్లేకా
డొక్కలుమాడే రైతన్నలకూ,

ఎండలో వానలో రాళ్లను ఎత్తీ
మేడలు వంతెన లెన్నోకట్టే
కష్టజీవులగు కూలన్నలకూ
విముక్తిమార్గంచెప్పాలంటూ ॥పిల్ల॥

* * *

పిల్లల్లారా చెప్పండీ
తెల్లమొహంవేసిన టీచరుకూ

ఎలుగెత్తీ వివరించండీ
శ్రమజీవుల విముక్తిమార్గం
చారుమజుంబార్ చూపించాడని
తుపాకితోనే విముక్తి వచ్చుని
యుద్ధంలేకా శాంతిలేదనీ
ప్రపంచ పీడితులంతా
ఒకటై సాయుధ పోరున
విముక్తిపొందుట సత్యమనీ
పిల్లల్లారా చెప్పండీ
పాపల్లారా చెప్పండీ
విప్లవమే మన జన్మహక్కనీ
నలుదిశలా గర్జించండీ.

ఉదయకిరణాలు :

చిన్న రెడ్‌గార్డ్

రెడ్‌గార్డ్ అంటే ఎర్రకాపలావాడు (సంరక్షకుడు) అని అర్థం. మనకు ఉత్తర దిక్కున హిమాలయ పర్వతాలకు అవల చైనా అనే ఒక పెద్దదేశం ఉంది, మనకన్నా పెద్దదేశం. మనకన్నా అక్కడ మంది ఎక్కువ. కానీ కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో ఛైర్మన్ మావో నడిపిన బాటలో చాలా ఏండ్లు చాలా దూరం నడిచి అక్కడి ప్రజలు ప్రజల ప్రభుత్వం స్థాపించుకున్నారు, ప్రజల పోరాటంలో శత్రువుతో (జపాన్ వాళ్లు చాంగ్‌కై షెక్ అనే దేశద్రోహివంటి వాళ్లు) పోరాడిన సైన్యాన్ని ప్రజావిముక్తి సైన్యం అంటారు అంటే ప్రజలకు కష్టాలు తొలగించడానికి ఏర్పడిన సైన్యం అని అర్థం. అయితే ప్రజలు ప్రజల ప్రభుత్వం ఏర్పాటు చేసికొని కష్టపడి దేశాన్ని బాగు చేసుకుంటుంటే కొంతమంది చీడపురుగులు యీ మంచి ఫలితాలను పాడుచేయాలని గట్టి ప్రయత్నాలు చేసారు. వీళ్లకు వ్యతిరేకంగా మళ్లీ కమ్యూనిస్టు పార్టీ చెయిర్మన్ మావో నాయకత్వంలో ప్రజలు పోరాటం చేసారు. ఈ పోరాటంలో ప్రజలకు సహాయంచేసినవారిని 'రెడ్‌గార్డ్'లని అంటారు. (రైళ్లలో ఆఖరి చిన్నడబ్బాలో ఒక పచ్చ జెండా, ఒక ఎర్రజెండా ఒక పచ్చదీపం, ఒక ఎర్రదీపం పట్టుకొని నల్లని ఉలన్‌బట్టలు వేసుకొని వుంటాడుచూడు- అతన్ని గార్డ్ అంటారు. అతడు రైలుకు ప్రమాదంజరగకుండా కాపలాకాచేవాడన్నమాట. అట్లాగే ఈ రెడ్‌గార్డులు చైనాదేశం ప్రమాదంలో చిక్కుకున్నపుడు ప్రజలకు మంచి సహాయం చేసినవాళ్లు.)

చిన్నపిల్లల్లోకూడా రెడ్‌గార్డ్‌లు వుంటారు. అటువంటి ఒక చిన్నరెడ్‌గార్డు కథ ఇక్కడ మీకు చెప్తాను.

చైనాలో బడిపిల్లలందరు, ముఖ్యంగా చిన్నరెడ్‌గార్డ్‌లు ప్రజలకు సేవచేయడం నేర్చుకుంటారు. ప్రజావిముక్తి సైన్యంలో చేరిన మనుషుల కుటుంబాలకు సహాయం

చేస్తుంటారు. ప్రజా విముక్తి సైన్యం ప్రజలకు సహాయం చేయడానికి వున్నది గనుక ఆ సైన్యంలో చేరినవాని కుటుంబానికి సహాయం చేయడం మన ధర్మం అనుకుంటారు. (మనదేశంలో దీనికి పోలిక చెప్పాలంటే నక్సలైట్లు ప్రజలకోసం పోరాడుతున్నారు గనుక ప్రజలు నక్సలైట్లలో చేరినవారి కుటుంబాలకి సహాయంచేయాలనుకుంటారుగదా! అట్లాంటన్నమాట) ప్రజావిముక్తి సైనికుని కుటుంబం అంటే అక్కడ ఎంతో గౌరవం శ్రద్ధా కనబరుస్తారు ప్రజలు.

ఈశాన్య (తూర్పు ఉత్తర దిక్కుల మధ్యన) చైనాలో టాంటుంగ్ అనే పట్టణమున్నది. అక్కడ ఒక వీధిలో ముసలయ్య ఆయన భార్య ముసలవ్వ వుండే ఇల్లున్నది. వాళ్ల ఇరుగుపొరుగున వుండే పిల్లలు వాళ్లను తాత, అవ్వ అని పిలుస్తారు. వాళ్ల ఒక కొడుకు ప్రజావిముక్తి సైన్యంలో పనిచేస్తున్నాడు. ఇంకా ఇద్దరు కొడుకులు వేరేచోట పనిచేస్తున్నారు. అందువల్ల ఈ ముసలివాళ్లకి సహాయంచేయడానికి స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగువాళ్లు తరుచుగా వస్తుంటారు. కానీ చిన్న రెడ్ గార్డులు మాత్రం ప్రతిరోజూ అక్కడ హాజరు!

ఆ తాత పేరు చు. వాళ్ల వాకిలి ఎప్పుడుచూడు శుభ్రంగా వుండేది. కానీ ఎవరు ఇంత శుభ్రంగా ఊడుస్తున్నారో మాత్రం అతనికి తెలియదు. ఒకరాత్రి మంచు బాగా కురిసింది. (చైనాలో తెల్లవారేవరకు వీధుల్లో గుట్టలు గుట్టలుగా మంచుకురుస్తుంది. మనకు బాగా చలికాలంలో మాత్రమే కొంచెం మంచుకురుస్తుంది. మనం భూమధ్య రేఖకు దగ్గరగావున్నాం మనది ఉష్ణదేశం) కానీ పొద్దున ఆయన లేచేవరకే ఆయన వాకిలి ఎవ్వరో ఊడ్చారు. ఆరోజు మధ్యాహ్నం వాళ్ల ఇంటికి టుంగ్ క్వెచిహ్ అనే చిన్నరెడ్‌గార్డు వచ్చింది. ఆ పాప చక్కగా బడినుంచి ఇంటికిపోకుండా వాళ్ల ఇంటికే వచ్చింది. ఈ ముసలివాళ్లకు బజారువెళ్లి సామాన్లు తేవడంకోసం వచ్చింది. ముసలవ్వ ఈ అమ్మాయిచేతికి కొన్ని పైసలు, ఒక సంచి, ఒక బుట్ట ఇచ్చింది. ఆ సమయంలో తాత "ఇవ్వాళ పొద్దున మా వాకిట్లో మంచు ఊడ్చింది నువ్వేనా?" అని ఆ అమ్మాయిని అడిగాడు. బయటికి పరుగున పోతూపోతూ తల వెనుకకుతిప్పి "ఎవరో చిన్నరెడ్‌గార్డులు వూడ్చివుంటారు" అన్నది పాప. ఆ అమ్మాయి తన ఇంటికివచ్చి తమ ఇంటివాళ్ల సామానుకోసం బజారుకు తీసుకపోయె కావడి (పండ్లమ్మేవాళ్లు భుజాన వేసుకుంటారు గదా- అటువంటిది) తీసికొని బయటికిపోయింది. "నువ్వెక్కడికిపోతున్నావు?" అని తల్లి అడిగింది. కానీ అప్పటికే ఆ పాప బయటపడ్డది "ఆలస్యంగా రావద్దుసుమా!" అని తల్లి కేకవేసింది. కానీ కాసేపటికి తల్లికి ఆశ్చర్యమనిపించింది- ఈపిల్ల కావడి ఎందుకు తీసుకపోయింది? చూద్దామని వెనుకనే బజార్లోకి పోయింది- ఆ పాప కావడికి రెండువేపులా (ముసలివాళ్ళకోసం) సామాన్లు కొనిపెట్టుకొని వాళ్ళ

వాకిట్లోకి పోవడం చూసింది "ఈ పిల్ల ప్రజలకు సేవచేయడం నేర్చుకుంటున్నది" అని తనలో తానే సంతోషించి గప్‌చిప్‌గా వెనక్కి వచ్చింది. తాతకు అవ్వకు సామాన్లు ఒప్పచెప్పి తిరిగి తన ఇంటికి వచ్చేసరికి క్వేచిహ్‌కి కొంచెం ఆలస్యమయింది. అమ్మ తనను కోప్పడుతుందేమో ననుకున్నది. కానీ ఇంట్లో తాను అడుగుపెట్టే వరకు తల్లి బాగా చిరునవ్వు నవ్వుతూ "పో వెళ్లి చేతులు కడుక్కోనిరా" అని మెచ్చుకున్నది. క్వేచిహ్ వంటింట్లోకి సంతోషంగా గంతులువేస్తూ పోయింది.

[China Reconstructs April 74 సంచిక ఆధారంగా]

ఎర్రసైన్యం యోధుడు

రెండవ విప్లవ అంతర్యుద్ధకాలం (1927-37) లో దక్షిణ చైనా పర్వత ప్రాంతంలో క్షియావోయాంగ్ అనే పిల్లవాడు నివసిస్తుండేవాడు. 'కొండతోడేలు' అనే పేరుగల భూస్వామి కుటుంబానికి ఈ పిల్లవాడు పశులకాపరిగా పనిచేసేవాడు. భూస్వామి యీ పిల్లవాని తలిదండ్రుల నిద్దరినీ చంపేశాడు. క్షియావోకు 14 ఏండ్లు వున్నపుడు ఎర్రసైన్యంవాళ్ళ వూరికివచ్చింది. ఈ పిల్లవాడు సైన్యానికి రాజకీయశిక్షణయిచ్చే నాయకుని కలుసుకొని సైన్యంలోచేరుతానని కోరాడు. కష్టంచేసే ప్రజలందరి తరఫున కసి తీర్చుకుని విప్లవాన్ని చివరిదాకా తీసుకుపోవాలనే తనకోర్కెను తెలియపరిచాడు.

అతని తీవ్రమయిన కసి, ద్వేషం, గొప్ప విప్లవ పట్టుదలచూసి నాయకుడు సైన్యంలో ఉండనిచ్చాడు. నాయకుడు పిల్లవాడిని బాకా వూదడం నేర్చుకోమన్నాడు. "నేను సైన్యంలో యుద్ధాలుచేసి శత్రువును చంపడానికి చేరాను. నేను బాకా ఊదను. నాకు రైఫిల్‌కావాలి". అని పిల్లవాడు ఆవేశంగా జవాబుచెప్పాడు.

"యుద్ధరంగంలో బాకావూదకుండా సైన్యాల్ని కదిలించలేం. అదికూడా అయుధమే. అదివిని శత్రువు భయంతో వణికిపోతాడు. మన యోధుల ఉత్సాహం పదునెక్కుతుంది." నాయకుని ఈ మాటలతో క్షియావోయాంగ్ గొప్పగా చలించిపోయాడు" "బాగుంది. బాకా ఊదడం అంత ముఖ్యమయినపనికాబట్టి నేను అదేచేస్తాను".

ఒకసారి క్షియావోయాంగ్ ఒకపనిమీదవెళ్ళి తిరిగివస్తున్నాడు. ఆయన ఒక పర్వతంమీద నడుస్తుండగా 'కొండతోడేలు' అభివృద్ధి నిరోధక సైన్యాలు తమపైన దాడిచేయడానికి రావడం కనిపించింది. ఈసారి శత్రువులు చాలసంఖ్యలోవచ్చారు. మేమేమో చాలా కొద్దిమందిమున్నాం. వీళ్ళ పథకాన్ని చెడగొట్టేఉపాయం ఆలోచించాలి. వీళ్ళను తప్పుదారి పట్టించాలి." అని ఆలోచించి బాకాఊదడం మొదలుపెట్టాడు.

వాళ్ళపైకి చాల చేతిబాంబులు విసిరాడు, వాళ్ళు అతని జాకావిని, ఆ శబ్దంవచ్చినవైపు పరుగెత్తుకొనిరావడం ప్రారంభించారు.

శత్రువులమార్గం తప్పిపోవడం గమనించిన నాయకుడు తన సైన్యాన్ని వాళ్ళ వెంటపడమని ఆదేశించాడు. ఎర్రసైనికులు, శత్రువులను తరిమికొట్టి చాలామందిని చంపేసారు. అంతేకాదు 'కొండతోడేలు'ను కూడా చంపేసారు. యుద్ధం విజయవంతంగా ముగిసినతర్వాత నాయకుడు క్షియావోయాంగ్‌ను "మంచి యెర్రసైన్యం యోధుడు"అని మెచ్చుకున్నాడు.

(చైనా రికన్‌స్ట్రక్ట్స్-జూన్ 74)

అమరులయిన అయిదుగురు బాలవీరుల కథ

పిల్లలూ! మీరెప్పుడయినా బాలవీరులకథ విన్నారా?... వినలేదూ?...అయితే వినండి. అయితే, ఇది రాజకుమారుడు, రాజకుమార్తె కోసం ఏడుసముద్రాలు దాటిన కథకాదు, ఏడుగురు రాకుమారులు ఏడుచేపలకోసం వేటకుపోయేకథకాదు మరయితే ఏంకథ? నిజంగా జరిగినకథ. పేదోళ్ళకష్టాల్ని పోగొట్టడానికి పోరాడిన చిన్నారులకథ. అమరులయిన; అంటే పేదోళ్ళకోసం ప్రాణమిచ్చిన అయిదుగురు బాలవీరులకథ.

మన రాష్ట్రంలో శ్రీకాకుళం అని ఒక జిల్లాఉన్నది. అక్కడి పేదోళ్ళందరూ, మనదేశంలోని మిగతా పేదోళ్ళందరిలానే ఒక విషయంతెలుసుకున్నారు. ఏమని? "ఈ ప్రభుత్వం పేదోళ్ళదికాదు"అని అయితే మరెవరిదని వాళ్ళు తెలుసుకున్నారు? ధనవంతులదని. ధనవంతులంటే ఎవరు? భూస్వాములు, పెట్టుబడిదారులు, భూస్వాములంటే ఎవరు? భూస్వామి అన్నవాడికి కొన్ని వందలఎకరాల భూమి ఉంటుంది, వాడు భూమిని దున్నడు కాని ఎండనక, వాననక, రాత్రనక పగలనక రైతన్నలు వాటి భూమినిదున్నాలి రైతన్నలు పండించిన పంటనంతా భూస్వామిగాడు తీసికెళ్ళిపోతాడు రైతన్నలకేమీఇవ్వడు. ఇక, పెట్టుబడిదారులంటే ఎవరు? పెట్టుబడిదారులంటే ఫ్యాక్టరీలో ఎంతోమంది పేదోళ్ళచేత వస్తువులు తయారుచేయించి, తయారయిన వస్తువులను తాము అమ్ముకుంటారు. వచ్చినడబ్బులో, వస్తువులు కష్టపడి తయారుచేసిన పేదోళ్ళకేమీ ఇవ్వకుండా ఆ డబ్బునంతా ఇనప్పెట్టెల్లో దాచుకుంటారు. ఈ ప్రభుత్వం అంటే భూస్వాములు పెట్టుబడిదారులే కాకుండా ఇంకా మంత్రులూ. పోలీసులు కూడా. మంత్రులంటే గాంధీటోపీపెట్టుకుని, ఖద్దరుగుడ్డలేసుకుని, బొర్రబాగా పెంచిన వాళ్ళంటారే. మీటింగులకి కార్లలోవస్తుంటారు–వాళ్ళు వీళ్ళవెనకాలే కుక్కల్లాగా తిరుగుతూ పేదోళ్ళను కొడుతూంటారు పోలీసులు, భూస్వాములూ, పెట్టుబడిదారులూ

ఏంచేయమంటే మంత్రులూ, ఎర్రబుట్టలోళ్ళు అదిచేస్తారన్నమాట. పేదోళ్ళని కొట్టమంటే కొడతారు చంపమంటే చంపుతారు,

సరే శ్రీకాకుళంజిల్లాలో మనోళ్ళుఅంటే పేదోళ్ళందరూ "ఈ ప్రభుత్వంఉంటే మా పిల్లలకిమూకు తిండిదొరకదు. ఉండడానికి ఇల్లుదొరకదు" అని తెలుసుకున్నారన్న మాట. ఇక మరి పేదోళ్ళ ప్రభుత్వంరావాలె అంటె ఏంచేయాలి? అని అందరూ ఆలోచించి మార్క్సిస్టు-లెనినిస్టు కమ్యూనిస్టుపార్టీ చెప్పినట్లుగా చేయాలె. మన సత్యంమాష్టారు చెప్పిందిచేయాలె"అనుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ, జనసంఘ్‌పార్టీ మొదలయినవన్నీ ధనవంతుల పార్టీలు. కమ్యూనిస్టు పార్టీ అంటే పేదోళ్ళపార్టీ అన్నమాట "పేదోళ్ళకి కడుపునిండా తిండి దొరకాలంటే పేదోళ్ళ ప్రభుత్వం రావాలి. పేదోళ్ళ ప్రభుత్వం రావాలంటే ఈ ధనవంతుల ప్రభుత్వాన్ని పేదోళ్ళు పెద్దయుద్ధంచేసి నాశనం చేయాలి" అని పేదోళ్ళపార్టీ అయిన మార్క్సిస్టు-లెనినిస్టు కమ్యూనిస్టు పార్టీ చెప్తుంది. మరి సత్యం మాష్టారు ఎవరో తెలుసా? మీకు పాఠాలు చెప్పే మాష్టార్లులేరూ! అలాగే శ్రీకాకుళం జిల్లాలో ఆయన ఒక మాష్టారు. సత్యం మాష్టారు పేదల్ని ఎంతో ప్రేమించేవాడు, వాళ్ళ కష్టాలు తీరడానికి అందరూ కలిసి పేదోళ్ళ ప్రభుత్వాన్ని తీసుకరావాలని చెప్పేవాడు. శ్రీకాకుళం కొండప్రాంతంలోని పేదోళ్ళని గిరిజనులంటాం. వాళ్ళు ఎంతో అమాయకులు ఎవరినయినా తొందరగా నమ్మేవారు, గొప్పవీరులు, అక్కడి వ్యాపారులు అమాయకులయిన ఈ గిరిజనులని ఎలా మోసంచేసేవారో తెలుసా? 10 రూ.లు అప్పిచ్చి, ఆ అప్పు తీర్చలేకపోతే 10 రూ.లు బదులుగా 2 ఎకరాల భూమిని గుంజుకునేవారు, 2 ఎకరాల భూమి అసలు విలువ ఎంతో తెలుసా? సుమారు 2000 రూ.లు. ఒక కేజీ చింతపండు గిరిజనులదగ్గర వ్యాపారులు తీసుకుని అర్ధ రూపాయిచ్చేవారు మరి ఒక కేజీ చింతపండు ధరఎంత? నాలుగు రూపాయలు. చూశారా! ఎంత మోసమో! ఇలాచేయడాన్నే దోపిడీ అంటాం, మరి ఆ అమాయక గిరిజనులకేం తెలీదు. అలాపాపం అక్కడి గిరిజనులు మరింతగా పేదోళ్ళయ్యారు. వ్యాపారులేమో మోసంచేసి గిరిజనుల భూముల్ని గుంజుకుని పెద్ద పెద్ద భూస్వాములయ్యారు. మన సత్యం మాష్టారు యీ విషయాలన్నీ ఆ పేదగిరిజనులకు బాగా అర్థం అయేటట్లు చెప్పేవాడు. పేదోళ్ళందరూ ఈ భూస్వాముల్ని, వారి ప్రభుత్వాన్ని నాశనంచేస్తేగాని తమ భూములు తమకి తిరిగిరావని వాళ్ళకి బోధించేవాడు. అక్కడి పేదోళ్ళంతా ఆయన్ని ప్రేమగా 'గురువు'అని పిలిచేవారు. సత్యంమాష్టారు మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ చెప్పినట్లుగా పేదోళ్ళందరూ ఒక్కటై యీ ధనవంతుల ప్రభుత్వంతో యుద్ధం మొదలుపెట్టారు. ఈ భూస్వాములని, పెట్టుబడిదారులని, మంత్రులని, పోలీసులని అంతంచేసి పేదోళ్ళరాజ్యం తేవడంకోసం పెద్ద యుద్ధం చేశారన్నమాట.

శ్రీకాకుళం జిల్లాలో బొడ్డపాడు అనే పల్లెఉంది. ఆ పల్లెలో ఉండేవాడు మన బాలవీరుడు తామాడ చినబాబు. 16 ఏళ్ళ పిల్లవాడు. 5వ తరగతి వరకూ చదువు తున్నాడు. ఆ బాబు అమ్మానాన్నలు చాలా పేదవాళ్ళు. మరి పేదవాళ్ళందరూ తమకు దున్నుకోడానికి భూమి, ఉండడానికి ఇల్లు ఇచ్చే పేదోళ్ళ ప్రభుత్వంకోసం ఈ రాక్షసి ప్రభుత్వంతో యుద్ధంచేస్తున్నారుకదా! అందుకనే తనుకూడా ఈ రాక్షసి ప్రభుత్వంతో యుద్ధంచేసే తన అన్నలతో కలవాలనుకున్నాడు. చినబాబు ఎంతోమంచిగా పాడేవాడుం పేదోళ్ళకోసం పోరాడే పేదోళ్ళకవి సుబ్బారావు పాణిగ్రాహి జముకులకథ దళంలో ఆడవేషాన్ని వేసేవాడు. జముకులకథ దళంలో ముగ్గురుంటారు. మధ్యనున్న మనిషి కథ చెపుతుంటే పక్కనున్న ఇద్దరూ జముకు అనే వాయిద్యాన్ని మీటుతూ వంతపాడు తూంటారు. 'భూమికోసం' సినిమాలో వెల్లిచెంద్రమ్మ పాట చూశారా? అదీ జముకులకథంటే। చినబాబు పేదోళ్ళపాటలు పాడుతూ, పేదోళ్ళందరినీ తుపాకీపట్టి యుద్ధం చేసి ఈ రాక్షసి ప్రభుత్వాన్ని నాశనంచేయమని చెప్పేవాడు. ఎంతో ఉత్సాహంతో పేదప్రజల పార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు కమ్యూనిస్టుపార్టీకి వార్తలు అందించేవాడుగా. అంటే కొరియర్‌గా పనిచేశాడు. అబ్బ! అంత చిన్నవాడు ఎంత పెద్దపనులు చేశాడో కదూ! మరి మీరూ అలా చేయాలి,

పేదోళ్ళయుద్ధానికి చినబాబు అలా పనిచేయడంచూసి చినబాబుపేరంటేనే ప్రభుత్వం భయపడిపోయింది. వణికిపోయింది. ఒకరోజు కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తితో బాటు కామ్రేడ్ చినబాబు, ఇంకా కొంతమంది కామ్రేడ్స్ ఒకచోటినుండి మరొకచోటికి పోతున్నారు. కామ్రేడ్ అంటే పేదోళ్ళబాగుకోసం పనిచేసేవాడు, కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తి పెద్దచదువులు చదివినాకూడా, పేదోళ్ళకష్టాలు పోవడానికి పేదోళ్ళ తరపున ప్రభుత్వంతో యుద్ధంచేశాడు. మనవాళ్ళు అంతా ఒకచోటినుండి ఇంకోచోటికి పోతుంటే పోలీసులు ఎదురుగావచ్చే ధైర్యంలేక పక్కనుంచి దొంగచాటుగావచ్చి పట్టుకున్నారు. పట్టుకుని, జలాంతర్ అనే కొండలలోకి తీసికెళ్ళారు. మనవాళ్ళచేతుల లోనేమో తుపాకులులేవు, పోలీసులచేతుల్లోనేమో తుపాకులున్నాయి, మనవాళ్ళదగ్గర కూడా తుపాకులుంటే పట్టుకోడానికి పోలీసులకు అసలు ధైర్యం ఉండదు. పిరికి వెధవలు. పట్టుకుని మన కామ్రేడ్స్‌ని చిన్నారి చినబాబుతోబాటు, ఆరోజు అంటే 1969 మే 27న కాల్చేశారు.

ఆదేరోజున, పోలీసు పిరికివెధవలు కాల్చేసిన ఆ కామ్రేడ్స్‌తో మరో 15 సంవత్సరముల బాలవీరుడున్నాడు. అతనిపేరు నిరంజన్. నిరంజన్ సొంతఊరు బరంపురం. బరంపురం మన రాష్ట్రంపక్కనేఉన్న ఒరిస్సారాష్ట్రంలో ఉంది. నిరంజన్ నిరుపేద. శ్రీకాకుళంకొండల్లో పేదోళ్ళందరూ తమ ప్రభుత్వంకోసం ధనవ.

తుల ప్రభుత్వంతో యుద్ధంచేస్తున్నారని విని పేదోళ్ళలో చేరడానికివచ్చాడు. తాను కూడా పేదోళ్ళతరఫున యుద్ధంచేసి ప్రాణమిచ్చాడు. చూశారా! పిల్లలూ! కామ్రేడ్స్ చినబాబు, నిరంజన్‌లిద్దరూ అంతచిన్నవాళ్ళయినా ఎన్నెన్ని మంచిపనులుచేశారో! చివరికి తమ ప్రాణాలుకూడా ఇచ్చిఅమరులయ్యారు. మరి మీ ఈడువాళ్ళని పేదోళ్ళకోసం పనిచేశారని, చంపేసిన ఈ ప్రభుత్వాన్ని, మీరుకూడా పేదోళ్ళతోకలిసి నాశనం చేస్తారుకదూ!

ఇంకొక బాల యోధురాలి కథ వినండి. ఆమె పేరు కామ్రేడ్ తెలకల సరస్వతి. 16 సం॥ వయస్సున్న ఈ కామ్రేడ్‌కూడా పేదోళ్ళతరఫున యుద్ధం చేసింది. ఆమె ఎంతో పేద అమ్మాయి. ఆమెకి ఒక అక్క ఉండేది. ఆమెకూడా పేదోళ్ళ వైపే పనిచేసేది. కామ్రేడ్ సరస్వతి చిన్నపిల్ల అయినా తన కామ్రేడ్ అన్నయ్య పంచాది క్రిష్ణమూర్తిలా కామ్రేడ్ అక్కయ్య పంచాది నిర్మలలా తుపాకిపట్టి పోలీసులతో యుద్ధంచేసింది. కామ్రేడ్ పంచాది నిర్మల కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తి భార్య. మన నిర్మలక్క, ఝాన్సి లక్ష్మికంటెకూడా ఎంతోగొప్పది. ఎలా? ఝాన్సిలక్ష్మిబాయి ఎవరితో యుద్ధం చేసింది? బ్రిటిష్ వాళ్ళతో. అంటే తెల్లవాళ్ళతో. ఎందుకు చేసింది? తన రాజ్యాన్ని బ్రిటిష్‌వాడు లాక్కోబోతుంటే దాన్ని నిలబెట్టుకోడానికి. మరి మన నిర్మలక్క ఎవరితో యుద్ధం చేసింది? ఈ భూస్వాముల, పెట్టుబడిదారుల రాక్షసి ప్రభుత్వంతో. ఎందుకు చేసింది? పేదోళ్ళ ప్రభుత్వంకోసం. పేదోళ్ళ ప్రభుత్వంవస్తే పేదోళ్ళందరూ బాగా బతకచ్చుని. మరి తన రాజ్యంకోసం యుద్ధంచేసిన ఝాన్సిలక్ష్మి గొప్పదా? తనకోసంకాకుండా పేదోళ్ళకోసం యుద్ధంచేసిన కామ్రేడ్ నిర్మలక్క గొప్పదా? తప్పకుండా నిర్మలక్కేకదూ,

మన బాలకామ్రేడ్ తెలకల సరస్వతి, నిర్మలక్క చెప్పినట్లుగా నడుచుకుంటూండేది. కామ్రేడ్ తెలకల సరస్వతి పేరంటేనే పోలీసులు వణికేవారు. పోలీసులువచ్చి ఆమెని, కామ్రేడ్ నిర్మలని, కామ్రేడ్ సుబ్బారావుపాణిగ్రాహిని, కామ్రేడ్ అంకమ్మని దొంగచాటుగా పట్టుకుని రంగమటియా అనే కొండలలోకి తీసికెళ్ళి కాల్చేశారు. అసలు పోలీసులు ఎవరినయినా పట్టుకోగానే ఏంచేయాలో తెలుసా? ఒక్క దెబ్బకూడావెయ్యకుండా కోర్టుకి తీసికెళ్ళాలి. మరి మన కామ్రేడ్స్‌ని ఈ పోలీసు పిరికిపందలు కోర్టుకి ఎందుకు తీసికెళ్ళలా? కోర్టులో జడ్జీలు మంత్రులు చెప్పినట్లు వినాల్సిందే. మంత్రులు భూస్వాములు, పెట్టుబడిదారులు చెప్పినట్టుగా వినాలి. మరి అటువంటప్పుడు పేదోళ్ళ తరఫున మాట్లాడేవాళ్ళందరికీ శిక్ష వేయించవచ్చుగా! అలాచేస్తే చాలా తొందరగా తమ బండారం బయటపడుతుందని భయం. కాబట్టి ఒకవేళ జడ్జి జైలుశిక్షవేస్తే మన

కామ్రేడ్స్ జైళ్ళనుకూడా బద్దలుకొట్టుకొచ్చి తమని చంపేస్తారని భయం. చూశారా! పేదోళ్ళకోసం యుద్ధంచేసేవాళ్ళంటే, వాళ్ళు పసిపిల్లలయినా పోలీసులకెంతభయమో!

పేదోళ్ళకోసం యుద్ధంచేసిన యింకో బాలవీరుడు 14 ఏండ్ల బెల్లూరి ఉమాపతి. ఇతని అమ్మానాన్న ఎంతో పేదవాళ్ళు. తనలాంటి పేదోళ్ళ పేదరికాన్ని పోగొట్టడానికి తుపాకీ పట్టిన ఈ చిన్నారి కామ్రేడ్‌ని పరికి పోలీసులు కామ్రేడ్ పాణిగ్రాహితోబాటు కాల్చేసారు. అంత చిన్నవాడిని చంపేసిన పోలీసులని, వారి యజమానులు భూస్వాములు, పెట్టుబడిదారులని, మనం చంపేసి దెబ్బకుదెబ్బ తియ్యాలి తెలుసా!

ఇక చివరి బాలవీరుడూ, అందరికంటె చిన్నవాడు 12 సం॥ కామ్రేడ్ వీరాస్వామి. బాగా పాడేవాడు. "బాబూ! నువ్వు చాలా చిన్నవాడివి, ఇంటికిపో" అని తన కామ్రేడ్ అన్నయ్యలు అన్నా వినకుండా, ఇంటికి పోయినట్టేపోయి, తిరిగి యుద్ధం చేసే తన కామ్రేడ్ అన్నయ్యలతో, అక్కయ్యలతో చేరేవాడు. మూడుసార్లు పోలీసుల చేతిలో చిక్కినా, మూడుసార్లూ తప్పించుకున్నాడు, నాల్గోసారి పోలీసులు ఇతనిని పట్టుకుని చెట్టుకు కట్టేసి, "ఒరేయ్! నువ్వు పిల్లాడివి. నీ మిగతా కామ్రేడ్‌లు ఎక్కడున్నారో చెప్పు, నిన్ను కాల్చెయ్యకుండా నీ అమ్మానాన్నల దగ్గరికి పంపుతాము" అని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. అప్పుడు మన బాలవీరుడేంచేశాడో తెలుసా! కోపంగా తుపుక్కున పోలీసుల ముఖంపై వుమ్మి "లంజకొడుకుల్లారా! నాముందరే నా కామ్రేడ్ అన్నలను చంపి నన్ను బతికిస్తామంటున్నారా! నేను చిన్నవాడినికదా, ఏమీ చేయలేననుకున్నారట్రా! నా కట్లువిప్పి ఆ తుపాకి ఇవ్వండి, మీ మొగతనం చూస్తా!" అంటూ చాలెంజి చేశాడు. అంత చిన్నవాడు తమ కాకిగుడ్డలకి, తమ చేతుల్లోని తుపాకులకి కూడా భయపడకుండా చాలెంజిచేయడంచూసి, వణికిపోయిన పోలీసు గుండాలు, మన చిన్నారి కామ్రేడ్ వీరాస్వామిని కాల్చేశారు. అలాకాల్చేస్తే పేదోళ్ళయుద్ధం ఆగిపోతుందనుకున్నారు. మరి ఆగిపోయిందా, లేదు, ఆగిపోలా. ధనవంతుల ప్రభుత్వం నాశనం అయేంతవరకూ పేదోళ్ళందరూ యుద్ధం చేస్తూనేవుంటారు.

పిల్లలూ! విన్నారుగా మన బాలవీరులకథ. పేదోళ్ళ రాజ్యంకోసం భూస్వాముల, పెట్టుబడిదారుల ప్రభుత్వం గుండెల్లో పిడుగులయిన, పిల్లలకథ. మరి మీరు కూడా మన బాలవీరుల మార్గంలోనే నడుస్తారుకదూ! పేదోళ్ళ రాజ్యంకోసం కూలన్నలతో రైతన్నలతో కలిపి యుద్ధంచేస్తారు కదూ!

వై. వి. మధాకర్

కొడుకు

బా, అతని భార్య రాత్రి చాలా పొద్దుపోయేవరకు మేలుకునే ఉన్నారు. బాకు దాదాపు నలభై సంవత్సరాల వయస్సుంటుంది. అతనికంటె అతని భార్య ఓ రెండు మూడేళ్ళు చిన్న. కాళ్ళు బారచాపుకుని, వీపుని స్తంభానికానించి, అరుచాపమీదకూచున్నాడతడు. చాలా సేపటివరకూ ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు. అకస్మాత్తుగా, బిగించిన తన పిడికిలితో నేలనుగుద్దుతూ

"నేను అలా నిశ్చయించాను" అన్నాడు బా.

అతనిభార్య ఏమీ మాట్లాడలేదు. కాని ఆమె కళ్ళలో నీరు నిండుకుంటున్నది. ఆమె ముఖం దయనీయంగా కనిపిస్తోంది. ఆ రాత్రి ప్రశాంతతని భంగపరుస్తూ అప్పుడప్పుడూ వాచ్‌టవర్‌నుండి తుపాకి కాల్పులు వినవస్తున్నాయ్. కాని ఆ 'ఆదర్శగ్రామం' లో అది చాలా సహజమయిన విషయం. ఎవరూ ఆ కాల్పులను పట్టించుకోరు. ఆ కాల్పుల ప్రతిధ్వనులాగిపోగానే, వెదురుబద్దలపరుపుపై నిద్రపోతున్న ఒక పదహారుసంవత్సరాల పిల్లవాడి గురకశబ్దం మళ్ళీ వినిపిస్తోంది.

బా కాళ్లుముడిచి, పైకిలేచి, ఒళ్లువిరుచుకున్నాడు. బిడ్డల పరుపువద్దకునడిచాడు. అతని భార్యకూడా పైకిలేచి అతనిదగ్గరకొచ్చింది.

"వాడెప్పుడెళ్తాడు?" ఆమె గొణిగింది.

"ఇంకాతెలీదు. కాని త్వరలోనే అని నేననుకుంటున్నా. మొదట నేను టు సైనికుడినికలిసి ఈ విషయం చర్చిస్తాను, టు డ్యూటీలోకెక్కగానే వాడు పోతాడు."

"దేవుడా!"అంటూ దుఃఖంలో ముఖాన్నికప్పుకుంది అతనిభార్య.

"అరె! ఏమయింది. మీ ఆడవాళ్ళు కదిలిస్తే కన్నీళ్లు పెట్టుకుంటారు. నేను ఒకటి అడుగుతాచెప్పు! ట్రంగ్ బలవంతంగా సైన్యంలోకి చేర్చుకోబడటంనీకిష్టమేనా?"

అతని భార్య కన్నీళ్లు తుడుచుకుంటూ అలాగే నిలబడింది. ఆమెకు తన భర్త గురించి బాగా తెలుసు, గుణవంతుడు. ఒకసారి ఒక నిశ్చయానికొచ్చాడంటే యిక వెనకడుగెయ్యడు. తమకొడుకు ట్రంగ్‌గురించి ఆమెతో రెండువారాలనుండి మాట్లాడుతున్నాడు. ఈ 'ఆదర్శగ్రామం' తమ కొడుకుని అతడు ఎట్టిపరిస్థితుల్లో ఉండనివ్వడు. ఆమె ట్రంగ్ సామాను సిద్ధం చేయాలి. అతడు, ఆ పిల్లవాడు పోవడానికి ఏర్పాట్లు చేస్తాడు. "ఎక్కడికి?"ఆమె అడిగింది. "విముక్తిసైన్యంలోకి", అతడు ఆమె చెవిలో చెప్పాడు. మళ్ళీ అన్నాడు, "ఎవ్వరికీ, చివరికి ట్రంగ్‌కుకూడా ఈ విషయం చెప్పొద్దు, వాడి సామాను సిద్ధంచేయి. గుడ్డలు కట్టిపెట్టు. మనం పొదుపుచేసిన రెండు

పందల పియాస్త్రా*లను ఖర్చుచెయ్యొద్దు. అవి వాడు ఇల్లువదిలి వెళ్ళినాక వాడి ఉపయోగంకోసం. వాడు మనకొక్కడే కొడుకు. నాకు తెలుసు. కాని నేను ఈ విషయాన్ని మళ్ళీమళ్ళీ ఆలోచించాను. వాడు బలంగాఉన్నాడు. బలవంతంగా కీలుబొమ్మ సైన్యంలోకి చేర్చుకోబడే వయస్సువస్తోంది. ఆ గుండాగుంపుల పంజాకెరఅయ్యేటట్టున్నాడు వాడిప్పుడు. మనం త్వరగా ఒక నిర్ణయానికిరావడం మంచిది. వాడు విముక్తి సేనలలోకిపోవడం మంచిది. వాళ్ళు వాడిని ఒక మనిషిగా తయారుచేస్తారు. నిజమే ; వాడిచేతికి ఒక తుపాకిస్తారు. వాడు దాన్ని దేశద్రోహులను చంపడానికుపయోగిస్తాడు. వాడు పోరాడుతూ మరణించినా నేను సంతోషిస్తాను."

తనభర్త మొదటిసారి తనతో ఈ విషయం గురించి మాట్లాడినప్పుడు, ఆమె భయపడింది. ఈ 'ఆదర్శగ్రామం'లో ఇంతమంది దొంగలు, దుర్మార్గులమధ్య ఆమె భయపడకేంచేస్తుంది. నిజంగా భయంతో వణికిపోయింది. కాని ఆమె ఆ విషయం గురించి మళ్ళీ మళ్ళీ ఆలోచించి బా నిర్ణయం సరిఅయినదన్న నిశ్చయానికొచ్చింది. ట్రంగ్, వాళ్ళకొక్కడే కొడుకు. తొందరలోనే బలవంతంగా కీలుబొమ్మసైన్యంలోకి చేర్చుకోబడే వయస్సులో కడుగుపెడతాడు. ఈ కీలుబొమ్మసైనికులు వాడిని తప్పకుండా తీసుకెళ్తారు. అవును. బా సరిగానే అన్నాడు. ఆరోజువరకు వాళ్ళు చేతులు ముడుచుకుని కూర్చోలేరు. అయినా, ఆమెభర్త సరియైన నిర్ణయానికొచ్చాడని ఆమెకు తెలిసినా, అది ఆమె బాధను తగ్గించలేకపోయింది. ఆమెకు ఆరోజుల్లో నిద్రపట్టడం లేదు. అప్పుడప్పుడు, తాను, పదహారు సంవత్సరాలక్రితం ఏ పరిస్థితుల్లో కొడుకును కన్నదో ఆలోచిస్తున్నది. ఆరోజు రాత్రి... దూరంగా... కొత్తగా ఏర్పరచిన ఫ్రెంచి మిలిటరీ క్యాంపునుండి, తుపాకీకాల్పులు వినవస్తుంటే, వీక్వాక్‌డాన్☆కు చెందిన నర్సు ఆమెకు సహాయంచేసింది. బిడ్డకు అవసరమయిన పొత్తిగుడ్డలను కూడా వీక్వాక్‌డాన్ ఇచ్చింది. అప్పుడు వాళ్ళు పేదరైతుకూలీలు. పాత గోనెసంచుల ముక్కలను అతుకుపెట్టి తమ గుడ్డలను కుట్టుకునేవారు. ఆ మరుసటి సంవత్సరమే విప్లవ ప్రభుత్వం వారికి రెండుహెక్టారుల భూమినిచ్చింది. అప్పటినుండి కష్టాల్లేకుండా బతుకుతూ పిల్లవాడిని పెంచుతున్నారు. కాని మూడునెల్లక్రితం డియమ్ ప్రభుత్వం సైనికులొచ్చి ఇంటి నుండి, భూమినుండి వారిని వెళ్ళగొట్టారు. వాళ్ళు ఇంటికప్పు ఎక్కి దానిని నాశనం చేస్తుంటే బా వాళ్ళను అడ్డగించ ప్రయత్నించాడు. ఒక సైనికుడి కాలుపట్టుకు లాగి వాడిని కిందపడేశాడు. ఆ తొత్తుకొడుకులు తమ తుపాకీ మడమలతో బాను స్పృహ

---

*(దక్షిణ వియత్నాంలో చలామణిలో ఉండే ద్రవ్యం- అను.)

☆(మాతృభూమి రక్షణకోసం ఏర్పడిన సైన్యం. ఇదే ఆ తరువాత వియత్నాం ప్రజాసైన్యం అయింది.)

తప్పేటట్టు కొట్టి, భార్య, బిడ్డలతోసహా బయటకీడ్చారు. ఇప్పుడు, జైలులాంటి ఈ ఈ 'ఆదర్శగ్రామం'లో బంధింపబడ్డారు. ఇక్కడ నిరంతరం బెదిరింపులకింద, అణచివేతకింద చాలా దుర్భరజీవితాన్ని గడుపుతున్నారు. ఇప్పుడు ఇక బలవంతంగా తమ కొడుకుని కీలుబొమ్మ సైన్యంలోకి చేర్చుకోవడం అన్న భయంకర విషయం జరుగబోతోంది. వాళ్ళనుభవించిన అన్ని బాధలకంటే ఇది భరించరానిది.

"విప్లవం మనకు దున్నుకోడానికి భూమినిచ్చింది." బా అప్పుడప్పుడూ భార్యతో అంటుండేవాడు "మన కొడుకుని పెంచుకోడానికి అవకాశానిచ్చిన విప్లవానికి మనం చాలా రుణపడిఉన్నాం. ఇప్పుడు ట్రంగ్ బలవంతంగా డియమ్ సైన్యంలో చేర్చుకోబడడానికి ఒప్పుకుంటామా? వాడు విప్లవానికి వ్యతిరేకంగా తన తుపాకిని గురిపెట్టడానికొప్పుకుంటామా? మనం రుణాన్ని తీర్చుకునే పద్ధతి అదేనా?"

నిజంగా చెప్పాలంటే, బా భార్య అతని నిర్ణయాన్నెన్నడూ వ్యతిరేకించలేదు. ఒకవారంనుంచే ఆమె రహస్యంగా తన కొడుకు ప్రయాణానికవసరమయిన వాటిని సిద్ధం చేస్తున్నది. కాని ఆమె ఎంతబాధపడుతున్నదో! తన కొడుకు తనని శాశ్వతంగా వదిలి వెళ్తుంటే నిశ్చితంగా ఏ తల్లి అయినా ఉండగలదా?

పరుపుపైన బా గురకపెట్టడం మొదలెట్టాడు. అతని భార్యకు నిద్రపట్టడంలేదు. ఆమె లేచికూర్చుంది. కిరోసిన్ దీపపు గుడ్డివెలుతురులో తన కొడుకువైపు చూసింది. చాలా వేడిగా వుండటం మూలంగా ట్రంగ్ చొక్కా తీసేసి నిద్రపోతున్నాడు. ఆమె మెల్లిగా అతని చేతిని నిమిరింది: అదిగట్టిగా బలంగా ఉంది. ఆమె బిడ్డ ఒక బలిష్టమయిన యువకుడయినాడు. ఆమె తన కుట్టుసామాను పెట్టెకోసం వెదికింది, దీపాన్ని దగ్గరగాతెచ్చి కొడుకు చొక్కాలు కుట్టడం మొదలెట్టింది సూదిలోకి దారంఎక్కిస్తూంటే ఆమెకళ్ళు మళ్ళీ చెమర్చి మసకబారాయి. మధ్యమధ్యలో డాన్ వె* తుపాకీ కాల్పుల శబ్దాలు గాలిని చీల్చుకుని వస్తున్నాయి. అడుగుల శబ్దం ప్రతిధ్వనిస్తోంది రక్షకదళాల బూట్ల శబ్దాలవి. ఇవేకాకుండా ఆ గ్రామం అంతా పూర్తి నిశ్శబ్దం, భయంకరమయిన నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. నాల్గు మూలలాఉన్న వాచ్‌టవర్‌లపైన దీపాలు రాక్షసి నేత్రాల్లా ఉన్నాయి. ఊరి చుట్టూతాఉన్న ముళ్ళ తీగకంచె, చుట్టూతాఉన్న కందకంలోని నీటిలో ప్రతిబింబిస్తోంది.

* * *

"అదీ నేను నీకు చెప్పాలనుకున్నది. నువ్వు పోతావా?" బా తన కొడుకును అడిగాడు. ట్రంగ్ కొంతసేపు అలానేచూచొని తరవాత తండ్రివైపు దృష్టినిలిపాడు బా మళ్ళీ అడిగాడు:

---

* (కీలుబొమ్మ రక్షక భటులు)

"పోతావా? భయపడుతున్నావా?"

ట్రంగ్ తటాలున పైకిలేచాడు. తండ్రివైపు చూడకుండా ఇలా అన్నాడు "నేనెందుకు భయపడతాను? నువ్వు ఇప్పుడు చెప్పిన విషయాన్ని నేను చాలాసార్లాలోచించాను. ఈ క్షణమే పోవడానికి నేను సిద్ధంగా ఉన్నా. రాత్రికే ఎందుకు పోవాలి? నేను పట్టపగలే పోతాను!"

"కాదు, బాబూ, ఎవరికీ కనపడకుండాపోవడం మంచిది. రాత్రిపూట అది చాల సులభం. నేను టు సైనికుడితో మాట్లాడాను. అన్నిటికంటె ముఖ్యమయిన వాచ్‌టవర్ వద్ద టు తొందరలోనే డ్యూటీలో కెక్కుతాడు తుపాకి కాలుస్తాడు. నామటుకు, నువ్వు అపుడే పారిపోయినట్టుగా నటిస్తాను.

తండ్రి చెప్పింది సరిఅయినదే అనుకున్నాడు ట్రంగ్. కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండి తర్వాత ఇలా అన్నాడు.

"నేను పోయింతర్వాత వాళ్ళు నిన్ను ఎన్నో కష్టాలకు గురిచేస్తారు."

"బాధపడవద్దు. నువ్వు ఇక్కడినుండి పారిపోతావు గదా! అంతేచాలు. వాళ్ళు తుపాకీమడమలతో నన్ను కొట్టినా నేనేమీ లక్ష్యపెట్టను."

ఆ పిల్లవాడు కదలకుండా కూచున్నాడు. కనురెప్పలాడిస్తూ, తాను వెళ్ళిపోయింతర్వాత ఏంజరుగుతుందా అని ఆలోచిస్తున్నాడు. అమ్మకి కట్టెలు ఎవరు కొట్టిపెడతారు? తననిగురించే ఆలోచిస్తూ అమ్మ కుమిలిపోతూ ఉంటుంది. అతని ఆలోచనల్లో బాధ, ఆనందం రెండూ కలగాపులగం అయినయి. కాని తాను ఒకనాటికి తన విముక్తి సైన్య సహచరులతో తిరిగొస్తాడు తన తలిదండ్రులకు, చిన్నాన్న, చిన్నన్నలు నాన్ టామ్‌లకు, వారి కూతుళ్ళు లాన్, క్యూలకు విముక్తి నికలిగిస్తాడు. ఇక్కడి గార్డులను, మిలిటరీని పూర్తిగా తుడిచిపెడతాడు. ప్రహరీలను, కంచెలని నాశనంచేస్తాడు. ప్రజలవైపున్న సైనికులను టు, చిన్‌కోలను వదిలేసి మిగతావాళ్ళని... అవును... ఆ నదిలో పారేస్తాడు— అతని కళ్ళముందు యుద్ధదృశ్యాలు మెదిలినయి.

"ఒకసారి నువు విముక్తి ప్రాంతంలోకి ప్రవేశించగానే బాగా పరిశ్రమించే, చురుకుగా కదిలే పిల్లవాడుగా ఉండాలి. అర్థంఅయిందా? కష్టాలనన్నిటినీ అధిగమించాలి. వాళ్ళు నిన్ను విముక్తి సైన్యంలోకి తీసుకుంటే చాలామంచిదే. కాని నీకు కొరియర్ పని ఇచ్చినా విరాకరించొద్దు. నీకప్పగించిన ఏపనినయినా ఆమోదించు. సరేనా?"

అతని తండ్రి ప్రత్యేకంగా చివరిపదాన్ని ఒత్తిచెప్పాడు తండ్రి తనకు చెప్పిన విషయాన్నే మళ్ళీమళ్ళీ చెప్పటం ట్రంగ్‌కు బాధనిపించింది. విప్లవంలోచేరితే కష్టాలు సహజం. అతను వాటికేం భయపడడు. అతడు నదులీదాడు. బురదతో నిండిన

వరిపొలాల్లో పనిచేశాడు. ఒకసారి రెండు మూడు రోజులు తిండిలేకుండా ఉన్నాడు. ఆకలి అన్నది భరించరానిదే కావచ్చు కాని అతడు తాను ఏమాత్రం నిరుత్సాహం చెంద నని ప్రతిజ్ఞ తీసుకున్నాడు. అతని కామ్రేడ్స్ భరించగలిగిన కష్టాలను అతనుకూడా భరించగలడు. ట్రంగ్ బయటకు చూశాడు. ఆ ముళ్ళకంచె అవతల సగం కట్టిన బురుజులు, ప్రవహిస్తున్న నది, విశాలమయిన పొలాలు, ఆ తరువాత ఆకుపచ్చని చెట్లవరుసలు; అక్కడే ఉంది మీ హీప్ గ్రామం. దాని తరవాత తన సొంతఊరు టాన్‌హీప్. అతడు నదిని ఈదుతాడు— అది చాలాసులభం. ఆ పనిని నాలుగుసార్లపైగా అతడుచేయగలడు. అతడు పరుగుపరుగున వేగంగా విశాలమయిన ఆ పొలాల్ని దాటేయగలడు. అవును ఆపని కష్టం ఏంకాదు...

"అసలు ముఖ్యమయిన విషయం......" తండ్రి గొంతు మళ్ళీ వినిపించింది.

"మళ్ళీ అదే ముఖ్యమయిన విషయం......" అనుకున్నాడు ట్రంగ్.

"అసలు ముఖ్యమయిన విషయం, నువ్వు ఎంతో ధైర్యంతో ఉండాలి. మన ఆశయం ఎంతో గొప్పది కాబట్టి మనం మి-దియమ్*దళాలకంటె ఎప్పుడూ కూడా విరుద్ధంగా ఉంటాం. వాళ్ళు ఏక్షణంలోనైనా కాళ్ళకుబుద్ధిచెప్పడానికి సిద్ధంగాఉంటారు. కాని మనవాళ్ళు ఇంకా ఆదేశాలిచ్చి ఇవ్వకముందే దాడిచేయడానికి సిద్ధంగాఉంటారు!"

ట్రంగ్ తనలోతను ఆలోచిస్తూ తండ్రివైపు చూశాడు. "అరె, ఒక సైనికుడు ఆదేశం ఇవ్వకముందే దాడిచేయడమా"! ఆ ఆలోచన అతనికి హాస్యాస్పదమనిపించింది కాని తన ఆశ్చర్యాన్ని బయటకు చూపడానికిగాని తండ్రి అభిప్రాయం తప్పని చెప్పడానికిగాని సాహసించలేదు. బాకు ముక్కుమీద కోపం ఉంటుంది. కోపంవస్తే అతడిని కొట్టడానికి వెంటకూడా పడతాడు! కాని తన తండ్రి తనను, తనతల్లిని ఎంత గాఢంగా అభిమానించేదీ ట్రంగ్‌కు తెలుసు. తన అభిమానాల్ని బయటకు చూపించడం అతనికి ఇష్టంలేదు. అతని తల్లి ఎంతో మెత్తటి మనస్సు కలది. కొడుకంటే ఎంతో ప్రేమ. అతడు వెళ్ళిపోయింతర్వాత తప్పకుండా దుఃఖిస్తుంది, అతడొక్కడే బిడ్డ కావడం చాలా బాధాకరమయిన విషయం. అతని చిన్నాన్నకూతురు క్వ్యా కు ఉన్నట్టే, అతనికీకూడా ఒక చెల్లెలుండిఉంటే అతని తల్లికది కొంత ఓదార్పుగా ఉండేది. ఆమె అప్పుడు వంటింట్లో పని చేసుకుంటున్నది. కొత్తవంటకాల వాసన వస్తోంది. ఏమిటది? అతనికిష్టమయిన కోడిగుడ్డుకూర, రొయ్యలకూర కావచ్చు. వాటిని అతడు తిని చాలా రోజులయింది. కారణమేమిటంటే ఆ 'అదృశ్యగ్రామం'లో రొయ్యలను సంపాయించడం అంత సులభంకాదు. వాళ్ళను ఆ ఊరిలో మందవేయక ముందు రొయ్యలను పట్టుకో

---

*(అమెరికా-దియమ్)

దానికి టాన్ హీప్ దగ్గర కాలవకుపోయేవాడు. అంతలోతులేని ఆ కాలవలో కొద్ది నిముషాలు తిరిగితే మంచి రొయ్యలు దొరికేవి. కాని ఇక్కడమాత్రం తింటానికి రొయ్యలుండవు. 'ఆరోజు ఉదయం, ఆతని తల్లి, మార్కెట్‌కు పోవడానికి 'రక్షక భటుడు' హాఉ్‌వద్ద ప్రత్యేక అనుమతి పత్రాన్ని సంపాదించింది. ఆమె కొన్ని రొయ్యలను తెచ్చింది ఎనిమిది రొయ్యలు పదిహేను పియాస్ట్రెలు; వాటికోసం జాగానే ఆమెడబ్బు ఖర్చు పెట్టింది.

అతనితల్లి భోజనానికి పళ్ళాలను, పుల్లలను* (Chop sticks) ఏర్పాటుచేసింది. అపుడే అడుగుల చప్పుడు వినబడింది. హాఉ్ వచ్చి తలుపువద్ద ఆగాడు. తన డెక్రాన్ పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని ఫాషన్‌గా నిలబడి ఇంట్లోకిచూస్తూ అరిచాడు "ఏమ్ ఈరోజు సాయంత్రం రాజకీయ అధ్యయన తరగతి ఉంది. చాలా ముఖ్యమయిన విషయం: ప్రభుత్వంయొక్క విశాల దృక్పథం" ఏమీ సమాధానం రాకపోగా మరోసారి గొంతు చించుకున్నాడు।

"ఏమైంది. అందరూ చచ్చారా? ఇంట్లో ఎవరూ లేరా?"

బయటకు పోకుండానే, లోపలినుంచే బా అన్నాడు "నేనున్నాను" "అంత పెద్ద నోటిని మూసుకుకూచున్నావే?" అడిగాడు 'రక్షకభటుడు'. "ఇటుచూడు, అధ్యక్షుడు గోడిన్ డియమ్ విశాలదృక్పథంపై అధ్యయన తరగతికి, ఈరోజు సాయంత్రం సమావేశ స్థలానికి పొండి వియత్‌కాంగ్‌లననుసరించిన నీ బంధువులెవరైనా ఉంటే వాళ్ళ మార్గాన్ని మార్చుకోమనిచెప్పు... ఆహా... ఎంతమంచి వాసన। ఏంవండుతున్నారు?"

"ఆ ఏదో...కోడిగుడ్డుకూర మాకు బియ్యం అయిపోయాయి..."

"బియ్యం అయిపోతే కోడిగుడ్డుకూరా? మీరు అంత ధనవంతులా? ఇక్కడకు తెచ్చినా మీ మొండితనం వదల్లేదు"

"మేం ధనవంతులమేకావచ్చు, కాని..."

"ఇక ఆపు .. నువ్వు ఏమని షికాయత్ చేయబోతున్నావో నాకు తెలుసు... పెరుగుతున్న ధరలు... ప్రతివస్తువూ దొరకడం కష్టం ఆయిపోయింది...ఇంకా అదీ ఇదీ."

'రక్షక భటుడు' వెళ్ళిపోగానే, బా తనలో తను గొణుక్కున్నాడు: "విశాల దృక్పథం? రేపు, నాకొడుకుని నేను వియత్‌కాంగ్‌లవద్దకి పంపుతున్నా।"

అన్నంతినగానే పెన్ను, సిరా తీసుకురమ్మని కొడుకు నాదేశించాడు బా, మిలిటరీవాళ్ళు ఎవడూ లోపలికిరాకుండా కొడుకుని వాకిలిదగ్గర కాపలాకాయమన్నాడు. తన స్వంత రెకమెండేషన్ లేకుండా కొడుకునతడు విప్లవంలో చేరనివ్వడు. పెన్ను పేపరు

మీద పెట్టబోతుంటే ఏదో పవిత్రమయిన విషయం అతని మెదడుకు తట్టింది. పండుగ రోజున జండాకు సెల్యూట్ చేస్తున్నట్లుగా, మృతవీరులసమాధిముందు తలవంచినట్టుగా అతడు భావించాడు. అతడికళ్లు చెమర్చినయి. చెయ్యి వణికింది పెన్ను కదిపి ఒక మాట రాసేటప్పటికి చాలా సేపయింది. ఇలా మొదలుపెడదా మనుకున్నాడు: "వయసుమళ్ళిన నా భార్యకు, నాకు ఒకదే బిడ్డ. "కాని దీర్ఘంగా ఆలోచించినతరువాత ఇలా రాశాడు" "నా భార్యకు. నాకు ఒకదే కొడుకు" అది ఇంకా బాగా అనిపించింది

టా, గూనివాడులా పరుపుపై కూర్చుని, ఒక్కొక్క అక్షరాన్ని జాగ్రత్తగా రాస్తున్నాడు. ట్రంగ్. ఒక పౌడిదగ్గు దగ్గినప్పుడు తొందర తొందరగా పేపరును చాప కింద దాచేసేవాడు. మళ్ళీ సంజ్ఞచేసినపుడు పేపరు బయటకుతీసి రాయడం కొనసాగించేవాడు, ఆరోజు ఉదయమంతా ఆ ఉత్తరం రాయడానికే సరిపోయింది. అటువంటి ఉత్తరాన్ని అంతకుముందెప్పుడూ అతడు రాసి ఉండలేదు.

*　　　*　　　*

వాళ్లు తమ సాయంత్రపుభోజనాన్ని మామూలువేళకంటె యింకా ముందుగానే ముగించారు. టా భార్యకు అన్నం ముట్టుకోబుద్ధి పెయ్యలా ఆమె తన పళ్ళాన్ని నోటివరకు తీసికెళ్తుంది. మళ్ళీ కిందపెట్టేస్తుంది ట్రంగ్‌కుకూడా అంత ఆకలిగా లేదు. అతని తండ్రి ఒకడే ఆ కుటుంబంలో ఎప్పటిలా ప్రశాంతంగా తిన్నది. వాత్సల్యం పెల్లుబుకుతూంటే కొడుకుతో ఇలా అన్నాడు:

"తిను, బాబూ తిను. కడుపునిండా తిను. మీ అమ్మ చేతిమీదుగా నువు తినే చివరి భోజనం ఇదేగావచ్చు తిను."

ఈమాటలు వినగానే అతనిభార్యలేచి పరుపువద్దకుపోయి అక్కడ వెక్కివెక్కి ఏడుస్తూ కూచుంది. ట్రంగ్ భోజనాన్ని త్వరగా ముగించిలేచాడు. అతడు ధృడమైన కంఠంతో ఇలా అన్నాడు:

"ఏడ్వకమ్మా, నువ్వు సంతోషించాలి తొందరలో చీకటిపడుతుంది. నా సామానేదీ?"

"ఇదిగో ఇక్కడుంది."

ఆమె అతనికి ఒక చిన్నమూట నందించింది: దుస్తులున్న ఆ మూటని తన రుమాలు (scarf) తో కట్టింది. ట్రంగ్ ఆ మూట తీసుకుని నేలమీద కూర్చున్నాడు. ఆ రుమాలునుండి ఘాటైన చెమటవాసనొచ్చింది. అతని కళ్ళు చెమర్చినయి. తల్లికి చూపడమిష్టంలేక ముఖాన్ని పక్కకు తిప్పుకున్నాడు. తను విముక్తిసైన్యంతో ఎక్కడకుపోయినా, ఈ విలువైన రుమాలుని తనతోనే ఉంచుకుంటాడు, అని తనలో తాను

తున్నాడు. అపుడు అమ్మ తనపక్కనే ఉన్నట్టనిపిస్తుంది. అతని పక్కనే ఆమె కూర్చుని, అతని చేతుల్లోకి ఒక చిన్న మూటను పడేసింది. "నీ కోసం ఇదిగో కొంత డబ్బు" ఆమె అంది.

ట్రంగ్ మూట విప్పాడు: 450 పియాస్టర్ నోట్లనుచూశాడు ఒకటిమాత్రం తీసుకుని మిగతావి తిరిగిచ్చేశాడు.

"ఒక సైనికుడికి అంతడబ్బు అవసరంలేదు" అతడన్నాడు. కాని అతని తల్లి బలవంతంచేయడంమూలంగా చివరికాతడు ఇంకో నోటు తీసుకోవాల్సి వచ్చింది.

ఇంతలో బా బయటకువోయి తిరిగొచ్చాడు.

"నేను టూ తో మాట్లాడాను," అతడన్నాడు "అంతా బాగానేవుంది "

"నాన్నా ఇక బయల్దేరనా?" అడిగాడు ట్రంగ్,

"ఇపుడేకాదు. కొంత రాత్రి గడిచేదాకాఆగు. ఇదిగో, ఇది తీసుకో..."

తను రాసిన ఉత్తరాన్ని కొడుకుకందించాడు:

"ఇది జాగ్రత్త. మీ హీప్‌పార్టీశాఖ కార్యదర్శి. చిన్‌టామ్‌మామకీఉత్తరాన్నివ్వు. నువ్వు అతన్ని కలవకపోతే, నీకు కలిసిన ఏ విముక్తిసైన్యం మనిషికైనా, గెరిల్లాకైనా ఇవ్వచ్చు సరే. ఇక కొద్దిసేపటిలో నువ్వు పోబోతున్నావు టు డ్యూటీలో వున్న ముఖ్యద్వారంనుంచి నువ్వుపో. అతడు నిన్ను పోనిస్తాడు. నువ్వు నది దాటంగానే తుపాకీకాల్చిన శబ్దం వినవస్తుంది. భయపడక్కరలేదు అది టు తుపాకికాల్చే శబ్దం. రోడ్డు ఎక్కంగానే ఆ రోడ్డువెంబడేపోవద్దు ఆ రోడ్డుపై వలలుపన్ని ఉంచుతారు, కాలవనిదాటు."

"బాగుంది!" ట్రంగ్ అన్నాడు. కాని అతని తల్లి ఇంకా బాధపడుతున్నట్టు కనిపించింది.

దాదాపు ఒకగంట గడవంగానే తన తండ్రి చుట్టుప్రక్కల ఎవరూలేరని రూఢి చేసింతర్వాత, ట్రంగ్ ఇంటినొదిలాడు. కొంత దూరంనడిచి అతడు వెనక్కి తిరిగి చూశాడు. వాకిలికానుకుని నిలబడివున్న తన తల్లి నీడ అతనికి కనిపించింది. ఆమె వెక్కివెక్కి ఏడుస్తూ ఉంటుందని అతనికి తెలుసు

ట్రంగ్ ఆ 'ఆదర్శగ్రామం' ముఖ్యద్వారాన్ని చేరుకున్నాడు. ద్వారం కొంచెం తెరిచి వుంది. అతను ఇంకొంచెం తలుపునుతోసి బయటికి జారుకున్నాడు. చివరికి ముళ్ళతీగెకంచెను దాటి పొలాలుచేరుకోగానే, తన మూటని భుజంపైనపెట్టుకుని పరిగెత్తటం మొదలెట్టాడు. గాలి చాలా విసురుగా వీస్తోంది. కొద్దిసేపయింతర్వాత ఊపిరి తీసుకోడానికి కొంతసేపు ఆగాడు. పల్లెలోపటికంటె యిక్కడ వాతావరణం

భిన్నంగా ఉన్నట్టతనికనిపించింది. నది ఒడ్డున తన బట్టలనువిడిచి వాటిని పైగుడ్డలో చుట్టాడు. తలపై మూటను ఒకచేత్తోపట్టుకుని నదిని ఈదటం మొదలెట్టాడు. అతని తండ్రి చెప్పినట్టుగానే ఆవలివొడ్డుచేరబోతూండగా తుపాకీ కాల్చినశబ్దం వినిపించింది. ప్రశాంతంగా ఒడ్డెక్కి, బట్టలేసుకుని, వెనక్కితిరిగి ఊరివైపు చూశాడు. వాచ్‌టవర్ దీపాలు, ఫ్లాష్‌లైట్ల కిరణాలు కనిపించినయి. "వాళ్లు వెదకడం మొదలెట్టారన్న మాట" అనుకున్నాడతడు.

రోడ్డంచుకు వచ్చేటప్పటికి రాత్రిలో చాలాభాగం గడిచిపోయింది అతనితండ్రి సూచనలననుసరించి. మళ్ళీ బట్టలు విడిచేసి కాలవలోకి నడిచిపోయాడు. నీళ్లు గుండెల వరకే ఉన్నయి. అతడు కొంతదూరంపోగానే అవతలివొడ్డునుండి కేక వినిపించింది.

"ఎవరక్కడ ?"

"నేనే," అతడు సమాధానమిచ్చాడు.

"నేనంటే. ఎవరు ?"

"నేను...నేను 'ఆదర్శగ్రామం'నుండి వచ్చాను...నన్ను ఒడ్డుచేరనివ్వండి..."

కాలవగట్టుపైన ఒక నీడ కనిపించింది. తరవాత ఇంకోటి. అతనివైపు తుపాకీలు గురిపెట్టబడ్డాయి. ఫ్లాష్‌లైట్ కాంతి అతన్ని గుడ్డివాణ్ణి చేసినట్టనిపించింది.

"ఉన్నదొక్కడే...ఒక చిన్న పిల్లవాడు...."

తరువాత ఆకంఠం అతన్ని అడిగింది:

"అయితే నువ్వు 'ఆదర్శగ్రామా'న్నుండి వచ్చావన్నమాట, కదూ ? నీతో ఇంకెవరయినా ఉన్నారా ?"

"లేదు. నేనొక్కడినే."

ట్రంగ్ ఒడ్డు ఎక్కాడు. బట్టలేసుకుని చిన్‌టామ్ మామని చూడాలని అడిగాడు. అతనెక్కడికో పోయాడని వాళ్ళన్నారు. వారిలో ఒకడు ముందుకొచ్చి అడిగాడు :

"నువ్వు మాకేమైనా చెప్పాలనుకుంటున్నావా?"

ట్రంగ్ కొద్దిసేపు ఆలోచించి అన్నాడు:

"అవును."

"మంచిది, రా."

ట్రంగ్ ఆ మనిషిని అనుసరించాడు. అతడు ట్రంగ్‌ని కాలిబాటమీదుగా ఒక ఇంటికి తీసుకెళ్ళాడు. ఆ మనిషి ఒక దీపం వెలిగించి, ట్రంగ్‌ని బాగాచూసింతర్వాత ఇంకో మనిషిని పిలిచాడు. వచ్చినతను కూచుని కళ్లు నులుముకుని అడిగాడు:

"ఏమిటి విశేషం?"

"ఒక చిన్న పిల్లవాడు 'ఆదర్శగ్రామం'నుండి ఇప్పుడే వచ్చాడు. అతడు నిన్ను చూడాలనుకుంటున్నాడు."

"అతడెక్కడ"

ట్రంగ్ ధైర్యాన్ని కూడదీసుకుని అన్నాడు:

"నేను ఇక్కడే ఉన్నాను."

జేబునుండి తన తండ్రి ఇచ్చిన ఉత్తరాన్నితీసి ఆ మనిషికందించాడు.

"ఈ ఉత్తరాన్ని చిన్‌టామ్ మామకివ్వమని మానాన్న చెప్పారు." ఒకవేళ నే నాతన్ని కలవలేకపోతే, నేను కలిసిన ఏ విముక్తి సైన్యం మనిషికయినా, గెరిల్లాకైనా ఇవ్వవచ్చు."

గెరిల్లా నాయకుడు ఆ ఉత్తరాన్ని తీసుకుని దీపంవద్దకొచ్చాడు. దట్టమైన కనుబొమలు ముడివడుతూంటే ఆ ఉత్తరం చదవడం మొదలెట్టాడు. వ్రాత పెద్దదిగా, మోటుగా ఉంది:

విప్లవ విముక్తి సైన్య సోదరులారా,

నా భార్యకు నాకు ఒకడే కొడుకు. మేమిప్పుడు ఈ 'ఆదర్శగ్రామం'లో బంధించబడ్డాము. గడచినరోజుల్లో మాకు దున్నుకోడానికి భూమినిచ్చి, మా జీవితాలు సుఖంగా గడవడానికి కారణమైన విప్లవానికి మా కృతజ్ఞతలు, విప్లవానికి, పార్టీకి మేం ఋణపడివున్నాం. నా కొడుకు (ఈ ఉత్తరం తీసుకొచ్చినవాడు) పెరిగి పెద్దవాడయ్యాడు, విప్లవానికి వ్యతిరేకంగా పోరాడడానికి, అతడిని దియమ్‌సైన్యంలోకి బలవంతంగా చేర్చుకోబడనివ్వను. కాబట్టి విప్లవానికి ఒక కానుకగా వాడిని మీవద్దకుపంపుతున్నాను. వాడు యింకా కుర్రవాడు. అనుభవంలేనివాడు. వాణ్ణి మనిషిగా తీర్చిదిద్దండి. మీకు మేము ఎంతో కృతజ్ఞులమయిఉంటాం.

గుయెన్ వాన్ ణా, పేదరైతు.

సంతకం కింద మసి, కొబ్బరినూనె మిశ్రమంలో వొత్తి వేసిన వేలిముద్రలు— బొటనవేలు, చూపుడువేలువి— ఉన్నాయి. గెరిల్లానాయకుడు ట్రంగ్‌వద్దకు వచ్చి అతడి భుజాల్ని తట్టాడు.

"ఓహో! నువ్వన్నమాట," అతడన్నాడు, ఆ పిల్లవాడిని అదే మొదటిసారిగా చూస్తున్నట్టు. "నీ తండ్రి నిన్నిక్కడికి పంపాడు కదూ?"

ట్రంగ్ చిరునవ్వునవ్వి తలూపాడు. నాయకుడన్నాడు:

"నీ మామ చిన్‌టామ్, నీ గురించి నాకు చెప్పాడు మంచిది. నువ్వు ఇక్కడ ఉండొచ్చు. నువ్వు మాతోనే వస్తావేమో. చాలా పొద్దుపోయింది. నిద్రపో. ఇంకా వివరంగా రేపొద్దున మనం చర్చించుకుందాం. నాకు చాలా పెద్ద దోమతెర ఉంది. లోపలికిరా!"

ఆన్ డక్ రాసిన 'ది సన్' దక్షిణ వియత్నాం కథకు

స్వేచ్ఛానువాదం: **పి.ఎస్. కుమార్.**

నిజమైన స్నేహితురాలు

మూలం: **కావో-షా**

స్వేచ్ఛానువాదం: **గోపి**

ఎవరైనా నీకు మంచి స్నేహితురాలు ఎవరని నన్ను అడిగితే చెన్ సియావో-ఫెన్ అని చెప్తాను.

విముక్తికి ముందు మేమిద్దరం షాంఘైలోని స్కూల్లో ఒకేతరగతిలో ఉండే వాళ్ళం. మేమిద్దరం జతగా రహస్య కార్యకర్తలను కలిసేవాళ్ళం. మేమిద్దరం సమాన వయస్కులమైనప్పటికి నేనే పెద్దవాడిననుకొని ఆమె నా మాట వినితీరాలనుకునేవాడిని.

ఒకరోజు మేము సియావో-ఫెన్ యొక్క మిద్దెమీదిగదిలో రహస్యవార్తాపత్రికలు ముద్రిస్తున్నాము. షాంఘైప్రజలకు ప్రజావిముక్తి సేనలు యాంగ్సీనదిని దాటాయని త్వరలోనే షాంఘై విముక్తి చేయబడుతుందని తెలిపే సమాచారంవున్న పత్రికలు అవి. ఎప్పుడయినా మేము జరగబోయే విముక్తి గురించి ఆలోచించినప్పుడు చాలా సంతోషించేవాళ్ళం.

ప్రతులను ముద్రించడం సమస్యకాదు. నేను ఇంటివద్ద మా అన్నయ్య అదివాలా సార్లు చేయడం చూశాను. సియావో-ఫెన్‌కు ఎలాచెయ్యాలో నేను చూపెడదామను కున్నాను. సియావో-ఫెన్ స్టెన్సిల్ పట్టుకొంది. దానిమీద బ్రష్‌తో సిరా పూస్తాను. కాని ఎక్కడో తప్పు జరగడంవల్ల తొందరగా స్టెన్సిల్ చిరిగింది. సియావో-ఫెన్ దాన్ని చక్కబర్చడానికి విశ్చయించుకుని "సిరా చాలా చిక్కగావుంది. మనం కొంత కిరోసిన్ తప్పకుండా కలపాలి" అంది.

నాకు చిరాకేసింది. ముద్రణావ్యవహారం గురించి ఆమెకు నాకన్న ఎక్కువగా తెలుసునా? అది నేనెప్పుడూ ఒప్పుకోను. "దానికి యింకా కిరోసిన్ అవసరంలేదు" అన్నాను.

బ్రష్‌ను సిరాలో లోతుగా ముంచి స్టెన్సిల్‌మీద వీలున్నంతపలుచగా పూయడం మొదలుపెట్టాను. కాని నేను అనుకున్నట్టు జరగలేదు. సిరా ముద్రించిన అక్షరాల మీద తప్ప స్టెన్సిల్ అంతటా ముద్దలుగా అతుక్కుపోయింది.

గాబరాతో నాకు చెమట బాగాపట్టింది. ముఖాన్ని చేతులతో తుడుచుకున్నాను. "హె!"అంటూ సియావో-ఫెన్ నవ్వడం మొదలుపెట్టింది.

నాకు నిజంగా కోపం వచ్చింది "పెద్దక్క వూ ఏమిచెప్పిందో మర్చిపోయావా?" నేను గద్దించాను. "శత్రువుతో పోట్లాడడం మనకు తేలికైనవిషయంకాదు. నువ్వేమో ముసిముసినవ్వులు నవ్వుతున్నావు."

సియావో-ఫెన్ వెంటనే గంభీరంగా మారింది. ఆమె ఒక కిరోసిన్‌సీసాచూసి సిరాలో కొంచెం కలిపింది. సిరా నిగనిగలాడుతూ ఉపయోగించడానికి వీలుగా తయారయింది.

నేను ఇంకా కోపంగావున్నాను. కాని తరువాత అక్కయ్య వూ చెప్పిన మరో విషయం జ్ఞాపకం వచ్చింది. ఈ రాత్రి రహస్యకార్యకర్తలు కళాశాలలో పెద్దక్కలు అన్నలతోకలిసి వార్తాపత్రికలు ముద్రించి పంచిపెట్టే కార్యక్రమాన్ని చేపట్తారు. ఆమె మాకు అప్పగించిన బాధ్యత ఈ సాయంత్రం ఎనిమిది గంటలలోపు పూర్తికావాలంది. సమయాన్ని వృధాచేయవద్దు.

నేనేమీ మాట్లాడకుండా బ్రష్ తీసుకుని సిరాలోముంచి స్టెన్సిల్‌మీద పూస్తూ పోయాను. వార్తాపత్రికయొక్క పేజీలు ఒకటి తర్వాత ఒకటి తయారయినాయి. "మన సైన్యము వస్తున్నది..."అంటూ పాడడం మొదలుపెట్టాను.

కొద్దిదూరంలో సాయుధంగావున్న కారుసైరను కీచుమన్నది. విప్లవ ప్రతీఘాతకులు మళ్ళీ ప్రజలను హఠాత్తుగా పట్టుకుంటున్నారు. "ఎంతసేపు వీళ్ళిలావుంటారో చూడు"అంది సియావో-ఫెన్ చాలా కోపంతో.

వార్తాపత్రికలన్నీ సాయంత్రంవరకు ప్రచురించాము. తర్వాత మాత్రమే నా కాళ్లు చాలా నొప్పితో బిగుసుకుపోయినట్టు చాలా కష్టంగా నిలబడ్డానన్న విషయం గమనించాను.

సియావో-ఫెన్ ఒక కాగితాలకట్ట తీసుకొని దానితో నా ముఖాన్ని తుడవడం మొదలుపెట్టింది. అది నన్ను బాధించడంవల్ల ఆమెను ఆపమనికోరాను. కాని ఆమె చాలా కోపంతో "నీవంక చూసుకో. ముఖంనిండా సిరావుంది. అది వీధుల్లోని గూఢాచారులదృష్టిని ఆకర్షిస్తుంది అంది.

చివరకు నాముఖం శుభ్రంగా అయింది. కాని చాల బాధగా నొప్పిగావుంది.

మేము వార్తాపత్రికలను చాలావరకు తుక్కుగుడ్డలతోచుట్టి వాటిని కట్టకట్టాము. మిగిలినవాటిని మా మేజోళ్ళలోనో, బెల్టులలోనో దోపాము.

సియావో-ఫెన్ వాళ్ళ అమ్మమ్మదగ్గరనుండి మూడురొట్టెలు తెచ్చింది. మేమిద్దరం చెరొకటి తీసుకున్నాం. మూడవది సియావో-ఫెన్ నాజేబులోకి గట్టిగాతోసింది.

మేము రెండు వీధులు దాటినతరువాత కొద్దిదూరంలో సైరన్ విన్నాము. ఎంత దురదృష్టం? కట్టుబ్బాట్లు! అన్నిదిక్కులనుండి కొమింటాంగ్ పోలీసులు ప్రజలను ఆపి బాధిస్తున్నారు. నా హృదయం ముక్కలైనట్టు అన్పించింది. నేను మోస్తున్నమూట సీసంలా బరువుగాతోచింది.

ఆకస్మాత్తుగా సియావో-ఫెన్ నాదగ్గరనుండి మూటను లాక్కొని ఒక్క అరుపు అరిచింది. నాకు చాలా విచిత్రంగాతోచి ఇదంతా ఏమిటని అడుగుదామనుకుంటుండగా ఆమె ఏడవడం మొదలు పెట్టింది. "ఈ... మామకు జ్వరము అతడు చచ్చిపోతున్నాడు."

తనిఖీకోసం నిలపెట్టబడ్డ జనాల్లోంచి ఒకడు జాలితో "అయ్యో పాపం. ఆమె మామ చచ్చిపోతున్నాడు మీరు ఎందుకు ఆమెను పోనియ్యరు" అన్నాడు. గుంపులో జాలి పెరిగింది. సియావో-ఫెన్ ఏడుపు బిగ్గరయ్యింది. "దౌర్భాగ్యురాలా నీఏడ్పుల వల్ల ఏమవస్తుంది. ఇక్కడనుంచి వెళ్ళిపో" అంటూ తిడ్తూ చివరకు పోలీసులు ఆమెను పోనిచ్చారు.

సియావో-ఫెన్ చాలాదూరం పోయింది. తరువాత వరుసలో నేనున్నానుతనిఖీకి. పోలీసు నావైపు మామూలుగా చూశాడు. తరువాత నా జేబుమీద దృష్టిపడి ఆశ్చర్యపోయి నావైపు తీక్షణంగాచూశాడు. "చేతులు తీసివేయి. ఏమిటది? అక్కడేముంది?"

శత్రువు నన్ను పసికట్టాడు కనుక నేను చాలా శాంతంగా ఆలోచించాల్సివుంటుంది. నన్ను పరీక్షించుకోవలసిన సమయం వచ్చింది. యువ కార్యకర్తలతో కలిసి నప్పుడు చేసిన ప్రతిజ్ఞనూ, అక్కయ్య వూ సలహానూ జ్ఞప్తికితెచ్చుకున్నాను. ఒక్క క్షణం కలవరపడ్డాను. కాని నేను భయపడలేదు. ధైర్యంగా వీరుడివలె నిలబడ్డాను.

పోలీసు నా జేబులో చేయిపెట్టాడు. ఎప్పుడైతే అతడు బయటకు గట్టిగావున్న రొట్టె తీసాడో ప్రజలందరు నవ్వారు.

"అది బాంబు" అని అన్నాడొకడు హాస్యానికి.

అసహనంగా పోలీసు రొట్టెను నేలమీద విసిరేసి నన్ను వెనకనుంచి ఒక్క తోపు తోస్తూ "వెళ్ళిపో" అని అరిచాడు. శాంతంగా వంగి నేను రొట్టెనుతీసుకున్నాను దాన్ని

వదులుకోవడం ఇష్టంలేక, నేను పట్టుకున్నది బాంబుకన్న శక్తివంతమైనదని అతనికి తెలవదు కనుక చాలా సంతోషించాను.

కాసేపటికి నేను నిర్ణయించుకున్న సమావేశస్థలానికి వెళ్లాను. నాకోసం ఎదురు చూస్తూ సియావో-ఫెన్ అదివరకే అక్కడికి వచ్చివుండటం గమనించాను. అది కొద్ది మంది బిచ్చగాళ్లమాత్రమే ఆశ్రయించుకున్న విశాలమైన సందు. సందుమొదట్లో పలచని వీధిదీపపు-కాంతి పడుతున్నది.

పత్రికలను చొక్కాలోదూర్చి కొన్ని సాయంత్రం వార్తలు చంకలకిందపెట్టుకొని సందుగుండాపోతూ రెండువైపులావున్న ప్రతి యింటి తలుపుకిందనుండి ఒక పత్రికను తోస్తూ వెళ్ళిపోయాము. "సాయంత్రంవార్తలు! రండి వచ్చి మీ సాయంత్రంవార్తలు తీసుకోండి"అని అరుస్తూ పోయాం.

మా పత్రికలన్నిటినీ పంచిపెట్టిన తరువాత సందుచివర మా అన్నయ్య చంకలో ఒకపాకెటు పెట్టుకొని అతని స్నేహితునితోకలిసి నడుస్తూ వస్తుండడం చూశాను. మా అన్నయ్య విశ్వవిద్యాలయంలో విద్యార్థి. అతడు కమ్యూనిస్టుపార్టీ సభ్యుడన్న విషయం నాకు సూచనగా తెలుసు, కాని నన్ను పసివాడుగాచూస్తూ తన విషయాలగురించి అడగడానికి అవకాశం యిచ్చేవాడుకాదు చాలాసార్లు నేను యువకార్యకర్తలతో కలిసి పనిచేస్తున్న విషయం అతనికి చెప్పదామనిపించింది. కాని కార్యకర్తల ప్రతిజ్ఞకు కట్టుబడి వుండటానికీ, దానిరహస్యాలను దాచాలికాబట్టి నేనేమిచెప్పలేదు.

మా అన్నయ్య నడుస్తూనే నన్ను చూశాడు. కాని నన్ను ఏమాత్రం పట్టించుకోలేదు. నాఎడల అతడు అలా ప్రవర్తించడం నాకు యిష్టంలేదు. తరువాత అతడు విషసర్పాన్ని చూసినట్టుగా వెనక్కి తిరిగి తొందరగా వెళ్ళిపోవడం మొదలుపెట్టాడు. నేను వేగంగానడుస్తూ అతడిని పట్టుకోడానికి ప్రయత్నించాను. అన్నయ్య నన్నునెట్టేసి "పోరా దయ్యం వెధవా"అన్నాడు కర్కశంగా.

'అతడు ఇంకా నన్ను పిల్లవాడివలె చూస్తున్నాడు. అది నాకు చాలా కోపం కలిగించింది. నేను చొక్కాను పైకిలేపి బెల్టులోవున్న వార్తాపత్రికలను బయటపడేట్టు చేశాను. నాకు బాగా అనిపించింది. "నావైపుచూడు, నేను దయ్యాన్నికాదు. షాంఘై త్వరలోనే విముక్తి చేయబడుతుంది"అని అరిచాను.

అకస్మాత్తుగా 'కదలకు' అన్న గొంతు వెనకనుంచి కర్కశంగా వినవచ్చింది. కాలరుపట్టి హఠాత్తుగా లాగారెవరో. నేను గూఢచారులకు దొరికినట్టు గ్రహించాను.

మా అన్నయ్య తన స్నేహితునికి పాకెటు ఇచ్చి తొందరగా వెళ్ళిపొమ్మని సైగ చేశాడు. తరువాత అతడు గూఢచారి చేతిని పట్టుకొని "పిల్లవాడివి పట్టుకొని ఏమిచేస్తున్నావు నువ్వు పోనీయి"అంటూ అరిచాడు.

అన్నయ్య నన్ను వదిలించడానికి నెట్టాడు కాని గూఢచారి నన్ను అణచిపట్టుకునడంవల్ల నేను కదలలేకపోయాను. ఈసారి నేను పట్టుబడ్డాననుకున్నాను. ఇదంతా నావల్లనే. అప్పుడే సియావో-ఫెన్ "దొంగను పట్టుకోండి. అతడు నా బట్టలు తీసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. సహాయం చేయండి" అంటూ అరుచుకుంటూ పరుగెత్తుకొచ్చింది.

ఆమె అరుపులకు ఉలికిపడి గూఢచారి వెళ్ళిపోయాడు. నేను వీధికడ్డంగా వీలైనంతవేగంగా పరిగెత్తిపోయి సందుదాటాను. తల బద్దలౌతున్నది. నా మొదటి ఆలోచన మిగిలిన వార్తాపత్రికలను పారవేద్దామని కాని నన్ను నేను సరిదిద్దుకున్నాను. మంచి కార్యకర్తను అవుతానా? అప్పుడునేను సిగ్గుపడాల్సినపని. నా ధైర్యాన్ని కూడగట్టుకొని మిగతా పత్రికలను పంచిపెట్టాను. తృప్తిగా ఊపిరిపీల్చాను. పని సక్రమంగా జరిగినందుకు సంతోషంగావుంది.

తర్వాత నిర్మానుష్యంగావున్న వీధిగుండానడుస్తూ మా అన్నయ్యా, సియావో-ఫెన్‌లగురించి ఆలోచించాను. వాళ్లు గూఢచారులచేతిలో పడలేదుకదా? కార్యకర్తల ప్రతిజ్ఞను మరచి శతృవుముందు బయటపడటం ఇం అంతా నా తప్పు. ఆ విషయం ఆలోచించినపుడు భయం అనిపించింది.

అక్కయ్య వూను కలవడానికి మేము నిశ్చయించుకున్న స్థలం కియావోచా పార్కువైపు మెల్లిగా నడిచాను.

సియావో-ఫెన్ కియావోచా పార్కులో కూర్చొని వుండడంచూసి సంతోషించాను. 'ఎంత అదృష్టం' అంది ఆమె బరువుగా ఊపిరిపీలుస్తూ. "ఆ గూఢచారి కుక్క నన్ను గట్టిగా పట్టుకున్నాడు. నాదగ్గర ఒక్క పత్రికకూడా లేకుండింది."

"మా అన్నయ్య ఏమయ్యాడు" అడిగానునేను. "అతడు వెళ్ళిపోయాడు. నువ్వు అతన్ని నాశనంచేశావు. నువ్వే" మాట ముద్దగావుంది అప్పుడు చూశాను నేను ఆమె ముఖమంతా వాచివుంది. ఇప్పుడు అర్థంచేసుకున్నాను. నన్ను, మా అన్నయ్యను రక్షించడానికి గూఢచారుల దెబ్బలకు లొంగకుండా నిలబడింది. సిగ్గుతో నాముఖం వాలిపోయింది. చెంపలమీదుగా కన్నీళ్ళు ప్రవహించడం మొదలుపెట్టాయి.

సియావో-ఫెన్ నావైపు ఆశ్చర్యంగాచూస్తూ "కన్నీళ్ళెందుకు కారుస్తున్నావు. ఇవ్వాళ సంతోషంగావుండాలి. మనం మన పనిని పూర్తిచేశాం. నేనేమి ఆలోచిస్తున్నానో నీకు తెలుసా? ప్రజావిముక్తి సేనలకు ఎలా స్వాగతమివ్వాలని నేను ఆలోచిస్తున్నాను. అక్కయ్య వూను అడగడానికి మనం పోదాంపద!"

అకస్మాత్తుగా సియావో-ఫెన్ నిజంగా నాకంటె పెద్దదనిపించింది. ఆమె పరిస్థితులను నాకంటె బాగా అర్థంచేసుకుంటుంది.

తెలంగాణా పోరాట సాహిత్యం

కె. వి. రమణారెడ్డి

(గత సంచిక తరువాయి)

3

ఆంధ్ర మహాసభ ఒక మహానదిలాంటి సంస్థ. పుట్టినప్పుడు అది బహుచిన్నది విద్యా, సాంస్కృతిక పునరుజ్జీవనం అప్పటిలో దాని ప్రధానలక్ష్యం. క్రమంగా అది రాజకీయంలోకి చొరబారక తప్పలేదు. అలా దాని రాశిబలమూ విరివిగాకా తప్పలేదు.

కుడిఎడమల స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీలు నిలవగా, ఆంధ్ర మహాసభ తెలంగాణా జీవిత రంగస్థలాన ప్రధానభూమిక ధరించింది. వకీళ్ళూ విద్యావంతులూ దీని తొలినాయకులూ సభ్యులూ. నిజాంటోపీనీ దస్తారునూ ధరించే ఈ నాయకుల్ని 'దస్తారు నాయకుల'ని పిలిచే కొత్తతరహా నాయకత్వం త్వరలోనే తలెత్తింది. 1939-40 లలో పెంపెయ్యసాగిన కమ్యూనిస్టు గ్రూపులు ముదిరి గట్టిపడి ఐక్యంకావడానికి ఎంతోకాలం పట్టలేదు, కొలనుపాక. పులిగిల్లవంటిచోట్ల 1940-41లలో జాగీర్దార్లకు వ్యతిరేకంగా లేచిన ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించినందుకు. కొండా వెంకట రంగారెడ్డి నాయకత్వానగల ఆంధ్ర మహాసభనుండి కమ్యూనిస్టుల గెంటివేత జరిగింది. ఈ పరిస్థితిలో భువనగిరి మహాసభ సమావేశమైంది. కమ్యూనిస్టులు నల్లగొండ జిల్లాలో చేర్పించిన వేలాది సభ్యత్వాన్ని 'దస్తారు'నాయకులు రద్దుచేశారు. కొన్ని కట్టుదిట్టాల తోటి ఇరుపక్షాలు సభ్యత్వంచేర్పించే కార్యక్రమాన్ని తీవ్రంగా కొనసాగించాయి. ప్రజా యుద్ధ పంథా విమర్శగానీ ప్రజాసామాన్యంలో కమ్యూనిస్టు వ్యతిరేకతను కలిగించిలేక పోయాయి. 1944 భువనగిరి మహాసభలో రావి నారాయణరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నిక గాకముందు అ స్థానంలోఉండిన మందుముల నరసింగరావు రానున్న ప్రమాదాన్ని గుర్తించి పోటీసంఘ నిర్మాణానికిగూడా ప్రయత్నించసాగాడు, ఈ ప్రయత్నాన్ని ఒక ప్రజాకవి ఎలా నిరసించాడో చూడండి:

ఎందుకయా పోటిసంఘం మందుములయ్యా,
ఉన్నసంఘము చాలును, పులిజాల రంగయ్యా
ఆంధ్ర మహాసభలో మమ్ము చేరమంటిరీ
చేరినంక దొరలా బలపరచుచుంటిరీ
ఈ ప్రజా ప్రవాహము నెదురీదలేరయ్యా
ఇందులోనె కొట్టుకొనీ పోయెదరయ్యా

జరిగిందికూడా అదే. "ఆంధ్రమహాసభ కదుగు దెంచుడీ జనులారా మీరు" అంటూ దాశరధి కృష్ణమాచార్యులు ప్రబోధించి పిలిచినకాలం అప్పుడే గతానికిచెందిపోయింది.

దాని జాతీయవాదదశ ప్రజాతంత్ర దశతోటి సంగమించడం మొదలైంది. 1944-45 తర్వాత ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుపార్టీ ఒకదానికొకటి పర్యాయపదమనేంతగా పెన బడసాగాయి. "లేలెందోయ్ రారందోయ్/రైతులు కూలీలందరుగలసి/ఆంధ్ర సంఘములో చేరండోయ్"అనే గేయంలో వినిపించేది పండితకవికిశోరుని గొంతుకకాదు. పామర ప్రజాకవి గొంతుక. "తెలుగుబాబులు"మాత్రమే నిద్రలేచేట్లుగా దాశరథి ప్రబోధించి ఉండవచ్చు. రైతుకూలీలను నిద్రలేపింది ముఖ్యంగా ఇతరులు. సుంకర సత్యనారాయణగారి 'కష్టజీవి' బుర్రకథ అప్పటికే బహుళ ప్రచారంలోఉంది. ప్రజల లోంచే సాంస్కృతిక దళాలు ఏర్పడుతున్నాయి. "కావ్యధాత్రికి జీవగర్ర"(గంగినేని) అయిన తెలంగాణాలో పోరాటంతాకిడికే ఎన్నో మొగ్గలు వికసించి కవిత్వాన్ని వెదజల్లుతున్నాయి. అత్తవారింటికనివచ్చి తెలంగాణా గ్రామంలో స్థిరపడిపోయిన పల్నాటిసీమ మనిషి తిరునగరి సీతారామాంజనేయులు అవసరాన్నిబట్టి అప్పటికప్పుడే కవి, గాయకుడు అయిపోయాడు. "ఆంధ్రమహాసభ/ఆంధ్రమహాసభ/ఆంధ్రమహాసభ అదిగదిగో/చంద్రకిరణకళ/ఇంద్రధనుస్సన/ఆంధ్రస్టేటులో వెలిసిందీ"అని గొంతుముడి విప్పుకొన్నాడు.

దీనికి కొంతముందుగా, జనగామ తాలూకాలో మొదలై సాగిన పోరాటానికి బందగీ అనే ముస్లిం యువకుహత్య నాందిగా నిలిచింది: 'పైరవీకారు'గా జగమెరిగిన విసునూరి దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి తాలూకు గూండాలు బందగీదారిగాచి చంపగా, ప్రజలు గూండాలకు దేహశుద్ధిచేసి బందగీకి సమాధికట్టించి ఉర్సు చెయ్యసాగారు. "బందగి రక్తంబుచింది జ్వాలై లేచి/ జాగీరుదారులను ఊగించివేసింది" (మాభూమి) తెలంగాణా విప్లవజ్యోతిని బందగీ తన మరణంద్వారా వెలిగించాడు.

ఆరుట్ల రామచంద్రారెడ్డి నాయకత్వాన విసునూరిదొరకు వ్యతిరేకంగా పొంగిన లావాకెరటం త్వరలో పేదఖళ్ళ వ్యతిరేకోద్యమంగా పరిణమించింది. అప్పులు తీర్చలేని జనం భూముల్ని ఆక్రమించివేసిన దొరలు ఆ జనంమీదికి తమ గూండా బలగాన్ని పురమాయించసాగారు. కడవెండిగ్రామాన విసునూరిదొర గడీని జనం చుట్టుముట్టగా, గూండాల తుపాకికాల్పులకు పల్లయ్య. కొమరయ్యలు ప్రాణాలు వదిలారు. కొమరయ్య మరొక సంకేతమయ్యాడు. "నీపేరు నిలుపకనె కొమరయ్యా, నిదురైన మేంబోము కొమరయ్యా"అని జనం సంకల్పం చెప్పుకొంది.

జనం దృష్టిలో. కింగ్‌కోఠీలో కూర్చున్న నైజాంగాక, ఊరూరా గడీల్లో కూర్చున్న గ్రామసింహాల్లాంటి. బెబ్బులుల్లాంటి దేశ్‌ముఖ్‌లూ. చిరతపులుల్లాంటి రేచుకుక్కల్లాంటి పటేల్‌పట్వారీలు, గిర్దావర్లు, గూండాలు మాత్రమే ప్రత్యక్షశత్రువులు. వట్టికోట ఆళ్వారుస్వామినవల 'ప్రజలమనిషి' గ్రామజీవితంలో తొలికదలికనువర్ణించి,

వాక్స్వాతంత్ర్యాలులేని అరణ్యరాజ్యంలో అమలుజరిగే ఆటవికధర్మాన్ని చిత్రిస్తుంది. అది ప్రస్తుత పోరాటదశకు ఎంతో వెనకటిది 'గంగు' మరికొంచెం ముందుకు వచ్చి, భూమి సమస్యను ప్రముఖంచేసి నిలుపుతుంది. బస్తీలలో మొదలైన చైతన్యం గ్రామాల్లోకి అలసాగుతూంది. నవాబు పరిపాలనాయంత్రాంగం స్టేటుకాంగ్రెసుజాతీయ వాద నాయకత్వం గ్రామపెత్తందారీవర్గం ముప్పేట గొలుసుగామారి, వర్గవిభేదాలు కత్తితో ఖండితంగా గీసినవిధంగా స్పష్టమౌతున్నాయి. ఆంధ్రమహాసభ కొత్తకరకెక్కుతూంది. అది సంధిదశమాత్రమె. అళ్వారుస్వామి నవలాకారుడేకాదు, చరిత్రకారుడు కూడా. కాళోజీ అన్నట్టు విప్పారసాగిన ఆ పోరాటచరిత్రలో తాను ఒక రేకే. జాతీయ వాదంతోపాటుగా సామ్యవాదానికి అనుకూలమైన ప్రజాతంత్ర చైతన్యం పొటమరించిన తొలిసంజకు చెందినరచనలే అళ్వారుస్వామివి. దాశరథి పద్యరచనలుకూడా అప్పటివే. అదంతా ఒక పాతరాతియుగం.

కిరాతకత్వం వెయ్యిన్నొక్క రూపాలుధరించిన రోజులవి- గొల్లపూడి నారాయణ 'పాతరోజులు'. ఒక నిరంకుశ రాజరికం అలాంటి వేలాది చిన్న రాజరికాలను తనకు సజీవ స్తంభాలుగా నిలిపిపెట్టిన రోతరోజులు, అమలుజరిగేదంతా అక్రమమే, అధర్మమే, కటిక కసాయీ స్వార్థమే ఖానూన్‌కు నిజంగానే మదంతో కళ్లుపూడుకు పోయాయి: నల్గొండజిల్లా మిగిలిన జిల్లాలాంటిదే. ఆ జిల్లాను ఆనుకొనిఉన్న పల్నాటి సీమ నాగరికతకూ నాజూకుకూ పేరుమోసిందేమీకాదుగాని, నల్గొండతోపోలిస్తే అది స్వర్గమే. స్థానంమారిన తిరునగరి సీతారామాంజనేయుల మాటల్లో-

"అక్కడి ప్రజాజీవితంచూచేసరికి గుండెలవిసిపోయాయి. తల తిరిగిపోయింది. ప్రజలంతా గ్రామంలోని నలుగురైదుగురు పెత్తందార్లకు బానిసలై బ్రతుకుతున్నారు, దారుణమైన వెట్టిచాకిరి, అంతకన్నా దారుణమైన అధికార్ల జులుం. నిత్యం తన్నులు, తిట్లు, కచ్చేరి చావిళ్ళవద్ద వంగబెట్టి మూపునబండలు. బండలేకాదు, రైతులమూపున గ్రామ వెట్టివానిని ఎక్కించి తొక్కించేవారు, పండిన పంటనంతా 'లెవీ'లనీ 'తావాను' లనీ 'నాగూ'లనీ 'నజరానా'లనీ దోచుకునేవారు." బూడిదపట్టీ, పెండ్లిపట్టీ, సమర్త పట్టీలు సరేసరి. అది మధ్యయుగాలనాటి భూస్వామ్య దోపిడీ. బొడ్డుపల్లెను కోల్పోయి వడ్డెరాజులచేతిలో శ్రీనాథ కవికూడా అలాంటి యమదండనలను చవిజూసి ఉండకు. అవి ఇక్కడ నిత్యకృత్యాలు.

ప్రజలను హింసించు ప్రభువుమాకేల
వధియింప భక్షింప వనరాజులేడా?

అని కాళోజీ అన్నాడు. వనరాజు ఒక్కడుమాత్రంకాదు. అక్రమపరుడు ప్రతివాడూ దొరే. ఈ దొరోళ్ళ దుండగాలగురించి తెలంగాణా ప్రజలు కట్టుకొన్న పాటలుచూస్తే

అనాటి సంఘ చిత్రం సాక్షాత్కరిస్తుంది. విసునూరి దేశ్‌ముఖ్ తల్లిని 'అమ్మా' అనగూడదు. ఎదురుప్రశ్న వేస్తుంది. 'దొరసానీ'అంటే ఆక్షేపిస్తుంది. 'దొరా' అనమంటుంది. అది మనిషికాదు, బ్రహ్మరాక్షసి. దేవరుప్పుల గ్రామానికిచెందిన బేతు క్రిష్ణారెడ్డి అబ్బసలీ దానిబంట్లు. కొమరయ్య ఉసురుతీసింది వీళ్లే. తర్వాత ప్రజలకు దాసోహం అన్నారనుకోండి. ఇలాంటి 'చిల్లరదేవుళ్ళ'తో 'గ్రామశక్తుల'తో తెలంగాణానిండి ఉండేది.

అ తల్లికి పుట్టినబిడ్డ విసునూరి రామచంద్రారెడ్డి. వాడి పొలంలో పొద్దుగూకులూ పనిచేయడమేగాక రాత్రిపూట పెద్దలాంపులుతెచ్చి అ కాంతిలో పనిచెయ్యాలి. పసిపిల్లల తల్లులు బిడ్డలకు రొమ్ముగుడిపివస్తాము పోనిమ్మంటే పోనీడు. పైగా కుమ్మరి ఎంకుల్ని పిలిచి నూరు బొడ్డుగిన్నెలు తెప్పించి, ఆడవాళ్ళను వాటిలో చనుబాలు పిండమంటాడు.

ఒక రొమ్ము పిండితే వుయ్యాలో
గిన్నె నిండీపాయె వుయ్యాలో
కాతెమ్మ రొమ్ములా వుయ్యాలో
పాలు నిలబాడేను వుయ్యాలో.

ఆ పాలను పొలంలో చల్లిస్తాడు; చల్లిస్తున్న రక్తమూ స్వేదమూ చాలదన్నట్టు: పని విడిచి పోయేవాళ్ళను పొర్లించి కొడుతాడు. వెరగొల్ల సత్తెమ్మ ఎదురుమాట్లాడిందని గుర్రాన్ని కొట్టే రేజనాతో కొడుతాడు వాడు మనిషికాదు, మహిషం. జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి మరొక మకిరిదున్న. సూర్యాపేట తాలూకా ఎర్రబాడు జమీందారు. విసునూరి దేశ్‌ముఖు ఆడవాళ్ళకు హడలి గుర్రం ఎక్కి బంగ్లాకు పుతాయిస్తే, వీడు తన ఘాతుకాలకు తగినశిక్ష అనుభవిస్తాడు. ప్రజలు వీడి ఆస్తిని ధ్వంసంచేస్తారు. దొడ్లన్నీ కాలి ఎడ్లన్నీవెళ్లిపోగా, వీడు "బండెనుక బండికట్టి/పదహారు బండ్లుకట్టి" పారిపోతాడు. సూరిగాడు, మల్లిగాడు అనే వీడి కింకరులను బతుకనీయమంటూ—

పెద పంది సూరిగాడు
పిన పంది మల్లిగాడు
మీ ఇద్దర్నీ తింటం కొడకో
నా కొడుకో ప్రతాపరెడ్డీ

అని ప్రజలు శాపనిస్తారు. అది ముందుకథ అనుకోండి. ప్రస్తుత కథ మరొకటి. దొరల దుర్మార్గాలను వర్ణించే ఒక వుయ్యాలపాటలో ప్రజల స్థితి—దుస్థితి—చూద్దాం. రైతులు దిక్కుమొక్కులేక దిక్కుకూలీలౌతున్నారు. వెట్టిచాకిరి అమలుజరుగుతూంది. "గడిచుట్టు నలుగురు వుయ్యాలో/మాలమాదిగల కాపలా వుయ్యాలో॥ కచ్చడాలముందు వుయ్యాలో / కావలి కుక్కల్లాగా వుయ్యాలో॥ నిత్యం ఉరుకాలి వుయ్యాలో / మెప్పు

పొందేదాక వుయ్యాలో॥ ప్రతిరోజు యిద్దరూ వుయ్యాలో/పట్టాలి కావలైన వుయ్యాలో॥ నిద్రబట్టేవరకు వుయ్యాలో / నిక్కముగా వత్తాలి వుయ్యాలో॥ గడిలోని పనులన్ని వుయ్యాలో/దినమంత జెయ్యాలి వుయ్యాలో॥ ఏరోజు ఎవరన్న వుయ్యాలో/కాదుకూడ దన్న వుయ్యాలో॥ తిండిలేకున్నాను వుయ్యాలో / జ్వరమొచ్చి పడివున్న వుయ్యాలో॥ ఆ సమయములో దొరల వుయ్యాలో/ఆర్భాటముజూడు వుయ్యాలో॥ లంజకొడుకుల్లార వుయ్యాలో/ఎందుకు రాలేదని వుయ్యాలో॥ కన్నులెర్రజేసి వుయ్యాలో / పండ్లు పటపట గొరికి వుయ్యాలో॥ చింతబరిగెలతోటి వుయ్యాలో / చితుగగొట్టెను వీపు వుయ్యాలో॥" మరోపాటలో దొరలు "భోజగద్దలరీతి" బీదల మాంసంతిని బొమికలు మిగిలించి, "కాలు చెప్పులరీతిగా"ఎంచుతున్నట్లు కవి రాశాడు

గడీముందు చావడిలో దొర కూర్చునివుండగా యితరులు ఆదారంట ఎదురుబడి పోవడమా ! వెళ్ళదలిస్తే, దూరాన కాళ్ళచెప్పులువదిలేసి తలరుమాలుతీసి కాల్మొక్తు తా దొరా అంటూ చేతులు జోడించుకొని మరి వెళ్లాలి. కట్టా సమ్మారెడ్డి అనే మరోదొర గురించి ఎస్ గోపాలకృష్ణ రాసిన వుయ్యాలపాటలో తక్కువ కూలిరేట్లు, పిచ్చుముంతల, నాగుల, పెచ్చుల, ప్రస్తావన వస్తుంది. మరొక ప్రాంతంలోనైతే పంటపండించుకొన్నందుకు రైతు శిస్తుకడుతాడు. ఈరాజ్యంలో మాత్రం శిస్తులుకట్టేందుకే పంట పండించుకోవలసినట్లుంది. పంట కళ్లాలనుంచే లేవీగల్లాపేరులో రైతుపండించినధాన్యం దొరగడీకో పటేల్‌గరిశెకో చేరిపోతుంది. రసీదులుండవు. ఒకమారు సర్కారుకు కట్టిన దాన్నే మళ్లీ కట్టమంటారు పట్వారీలు. ఇవి అల్ప, క్షుద్రమృగాలు. పటేల్ కుక్కైతే పట్వారీ నక్క. వీరి అన్యాయాలను పేర్కొనే ఒక పాటలో–

పేదోళ్ళము శక్తికొద్ది
పోశమ్మకు పెట్టుకుంటె
కోడిపిల్ల మామూల
కొట్టి తీసుకుంటారా ?

అని మాలిపటేలునూ పోలీసుపటేలునూ పట్వారీలనూ జనం ప్రశ్నిస్తారు.

కాలము మారినది
కవిపెట్టి తిరుగండి
కావ్వెక్కి గొర్రెపోతు
కొండకు తాకవద్దు

అని హెచ్చరిస్తారుకూడా.

పాటల్లో సూచనగా కనిపించే ఈ సంఘచిత్రం కథల్లో నవలల్లో పాకల్యంగా కాకున్నా ప్రముఖంగా కనిపించవలసిందే, తప్పదు. 'ప్రజలమనిషి', 'గంగు'మొదలు

చేసుకుని, 'ఓనమాలు'. 'మృత్యువు నీడల్లో', 'మృత్యుంజయులు', 'చిల్లర దేవుళ్లు' 'మోదుగుపూలు' వరకు ఆళ్వారుస్వామి, మహీధర, బొల్లిముంత, రంగాచార్యల్లాంటి నవలాకారులు, పొట్లపల్లి రామారావు, తుమ్మల వెంకటరామయ్య, రాంషా, శారద వంటి కథకులు, సుంకర-వాసిరెడ్డి, తిరునగరి వంటి నాటక కర్తలు తమ తమ శక్తి మేరకు ఈ చిత్రాన్ని సమకూర్చారు. "ఓనమాలు"లో మహీధర చేసిన వర్ణన దీన్ని సూక్ష్మంలో ఇమిడిస్తుంది.

"పల్లెటూళ్ళలో దొరలది మకుటంలేని రాజరికం, చట్టం ఎరగని శాసనాధికారము. ఒక్క కులం పెద్దరికంవలన లభించిన పెత్తనంమాత్రమే కాదు డబ్బు, భూమి. కులం, దర్పం, ధాష్టీకం- వీటన్నింటి మిశ్రణం ఆ దొరతనం."

ఆంధ్రమహాసభ భువనగిరి సమావేశం తర్వాత, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా మొదలైన వుద్యమంలో, అది వూరూరా వెలసింది. గ్రామపేదలకు అది "సంగం"ఐంది. గుణాత్మకమైన ఈ పరిణామం తెలంగాణా పోరాటాన్ని మరింత ఉన్నతదశకు– వర్గపోరాటదశకు తీసుకెళ్లింది. జనం యిక ఏమాత్రమూ ఒక మూగజీవాల మందకాదు, పాల్వంచప్రాంతంలో కోయలుకూడా కదిలి తమ పంటగురించి పంతాలకుపోసాగారంటే, జనగామప్రాంతాలలో లంబాడీలు పోరాటానికి ఉపక్రమించారంటే, ప్రజల చైతన్య స్థాయిలోనే పెనుమార్పొకటి వచ్చిందనాలి. కోయలు పాడుకున్న ఒకపాటను తెలుగు చేస్తే, వాళ్ళ మనోభావాలు అర్థమౌతాయి: మనం తెచ్చే విత్తులు తెస్తూవున్నాం, నాటే విత్తులు నాటుతూవున్నాం. పుట్టే మొక్కలు పుడుతూ పెరిగే మొక్కలు పెరుగుతూ వున్నాయి– ఆ విత్తులూ, మొక్కలూ, పంటా ఫలసాయమూ తనదేనంటాడు'వాడు.' "వానియక్కని.. వానికాకోని" (వాడి అక్కనీ వాడి ఆలినీ). ఇది బూతంటారేమో నీతిపరులు! 'వాడు' శత్రువు దయాదాక్షిణ్యాలులేని దోపిడీదారు. శీలం గురించి సౌజన్యం గురించీ వాడికి ఖాతరేలేదు. జన్నారెడ్డి ప్రతాపరెడ్డిదాకా యెందుకు, ప్రజాకవి యాదగిరి దృష్టిలో నైజాంనవాబుకూడా "నా కొడకో" అనే సంబోధనకే గురయ్యాడు. ద్వేషం, రోషం, నింద, బలప్రయోగం ఇవి పీడించేవర్గం చేతుల్లోనే దూష్యాలౌతాయి. పీడితులచేతుల్లో అవి ఆయుధాలౌతాయి, పోరాటసాధనాలౌతాయి. అయ్యాయికూడా.

ప్రజల ప్రతిఘటన దొరలనూ జాగీర్దార్లనూ చివరకు నైజామునూ ప్రతీకారచర్యలకు దింపింది. గ్రామాల్లో ప్రజారక్షణదళాలు ఏర్పాటౌతున్నాయి. రజాకార్లు దిగుబడౌతున్నారు. తెలంగాణా పొగచూరసాగింది. "సంగం" రణరంగంలో దిగింది.

(ఇంకా వున్నది)

1974 సంవత్సరంలో వెలువడిన విప్లవ కవితలు- ఒక సమీక్ష

ముదార్ వేణు

విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించినప్పట్నుంచీ విప్లవ కవులు ప్రజల కందుబాటులోవుండే భాషలో పాటలు రాయాలనీ, శ్రామికుల్లోకి వెళ్ళి, వాళ్లకు వాటిని వినిపించి, వారిలో విప్లవచైతన్యాన్ని కలిగించాలని ప్రతిసారీ అనుకోనడం జరుగుతోంది. కానీ, ఆచరణలో అది నెరవేరలేదు.

తెలంగాణా పోరాటకాలంలో అక్కడెన్నో పాటలు పుట్టాయి. జనంలో బాగా ప్రచారం పొందాయి. అవి రాసినవారు పేరొందిన కవులుకారు. పోరాటంలో పాల్గొంటున్నవారు- పోరాటంతో ఏదోవిధంగా ప్రత్యక్షసంబంధమున్నవారు.

అలాగే సుబ్బారావు పాణిగ్రాహి ఒకప్రక్క పోరాటంలో పాల్గొంటూనే, మరోప్రక్క స్వయంగా పాటలు జముకులకథలు రాసి, వాటిని ప్రజల్లోకి తీసికెళ్ళి వినిపించేవారు.

విప్లవ రచయితల సంఘం ఏర్పడిన్నాటినుండి ఎన్నో విప్లవ కవితలు వెలువడినాయి. ఎన్నో కవితా సంకలనాలు ప్రచురించబడినాయి. వాటిలో ఏవీ సామాన్య ప్రజల్లోకి వెళ్ళలేదనడం అతిశయోక్తి కాదు. అవన్నీ మధ్యతరగతి వారినుద్దేశించబడ్డ 'వచనకవితలు' మరికొన్ని తమ భాషాప్రతిభని చాటుకొనేవి. కారణం ఈ రచయితల్లో చాలా మంది మధ్యతరగతి మేధావులుగావుంటూ- నగర జీవితాలకలవడి పేదలకష్టాల్ని పుస్తకాల్లో చదివి, విని కవితలు రాసేవారు కావడమే.

'కళలూ, సాహిత్యం ఎవరికోసము'లో మావో ఇలా చెప్పారు. "సాహిత్యం, కళలూ ప్రధానంగా విప్లవ నాయకత్వం వహించే శ్రామికులకొరకు తరువాత విప్లవానికి స్థిరమైన అనుచరులూ, అత్యధిక సంఖ్యాకులూ అయిన కర్షకులకొరకు అటుపైన సాయుధ శ్రామిక, కర్షకుల కొరకు అంటే విప్లవ సమరంలో ప్రముఖశక్తిగా పనిచేసే ఎయిత్‌రూట్, న్యూఫోర్త్ సేనలకు చెందిన సైనికులు. ఇతర సాయుధప్రజా దళాలకొరకు. ఆఖరున మన సాహిత్యం, కళలు నగరాలలో పనిచేసే పెటీబూర్జువాల కొరకూ, పెటీబూర్జువా మేధావులకూను. ఈ ఉభయులూ విప్లవంలో మనపక్షానవుంటే దీర్ఘ కాలం మనతో సహకరించగలరు.

కానీ యింతవరకు చాలాభాగం కవితలు ప్రధానమైన ప్రజలకందలేదనేది నిర్వివాదాంశం.

శ్రామికులతో, కర్షకులతో సంలీనంచెంది, వారి కష్టాల్లో పాలుపంచుకొని, వారి గుండెలతో తన కలాన్ని జోడించి నిజమైన ప్రజాకవితల్లిడం ప్రారంభించిన కవి వి.బి. గద్దర్. అక్కడికక్కడే పాటలురాసి, వారిమధ్యే వాటిని పాడి వారిలో వర్గ చైతన్యాన్ని విప్లవచేవనుకలిగిస్తూ పల్లెలు, పట్టణాల్లోని మురికివాడలు పర్యటించసాగిన ఈ విప్లవ కవి తన కార్యక్రమాన్ని 1973 లోనే ప్రారంభించాడు.

1974 లో విప్లవ కవితాయురి గద్దర్ చూపిన బాటలో సాగడానికి ప్రయత్నించింది. వచనకవితల కాలం చెల్లిపోయిందని, అవి కేవలం మధ్యతరగతి ప్రజలకే పరిమితమైపోతున్నాయని, విప్లవ కవిత్వం ఎవరికొరకు రాస్తున్నామో వారిదాకా వెళ్ళటంలేదని, వెళ్ళినా ఈ రచనాప్రక్రియ వారిని ఆకట్టుకోలేకపోతోందనే సత్యాన్ని చాలా మంది విప్లవ రచయితలు గమనించడం ముదావహం. అలాగని వచన కవితలు వెలువడలేదా? వాటిలో చేవలేదా? అంటే పూర్తిగా లేదనలేము. కావలసినన్ని ఈ సంవత్సరంలో కూడా వెలువడినాయి. భావపరిపుష్టి కలిగిన వచన కవితలు అనేకంవచ్చాయి.

వి.బి. గద్దర్ పాటలు 1973 లో కంటే యీ సంవత్సరంలో బాగా పరిణతి చెందాయి అతని రచనలు వాస్తవానికి అతిసమీపంగా వుండటానికతడు కార్మిక, కర్షకుల్తో కలిసిపోయి ఎలారాస్తాడో చెప్పడానికో సంఘటన యిక్కడ వుటంకించడం అప్రస్తుతం కాదనుకొంటాను.

17-4-74 న అనంతపురంలో రిక్షా కార్మికుల సమ్మె వుధృతంగా సాగుతోంది ఆరోజు సమ్మె నాల్గోరోజు. ఆనాడు 'గద్దర్' అనంతపురంలో వున్నాడు. ఒక రిక్షా కార్మికుడి యింటివద్ద పొయ్యిరాజేసి ఆనాటికి రెండురోజులైంది. వారి శ్రమ విలువను వివరిస్తూ, వారి శ్రమదోపిడీతో బలిసిపోయిన యజమానిని, అతని శ్రమఫలితాల్ని దోస్తున్న పోలీసుల్ని గురించి కళ్ళకు కట్టినట్టుచూపుతూ, ఈ వ్యవస్థను కూల్చి నవ సమాజనిర్మాణానికి ఆ కార్మికుడేంచేయాలో విస్పష్టంగా చెప్పగలిగాడు.

'రక్తంతో నడుపుతాను రిక్షను– నా రక్తమే నా రిక్షకు పెట్రోలు'అనే పాటలో, ఆ పాట ఆ కార్మికుడి యింటివద్దకూర్చునిరాశాడు ఆరోజే అనంతపురంలో బహిరంగ సభలో పాడాడు ఈ పాటలో వర్గకసిని రగుల్కొల్పే అగ్నిలాంటి వాస్తవముంది– మహోన్నత కవిత్వముంది. ప్రతి రిక్షాకార్మికుడు ఈ పాటతో కదిలిపోయాడు, ఈ పాటలోని కదిలించే గుణాన్ని పసిగట్టిన "పాలకులు"పాటను దాన్ని ప్రచురించిన'మే' నెల సృజనను నిషేధించారు. కానీ వేలహృదయాల్లో పదిలపరచబడ్డ ఆ పాటను ఏం చేయగలరు?

ఈ సంవత్సరంలో పాటకజనంలో బాగా ప్రచారంపొందిన వి.బి. గద్దర్ పాటలు

'పోదాం పదే జాతరో', 'కార్మిక, కర్షక, విద్యార్థులు', 'ఎప్పుడొస్తాదో కొడుకు' 'మా యన్న జీతగాడ', 'వొడ్డెరోల్లమంది మేము'

పి.వి. గద్దర్ తర్వాత అదే దారిలో పయనించి, విశాఖజిల్లా మాండలికంతో ప్రజల పాటలు రాసిన కవి "వంగపండు ప్రసాదరావు". 'జీపీ వస్తోందిరండిరా' పాటలో ఎన్నికల సమయంలో ఓట్లకోసం మారుమూల పల్లెలకొచ్చే రాజకీయనాయకుల బండారం బయటపెడుతూ. వారికెలా బుద్ధిచెప్పాలో ప్రజలకు వివరించారు. 'సు త్తి. కొడవలి గుర్తుగవున్న ఎర్రనిజెండా ఎగురుతున్నది' పాటకూడా సుబ్బారావు పాణిగ్రాహిగారి 'కష్ట జీవులం కమ్యూనిస్టుం' పాటలాగా బాగా ప్రచారం పొందుతుంది, 'ఏరువాక' లోని ప్రతి పాట ప్రజల్ని బాగా ఆకట్టుకొనేరీతిగా వుంది.

తర్వాత చెప్పుకోదగ్గ కవి 'చెరబండరాజు'. గడచిన సంవత్సరాల్లో యితని పాటలు "కొండలు పగిలేసినం/బండలను పిండినం/మా నెత్తురు కంకరగ/ప్రాజెక్టులు కట్టినం", "పేదవాళ్ళం కూలివాళ్ళం పెదవులెదలూ ఎండినోళ్ళం", "ఊరు మేలు కొన్నది" మొదలైన వాటిని చదివినవారికి- ఈ సంవత్సరం వీరు చాలా నిరుత్సాహం కలిగించారు. రాయడానికి కొన్ని పాటలై తేరాశారు. కానీ అవన్నీ పెటీబూర్జువా తర గతికే పరిమిత మౌతున్నాయి. "పాడుతాం/పాడుతాం"- "ఆపలేరు ఆపలేరు/యింక మీరు ఆపలేరు/ఈ మట్టిని తొలుచుకొని విప్లవాలు లేస్తున్నాయ్/ఎరుపెక్కిన ఈ మట్టికి మా నెత్తుటి స్వాగతాలు"- "విప్లవాలయుగం మనది- విప్లవిస్తే జయం మనది" మొద లైనవి చాలా వుత్తేజాన్ని కలిగించే కవితలే ననడానికి సందేహంలేదు. ఇవన్నీ వారు తమ నిర్బంధంలో జైల్లోరాసి, కోర్టు ఆవరణలో పాడినవి కావడంవల్ల- యివి ప్రత్యే కంగా యిలాగే వుండడం అవసరమేమో! ఇకపై వీరి కలంనుండి కార్మిక, కర్షకుల కొరకు పాటలు రాగలవని ఆశిద్దాం.

'నిజం' అనే కవి 'ఎర్రమందారాలు' పేరిట కవితా సంకలనాన్ని వెలువరించారు. గేయాల్లో గ్రాంథికపదాలు, పరిష్కారంచూపని కవితలతో నిండివుంది ఈ సంపుటి. ఈ రచయిత యింకా కృషిచేసి శ్రామికులతో తాదాత్మ్యంచెందడంద్వారా మంచి పాటలం దించడానికి ప్రయత్నించాలి.

ఎన్.కె గారి పాట 'ఎర్రజండా' పాడుకోడానికి అనువుగావుంది. 'ఎర్రజెండేరో రన్నా- ఎర్రజెండేరో/మన బతుకుబాటకు వెలుగుదారీ ఎర్రజెండేలో' అంటూ పీడితుడికి బాసటగా నిలబడగల ఎర్రజెండాగూర్చి వివరించారు మిగత మంచి పాటలుగా రెంజిమ్ 'ఏటికీ ఎదురీదువాళ్ళమురా', యాత్రిక్‌గారి 'విప్లవ రచయితలం', సంవర్త 'అసామీ- ఖూసామీ', రాఘవులు కె. గారి 'మల్లారం కొండకింద', కాశీపతిగారి 'ప్రజల తీర్పు',

జైరాం 'ఓరన్న జీతగాడ', కె. వి. రమణారెడ్డిగారి 'మేడే పాట' చెప్పుకోదగ్గవి. ఇవన్నీ సృజన ఎరుపులలో వచ్చినవి.

సినిమా పాటలు ప్రజల్లో బాగా ప్రచారంలో వుంటున్నాయి. కాబట్టి సినిమా పాటల వరుసలలో కొందరు పాటలు రాశారు. అందులో పరిటాలగారి 'ఏమమ్మా గిరిజాల ఇందిరమ్మా! ఎగిరెగిరి పడతావు యాలమ్మ' నరసప్పగారి 'జయమ్ము కోశి కదలి రమ్ము కూలిసోదరా', గద్దర్ 'జోహార్లు - జోహార్లు', "సత్యమన్న! కైలాసన్న!" చెప్పుకోదగ్గవి.

విప్లవ రచయితలపై ప్రభుత్వం కుట్రకేసు బనాయించి, చాలమంది రచయితలని నిర్బంధించిన సందర్భంలో శ్రీశ్రీ గారు రాసిన పాట "దూడిపులిమీద పుట్ర" ప్రత్యేకంగా చెప్పుకోదగింది. "ఓరోరి ముఖ్యమంత్రిగా-ఇందిరమ్మ/గారి బాజాభజంత్రీగా/ఔరౌరా వెంగళప్పిగా- జలగవు నీ/ పేరంటే కడుపునొప్పిరా" అని మొదలుపెట్టి "దొంగఓట్ల, దొంగనోట్ల/రాజ్యం ఒక రాజ్యమా? / లంచగొండి వెధవలిచ్చు/సాక్ష్యం ఒక సాక్ష్యమా?" అంటూ ఆఖరుకు "కమ్యూనిజానిదే తుది విజయం" అంటూ తీర్పు చెప్పారు. ఇది చాల చక్కని పాట.

ఇక సృజనలో "ఉదయకిరణాలు" పేరిట ప్రచురించబడ్డ గేయాలు వరవరరావుగారి "అ ఆ ఇ ఈ *A B C D*"లు, చెరబండరాజుగారి "సారూ! మనము"సులభంగా అర్థమయ్యే చిన్నచిన్న పదాలతో చిన్న పిల్లలకుపయోగపడేలా వున్నాయి. ఉపాధ్యాయ వృత్తితో పరిచయమున్న విప్లవ రచయితలు యిలాంటి ప్రయత్నాలు మరిన్ని చేస్తే ఎంతైనా బాగుంటుంది.

<u>వచన కవితలు</u> :— లెక్కకు మిక్కుటంగా వెలువడినా వేళ్ళమీద లెక్కపెట్టగలన్నే గుర్తుపెట్టుకోగలవిగా వున్నాయి.

కమిట్‌మెంట్ వున్న పత్రిక లేకాక పెట్టుబడిదారీ పత్రికలు 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక ఈ సంవత్సరం ఎన్నో మంచి విప్లవ వచన కవితల్ని ప్రచురించింది. 'జ్యోతి' మాసపత్రిక కూడా ఒకటి రెండు రచనల్ని ప్రచురించింది.

"నెత్తుటి కలాలతో/ఫార్ములా రాయబడి/కాలే కడుపుల/కర్మాగారాల్లో/ఫారెస్ట్ ఫ్యాక్టరీల్లో/ తయారవుతోంది / విప్లవ బాంబు.......ప్రజ్వరిల్లే గుండెల / పరమాణువులతో" అన్న పిన్నోజు రాజేశ్వరరావు కవిత, "సత్యాన్ని వుచ్చరిస్తావా/వురితాడే హారం వున్న నిజాన్ని కాగితంపై పెడతావా / వర్గ కవివౌతావ్ / నిర్బంధాల పాలౌతావ్ / జనం కోసం నడుంకడతావా/విప్లవ కారుడివౌతావ్/నీ తలకు వేలప్రకటన" అన్న పసుపులేటి వెంకట్రమణగారి కవిత వున్న వాస్తవాల్ని ప్రస్ఫుటంచేస్తూ రాయబడ్డాయి.

"ఉదయిస్తోన్న సూర్యుణ్ణి/కుట్ర అంటోన్న ఈ వ్యవస్థకి/రోడ్లమీదకొచ్చి బారికేడ్లు నిర్మిస్తూ తిరగబడుతున్న యువతరం ఇంజెక్షన్" అంటూ రాశారు. బలిజేపల్లి మాధవరావు తమ 'ఇంజెక్షన్' అనే కవితలో. ఈ దోపిడీ వ్యవస్థ ఇంజెక్షన్‌లతో మారదు. దీనికి విప్లవిస్తున్న యువతరం చేస్తున్నది "ఇంజెక్షన్" కాదు. 'ఆపరేషన్' అని ఈ రచయిత గుర్తించాలి.

కె. శివారెడ్డిగారి "చదువు"లో "మొక్కలు నిటారుగా ఎదక్కుండా / తలెత్తి సూర్యోదయంవైపు చూడకుండా/వంగబెట్టి/వలసవిధానపు శేషాల, బానిసత్వాల,దోపిడీల బరువులు" మోపబడ్డవన్నారు. కానీ ఈ బానిసత్వం, దోపిడీల బరువుల్ని తొలగించుకొని విద్యార్థులెలా సూర్యోదయాన్ని చూడాలో వివరించలేదు. సమస్యలకు పరిష్కారం చూపని రచనలు పాఠకులకెందుకూ పనికిరావు.

"ఆకలితో చస్తున్నా/ఆశలతో దహిస్తున్నా/బాబూ! ఒక చపాతీ / కాదు / ఇలా పారేయండో తుపాకీ / చెల్లించుకోనివ్వండి / నా తరతరాలబాకీ" అంటూ బి. భారతిగారు ఆకలితో చచ్చేకన్నా పోరాటంలో చావడం మేలన్న సత్యాన్ని చెప్పే ప్రయత్నంలో మరో విప్లవ వాస్తవికతను మరిచారు. అదేమంటే విప్లవపోరాటంలో తుపాకిని అడుక్కోడం కాదు లాక్కోడం, అన్న విషయం గుర్తించకపోవడమే.

శివసాగర్‌గారి "రెడ్‌సిగ్నల్" రైల్వేకార్మికుల సమ్మెసందర్భంగా రచింపబడిన కవిత. సమ్మె గురించిన వార్తల్ని ప్రభుత్వ బాకాలుగా పనిచేస్తున్న పెట్టుబడిదారీపత్రికలు ఎలా వక్రీకరించి ప్రచురిస్తున్నదీ వ్యంగ్యంగా చిత్రీకరించారు. ఇది ఈ సంవత్సరపు ఉత్తమ వచన కవిత. "రాహీ"గారు "సబ్ ఠీక్ హై"లో జైల్లోని విప్లవరచయిత హృదయభావాల్ని చక్కగా చూపారు. నిఖిల్‌గారి 'ముసలి నక్కలు ఏలుతున్న దేశంలో' రచనలో 'ముసలితనం' పాలెక్కువైంది. విప్లవచేవ కొరవడిన కవితయిది. సూర్యాస్తమయపు చల్లదనం ప్రతి పంక్తిలోను స్పష్టంగా కనిపిస్తోంది.

యాత్రికుగారి "పెన్ పిస్టల్"లో "మావో ఆలోచనా విధానం ప్రజలకందిస్తోందగా/రచయితల అరెస్టు" అంటూ "విప్లవ రచయితలు 'హీరో'(చైనా పెన్)లతో/కుట్ర చేస్తున్నారని పోలీసుల తుపాకులు కేసుపెట్టాయి/సూర్యోదయం కుట్రగా నిరూపించడాకి చీకట్లో సాక్షులను గాలిస్తున్నారు" అంటూ ప్రభుత్వపు మూర్ఖత్వాన్ని తెలియజేశారు.

యాత్రిక్‌గారిదే 'తూర్పుగాలి', 'ఆహ్వానం', యం.టి. ఖాన్‌గారి 'చెయిర్మన్ మావోకు', 'కాంతిపరిమళాలు', భూషణంగారి 'దిగజారుడు', చెరబండరాజుగారి 'ఓనామేకా'. పెపెరెగారి 'రక్తసిక్త సోపానాలు', నిజంగారి 'ఈ స్వాతంత్ర్యం మనదికాదు' మొదలైనవి ఈ సంవత్సరపు పేర్కొనదగిన మంచి రచనలు.

ఈ సంవత్సరంలోనే రాయబడిన వి.వి. గద్దర్ 'రాజకీయ వీధిభాగోతం' ఇప్పటికే చాలచోట్ల ప్రదర్శింపబడి, ప్రజాదరణ పొందింది. కానూరి వెంకటేశ్వరరావుగారి వీధి భాగోతం పట్టణాల్లోని మధ్యతరగతి ప్రజల్ని బాగా ఆకట్టుకొంటే, ఈ వీధిభాగోతం 'పాటకజనాన్ని' బాగా ఉత్తేజపరుస్తుంది.

ఈ సంవత్సరంలోనే వరవరరావుగారి "ఊరేగింపు" కవితా సంకలనం వెలువడినా అందులోని రచనలన్నీ 1973 కి ముందువే. కాశీపతిగారి "రెడ్ శాల్యూట్" లోని కవితల్లోకూడా ఈ సంవత్సరపు రచనలేవీ లేవు.

మొత్తంమీద వచన కవితల కాలం అంతరిస్తుండడం, పాటలరూపంలో శ్రామిక భాషలో పాటలు రాయడానికి ప్రతి విప్లవరచయిత ప్రయత్నిస్తుండడం ఈ సంవత్సరపు ప్రత్యేకత.

ఇంకొక్క విషయం– అక్టోబర్ సృజన ముఖచిత్రంగా చైర్మన్ మావోను. దానిపై ఒక గేయాన్ని ప్రచురించారు.

> "ఈ చప్పట్లలో అనంతకోటి పీడితజన విజయధ్వానాలు
> ఈ చప్పట్లు దోపిడీ మూకల గుండెలపై చావుతప్పెటలు
> ఈ చప్పట్లలో స్వార్థం శిరస్సు నరికిన ఆయుధం చప్పుడు
> ఈ చప్పట్లలో ప్రపంచ పీడిత జనానికి విప్లవం పిలుపు
> అరుణారుణ భవిష్యత్‌లోకి మేల్కొలుపు..."

మావో నాయకత్వంలో చైనా ప్రజలు విప్లవ పథంలో సాగి స్థాపించుకొన్న కార్మిక నియంతృత్వం, ఈ పాతికేళ్ళకాలంలో వారు సాధించుకొన్న ప్రగతి, ప్రపంచంలోని యితర పీడిత ప్రజలకు చైనాయిస్తున్న సందేశం విపులంగా యీ గేయంలో పాఠకుడి హృదయానికి సూటిగా హత్తుకొంటుంది.

1975 సంవత్సరంలో విప్లవ రచయితలు పాటకజనానికి, కార్మిక, కర్షకులకు వర్గదృక్పథాన్ని తెలియజేస్తూ, విప్లవ వాస్తవికత వెల్లివిరిసేపాటలురాసి, వారిమధ్యకు వెళ్ళి వారికి చదివి వినిపించి, వారిలో విప్లవ చైతన్యాన్ని కలిగించగలరని ఆశిద్దాం.

రచయితలకు విజ్ఞప్తి

సృజన ఆగస్టు 75 సంచిక "కథల ప్రత్యేక సంచిక" గా వెలువడుతుంది. రచయితలు తమ కథలను జులై 10వ తేదీలోగా పంపవలసిందిగా కోరుతున్నాం.

— సం॥

సమీక్ష :

ప్రజాపోరాటాల క్రమంలో సాహిత్య పరిణామం
ఈరోజు కవిత్వం: శివారెడ్డి, "రక్తం సూర్యుడు"

"The real intellectual wealth of the individual depends entirely on the wealth of this real connections"

— *MARX*

The German ideology

మానవుడు సంఘంలో జీవిస్తూ తన సహచరులతో కలిసే కార్యకలాపాల్లో పాల్గొంటాడు. అతని జీవితధోరణి అంతా సాంఘికమే. ఆలోచించటానికి, భావాలు ఏర్పడటానికి, భావాలు అభివృద్ధి చేసుకోవటానికి సాంఘిక జీవితమే ఆధారం. కవికి స్పందనా గుణం ఎక్కువ. ఆ స్పందనే కవితారూపంలో వ్యక్తమవుతుంది. స్వీయ స్పందనను సమిష్టి స్పందనగా కవి పాడుతాడు. స్పందన కళారూపంగా వ్యక్తంకావటానికి కవికున్న మానవసంబంధాలే కారణం. తన చుట్టూవున్న సంఘంలో అనేక అభిప్రాయాలూ, దృక్పథాలూ ప్రచారంలో వుంటాయి. కవి ఏవో తనకునచ్చిన ఆశయాలతో దృక్పథాలతో సంబంధం పెట్టుకుంటాడు. ఆవిధంగా సంఘంలో ప్రచురంగావున్న కొన్ని అభిప్రాయాల పరిధిలోనే కవి ఇమిడిపోతాడు.

చాలా మంది కవులకు అభిప్రాయాలకు లేదా దృక్పథాలకు వర్తమాన సమాజానికి వున్న శాస్త్రీయసంబంధం తెలీదు. భావాలను స్వకీయంగా సృష్టించగలమనే భ్రమలో విహరించే కవులు అసంఖ్యాకంగా వుంటారు. అభిప్రాయాలన్నీ వాస్తవమైన కొన్ని సామాజిక శక్తులకు ప్రతిబింబాలే (Reflections). సాంఘిక సంబంధాలన్నీ ఉత్పత్తి సంబంధాలనుంచే ఏర్పడతాయి. ఉత్పత్తి సంబంధాలనుంచే అభిప్రాయ సంబంధాలు రూపం దిద్దుకుంటాయి. కవికి స్పృహవున్నా లేకపోయినా కవిత్వం ఏదో ఒక వర్గ ప్రయోజనాల పరిమితుల్లోనే వెలుగుతుంది. ఆర్థికమూలంనుంచి లేచిన కట్టడాల ఉపరితలాలే సాహిత్యం, తత్వశాస్త్రం, న్యాయం, విద్య, నైతికసూత్రాలు అన్నీ. కాబట్టి కవి కేవలం కొన్ని అభిప్రాయాలతో, ధోరణులతో ఒక మానసిక సంబంధాన్ని, ఒక హృదయసానుభూతిని ఏర్పరచుకున్నట్టు భ్రమపడినా అతని సంబంధాలు వర్గపరిమితిని దాటవు. వ్యక్తిగత ప్రతిభ సమిష్టిశ్రమనుంచే సమూహసంకల్పంలోనే వికసిస్తుంది.

ప్రకృతిమీద, సంఘంమీద, ప్రజలు అపారమైన అధికారాన్ని వ్యాప్తం చేసుకుంటున్నయుగంలో మనం వున్నాం. ప్రజలు తమంతతాము చైతన్యవంతమైన, సామూహికమైన నిర్ణయాలుతీసుకొని తమ అవసరాలను సాధించటానికి పోరాడుతున్నయుగం మనది. మానవజాతి సాధించిన సాంఘిక, శాస్త్ర విజ్ఞానవిజయాలనుంచి సూత్రీకరించబడిన మార్క్సిస్టు-లెనినిస్టుభావాలు పోరాటక్రమంలో ఎదురయ్యే అనేక సమస్యల్ని ప

ష్కరించగలుగుతాయి. సోషలిస్టు మానవతను సాధించటానికి యివి మార్గదర్శక సూత్రాలు. భవిష్యత్తు అనేది పోరాటంలోనే సాధించగలం. సంఘభావజాలపు వుపరితలం అంతా ఆర్థికమూలాన్ని ప్రతిఫలిస్తుంది. కొత్త ఆర్థికమూలం మేల్కొంటున్న, రూపుదిద్దుకొంటున్నదశలో గొప్ప సాంస్కృతిక విజయాలు సాధింపబడతాయి. కొత్త వర్గాలతోపాటు కొత్తభావాలు, కొత్త పరిశోధనలుకూడా వికసిస్తాయి. విప్లవం భావరంగంలోకూడా గుణాత్మకమైన మార్పులనుతెస్తుంది. పాతఆర్థికమూలం శిథిలమౌతున్నప్పుడు దాని సంరక్షకులు దాన్ని కాపాడుకోవటానికి అన్నిరంగాల్లోనూ చావుకు తెగించి పోరాటం చేస్తారు. తమ ఆయుధాలన్నిటినీ ఉపయోగిస్తారు. ఈ దశనే పాతకూ, కొత్తకూ, పాత అభిప్రాయాలకు కొత్త అభిప్రాయాలకు పోరాటదశ అంటారు. రెండు సామాజిక శక్తులు సంఘర్షిస్తున్నప్పుడు వాటికి ప్రాతినిధ్యం వహించే సాంస్కృతిక శక్తులుకూడా అనివార్యంగా సంఘర్షిస్తాయి విరుద్ధశక్తుల సంఘర్షణే కొత్తశక్తుల జననానికిహేతువు.

భూస్వామ్య. బూర్జువావర్గాల సంయుక్తాధికారం నేటి ఆర్థికమూలంమీద వుంది. ప్రధాన పాలకవర్గం భూస్వాములు, దళారీ బూర్జువాలు. నూటికి 80 మంది జీవిస్తున్న గ్రామాల్లో ఆర్థిక, రాజకీయ. సాంస్కృతిక అధికారం అంతా భూస్వాములదే. భారతదేశంలో పాలకవర్గాలు సామ్రాజ్యవాద, సోషల్‌సామ్రాజ్యవాదశక్తులకు కీలుబొమ్మలు. రైతాంగం ప్రధానశక్తిగా కార్మికవర్గ నాయకత్వాన మేధావులు. చిన్న వ్యాపారస్తులు, సాంకేతికనిపుణులు, విద్యార్థులు మొదలైన పెటీబూర్జువాలతోకలిసి రాజకీయఅధికారం కోసం వ్యవసాయిక విప్లవంచేస్తున్నారు. సామ్రాజ్యవాదయుగంలో బూర్జువా విప్లవం విప్లవస్వభావాన్ని కోల్పోతుంది కాబట్టి భారత రైతాంగం జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని కొనసాగిస్తున్నది. నక్సల్‌బరీలో ఆరంభమయి దేశంలో అనేక ప్రాంతాల్లో జరుగుతున్న సాయుధపోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవమే. ఈ విప్లవం ఒకసిద్ధాంతంగా అధికసంఖ్యాకప్రజల అంగీకారాన్ని పొందింది. దేశంలోవున్న విప్లవ పరిస్థితి అనేక పోరాటరూపాల్లో వ్యక్తమవుతోంది. విప్లవ సిద్ధాంతం ప్రజల మనస్సులమీద పట్టు సంపాదించినప్పుడు భౌతికశక్తిగా మారుతుంది. సిద్ధాంతం, చైతన్యం, పోరాటం—పోరాటం, చైతన్యం, సిద్ధాంతం అనే విప్లవకరపంథాలో దీర్ఘకాలికపోరాటం జరుగుతుంది.

ఈ రాజకీయ శక్తుల ప్రభావం అనివార్యంగా అన్నిరంగాలమీద వుంటుంది. కవులు, మేధావులు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు నిశిత స్పందనాశీలురు. కాబట్టి, బూర్జువా శాస్త్రవిజ్ఞాన అధ్యయనంవల్ల సాహిత్య, భావ, విద్యారంగాలమీద రాజకీయ పోరాటాల ప్రభావం ఎక్కువగా వుంటుంది. ఈనాటి సాహిత్యంలో అన్నివర్గాలకు

ప్రాతినిధ్యంవహించే కవులు వున్నారు. వర్గదృష్ట్యా కవుల్లో విడిపోవడం (పోలరైజేషన్)జరిగింది. భూస్వామ్య, బూర్జువాకవులు, రివిజనిస్టుకవులు, విప్లవకవులు బావరంగంలో అభిప్రాయ పోరాటం చేస్తున్నారు. ఈ సాహిత్య సంచలన నేపథ్యంలోనే ఈనాటి కవిత్వాన్ని పరిశీలించవలసివుంది. శివారెడ్డి ఈనాటి యువకవి. నేటి రాజకీయ శక్తుల ప్రభావం అందరిమీదవున్నట్టే శివారెడ్డిమీదావుంది. కవిత్వంలో వస్తువేశిల్పాన్ని నిర్ణయిస్తుంది. వస్తువు తనకు అనుగుణ్యమైన శిల్పంలోనే అవతరిస్తుంది. కాబట్టి సాహిత్య విమర్శలో ముందు వస్తువును విశ్లేషించి శిల్పాన్ని వివరించాలి. గతంవైపు నడక (Back to the ancients) అనేది భూస్వామ్య సాహిత్య సిద్ధాంతం. ప్రాచీన సాహిత్యం చాలా ఉన్నతవిలువలు కలిగిందనీ, ఈనాటి సాహిత్యం భ్రష్టమైపోయిందనీ ఫ్యూడల్ సాహితీ విమర్శకులు వాదిస్తారు. పాత సాహిత్యమార్గంలోనే సాహిత్యసృష్టి జరగాలని సంప్రదాయాన్ని అనుసరించాలని శాసిస్తారు. పాత సాహిత్యాన్ని, సంప్రదాయాన్ని మార్గదర్శకంగా చూపటం అంటే భూస్వామ్య సమాజాన్ని సమర్థించటమే. స్త్రీ పురుషుడికి విధేయంగా వుండటం(పాతివ్రత్యం). పెద్దల మార్గంలోనే పిల్లలునడవాలనటం (పితృ, గురు, పురోహిత, జ్యేష్ఠ, దైవ అధికారాలు), ఒకజాతి మరొకజాతి మీద పెత్తనం చెలాయించాలనటం (హిందూ, ముస్లిం-అగ్ర, దళిత జాతులు), ఒకభాష కంటే మరొకభాష గొప్పదనటం (సంస్కృతం-ప్రాంతీయభాషలు. ఇంగ్లీషు-ప్రపంచ భాషలు), ప్రశ్నించకుండా వేదాంత ధర్మశాస్త్రాలను అనుసరించాలనటం (వేదనిందచేసేవాడు నాస్తికుడు) ఇవన్నీ ఫ్యూడల్ సమాజాన్ని సమర్థించే సాంఘిక, సాంస్కృతిక శక్తులు. ఈ శక్తులకు ప్రాతినిధ్యం వహించే రచయితలు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు తెలుగునాట సమృద్ధిగావున్నారు. మాటల్లో గతనిరాకరణం, ఆచరణలో, రచనాపద్ధతిలో, దృక్పథ చిత్రణలో గతాన్నే నెమరేయడం మరోధోరణి. బూర్జువావర్గం తొలిదశలో గత నిరాకరణం చిత్తశుద్ధితోనే చేస్తుంది. అధికారం గట్టిపడగానే కార్మిక, కర్షక వర్గాలతో వైరుధ్యాలు నిశితమయ్యేదశలో గతంతో(అంటే భూస్వామ్యంతో) రాజీపడుతుంది. భారతదేశంలో బూర్జువావర్గం భూస్వామ్యం ఉయ్యాల్లోబిడ్డ. జనతా ప్రజాతంత్రవిప్లవదశలో బూర్జువాలు కార్మిక-కర్షకులకు వ్యతిరేకంగా భూస్వామ్యంతో చేతులు కలుపుతారు. వర్గప్రయోజనాల పరిమితుల్లోనే బూర్జువావర్గం గతనిరాకరణ చేస్తుంది. గత విజ్ఞానంలోని మూఢత్వాన్ని, విప్లవ ప్రతీఘాతుక లక్షణాన్ని ఎదుర్కొనే ప్రకృతిశాస్త్ర. సామాజికశాస్త్ర విజ్ఞానాన్నికూడా బూర్జువావర్గం వేదాంతధర్మనీతి సూత్రాలతో విప్లవ వ్యతిరేకంగా మార్చివేస్తుంది. ముఖ్యంగా సమాజ చరిత్ర విషయంలో ఫ్యూడల్ భావజాలాన్ని నింపివేస్తుంది. జీవితరంగాల్ని శాస్త్రీయంచేసే శ్రామిక మహా విప్లవమార్గాన్ని ఫ్యూడల్ ప్రమాణాలతో ఆటంకపరచటానికి ప్రయత్నిస్తుంది. ఈరకం ధోరణి గత నిరాకరణంకాదు. గతంతో రాజీయే. ఇలాంటి దృక్పథాన్ని ప్రచారంచేసే

బూర్జువా కవులు నేటి సాహిత్యంలో గణనీయంగానే వున్నారు. అలాగే గతాన్ని పూర్తిగా ధ్వంసం చేయాలనీ, నిన్నటినిగురించి ఆలోచించటమే అనవసరమనే అరాచకవాదులూ వున్నారు. వీళ్ళని శూన్యవాదులు (Nihilists) అనవచ్చు. ఈ వాదాలమీద భూస్వామ్య సామ్రాజ్యవాద, సోషల్‌సామ్రాజ్యవాదశక్తుల ప్రభావం స్పష్టంగావుంది.

మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం భారత దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి సృజనాత్మకంగా అన్వయింపబడుతున్నది. ఇందులో విప్లవరచయితలు సాంస్కృతిక సైనికులు. గతంమీద విప్లవకవులకు శాస్త్రీయమైన, స్పష్టమైన అభిప్రాయంవుంది. వర్తమానానికి గతం సేవచేయాలి. అంతేకాని వర్తమానాన్ని గతానికి సేవచేయించేదిగా వుండరాదు. గతంలో ప్రజాపోరాటాలను, శాస్త్రవిజ్ఞానాన్ని, ప్రజాసంస్కృతిని విప్లవ కవులు తమదిగా చేసుకుంటారు. ప్రజలకు చెడుచేసేదాన్ని మృత పదార్థంగా వదిలేస్తారు. పోరాటక్రమం, సాంఘిక ఆచరణ మంచిచెడులకు గీటురాయి. గతంమీద కవికున్న అభిప్రాయాన్నిబట్టి కవి వర్గస్వభావాన్ని నిర్ణయించవచ్చు "రక్తం సూర్యుడు" కవితల్లో చాలా సందర్భాల్లో గతనిరాకరణ వుంది. ఆ నిరాకరణ శాస్త్రీయ నిరాకరణకాదు.

"నడుస్తూ రాస్తున్న గీతానికి
వెనకచూపులేదు- ముందుచూపుతప్ప-
వెనుక నాదారి మూసుకుంటున్నా
ముందువిశాలంగా విచ్చుకుంటున్న రహదారిపెల్లరుతో"

సమాజ పురోగమనానికి ముందుచూపే ప్రాణం, కాని అది వెనుకను మూసేది కాదు. నీముందుచూపునకు మొత్తం గతచరిత్రఅంతాపునాది. వెనుకను అర్థంచేసుకొని వివిధ చారిత్రక దశల పరిణామాన్ని అవగాహనచేసుకొని, వెనుకటి ప్రజల పోరాట అనుభవాన్ని నీదిచేసుకుంటూ సాగిపోవటం శాస్త్రీయం. అప్పుడే

"గుండె కాంతి లావాను మోయగలదు"

"నిన్నమీద నీకెంత మోజో
రేపుమీద నాకంత వ్యామోహం"

మోజు, వ్యామోహం రెండూ ఒకటే-నిష్ఫలాలు.

"గతాన్ని బొట్టుపెట్టెలో పెట్టుకొని
కళ్ళకద్దుకుంటూ పూజించుకుంటావు"

ఈరకం ధోరణిని ఖండించటం శివారెడ్డి ప్రగతిశీల సంస్కారానికి నిదర్శనం.

"గతం కాదు వారసత్వం"

అంటే ఏమిటి అర్థం ?

వారసత్వం అంటూవుంటే గత ప్రిపక్తి లేకుండా ఎలాసాధ్యం? గతంమీద శివారెడ్డి కవితల్లో వ్యక్తమయిన అభిప్రాయాలు ఒక దృక్పథానికి నిబద్ధమైనవికావు. శాస్త్రీయమూకాదు. గతాన్ని వివరించటంలో మార్క్సిస్టు సిద్ధాంతం సాధించిన విజయాలను శివారెడ్డి గమనించలేదు. సాంఘిక పరిణామ పరిధిలో గతాన్ని పరిశీలించటంలో శివారెడ్డి కృషిచేయవలసివుంది. లేకపోతే విప్లవేతర భావజాలంలోపడే ప్రమాదంవుంది.

శివారెడ్డికి వర్తమానంతో పేచీవుంది. ఈనాటి సమాజం అనేక అనారోగ్య లక్షణాలతో అధిక సంఖ్యాలకు బతకటం దుర్భరంగా పరిణమించింది. నేటి బూర్జువా ప్రజాసామ్యం, నాగరికత, శాస్త్రవిజ్ఞానం, కుహనా శాంతి, అహింసావాదాలు— ఇవన్నీ సామాన్యుడి జీవితాన్ని అణచి వేస్తున్నాయి. "ఓట్లు. ఎలక్షన్లు. అధికారాలు" దోపిడీదార్లకు ఉపయోగపడుతున్నాయి. వర్తమానంమీద అసంతృప్తి వుంది. కాని శివారెడ్డికి అవగాహనలేదు. నేటి సమాజం సంక్షోభంలోవుంది. ఈ సంక్షోభానికి కారణమైన వర్గాలు, వర్గపోరాటం మొదలైన శాస్త్రీయ విషయాల అవగాహనముఖ్యం. కార్మికులు కర్షకులు, మధ్యతరగతి బుద్ధిజీవులు, భూస్వాములచే. పెట్టుబడిదారులచే పీడించబడుతున్నారు. పీడక వర్గాలను. పీడితవర్గాలను ముందుఅర్థం చేసుకోవాలి. వర్గపోరాటాన్ని గుర్తించాలి. ప్రజాపోరాటాల స్వభావాన్ని దృష్టిలో వుంచుకోవాలి వాస్తవానికి వర్గపోరాటం గుర్తించటమే చాలదు. దీన్ని మార్క్సుకంటే ముందు బూర్జువా మేధావులే గుర్తించారు. వర్గపోరాటాన్ని చారిత్రక దశలతో సమన్వయిస్తూ శ్రామిక నియంతృత్వందాకా అవగాహన విస్తరించాలి. శివారెడ్డి స్థూలంగా "విశ్వశ్రామికుణ్ణి" అని వర్గాన్ని గుర్తించాడు. కాని మార్పుకు ప్రాణప్రదమైన వర్గ పోరాటాన్నికాని, మార్పులకు లక్ష్యమైన శ్రామిక నియంతృత్వాన్నిగానీ గుర్తించలేదు. దానితో వర్తమాన సమాజంమీద శివారెడ్డి, అవగాహన అస్పష్టం అయిపోయింది. ఈనాటి ప్రజల సాయుధ పోరాటవిషయంలో శివారెడ్డి తటస్థసానుభూతిని ప్రదర్శిస్తున్నాడు. పీడిత జన పక్షపాతం ఒక్కటే చాలదు.

"సుసంఘటిత సమసామాజిక వ్యవస్థా స్థాపనకు
సామూహిక బాధ్యతా ప్రేరణాత్మక క్రియను వెల్లడిద్దాం"

అనే దూరపు చుట్టరికంవల్ల ప్రయోజనంలేదు సమసమాజ ధ్యేయంతో పురోగమిస్తున్న వ్యవసాయిక విప్లవాచరణలో భాగస్వామ్యం వహించాలి.

"కోటానుకోట్ల సూర్యుళ్ల నిద్రలేచారు, వస్తున్నారు"

అనే ఆవేశం శాస్త్రీయ అనుభవరూపం దాల్చాలి. జనతా ప్రజాతంత్ర విప్లవంలో సాంస్కృతిక సైనికుడుగా సాయుధ పోరాట ఎర్రజెండా నీడలోకి రావాలి.

"తూరుపు ధర్మాసుపత్రిలో (ధర్మాసుపత్రి అంటే ??),
తొలిరేకుల పక్కమీద
వెలుగుబిడ్డ"

అనే అస్పష్టమైన విప్లవాకాంక్ష పోరాటక్రమంలో గతితార్కికంగా ఐక్యంకావాలి. లేకపోతే అసమర్థుని ఆర్భాటంలా, జులాయి కుర్రాడి ఫేషన్‌లా మిగిలిపోతుంది

దుఃఖ నిరాకరణం, సాహస ఆహ్వానం మంచిదేకాని అది ఒక సిద్ధాంతం వెలుగులో చెప్పలేనప్పుడు అరాచక ధోరణికి తావునిస్తుంది. లంపెన్స్‌కి, ఆర్ ఎస్ ఎస్ కుర్రాళ్ళకికూడా ధైర్యసాహసాలు వున్నాయి. జనానికి ధైర్యసాహసాలు బోధిస్తున్న శివారెడ్డి

"కళ్ళముందు విస్తార దుఃఖవర్షపాతమే"

చూస్తున్నాడు. శ్రామిక పక్షపాతాన్ని చెబుతూనే మధ్యలో

"శ్రామిక చైతన్యం మొత్తం
నైరాశ్య గ్రహణ గ్రస్తమై
రక్తాన్ని ధారపోస్తున్నాయి"

అని తన నైరాశ్యాన్ని శ్రామికులమీద రుద్దుతున్నాడు.

"ప్రతివాడికి
నడిమంచంమీద కూర్చుని
ఖోంచేయాలనీ గడించాలనేతప్ప
శరీరాన్కి చెమటపట్టటం ఒల్లదు.
ఇదుగో ఇలాంటి మనస్తత్వం
దుర్గంధంలా వ్యాపిస్తుంది కాబట్టే
దొంగలు, ద్రోహులు, లోఫర్లు
ధనికులు, దరిద్రులు, తినేవాళ్లు
తినబడేవాళ్లు, బడావాళ్ల
ప్రతిష్ఠింపబడుతున్నారు."

ఇది అర్థరహితమైన తలక్రిందులు అవగాహన. పనిచేయకుండా, చెమట పట్టకుండా బతికేవాళ్లు భూస్వాములు, పెట్టుబడిదారులు. ఈరకం విశ్రాంతివర్గం వుండటమే దొంగలు, లోఫర్లు వుండటానికి కారణం. ప్రతివాడికి పనిచేయకుండా కూర్చొని ఖోం చేయటం ఎలా సాధ్యం ? ఈ రకం అనాలోచిత అవగాహన "రక్తం సూర్యుడు" కవితల్లో ఆవరించివుంది. సమాజ అధ్యయన విషయంలో, ప్రజాపోరాటాల విషయంలో ఆచరణాత్మక పరిశీలనలేకుండా ఆదర్శవాద పరిశీలన వుండటంవల్ల వచ్చిన తేలిక మనస్తత్వమిది.

"హోచిమిన్, గువేరా, కాస్ట్రో, మావోవారసులు"

అంటున్నారంటే శివారెడ్డి భారత వ్యవసాయిక విప్లవంగూర్చి ఆలోచించటంకూడా చేయలేదన్నమాట. మనదేశ భౌతికపరిస్థితులకు మావో ఆలోచనావిధానం సృజనాత్మకంగా అన్వయించటం ఏకైకమార్గంగా విప్లవరాజకీయపార్టీలు అన్నీ ఏకగ్రీవంగా అంగీకరించిన విషయం. హోచిమిన్ నడిపింది సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతి విముక్తిపోరాటం ఎర్రసైన్య నిర్మాణం, సిద్ధాంత ప్రాధాన్యం. దీర్ఘకాలికపోరాటం మొదలైన ప్రధాన విషయాలను తిరస్కరించిన గువేరా భారత ప్రజల పోరాటాలకు ఎలా మార్గదర్శకాగలడు? సోషల్ సామ్రాజ్యవాదానికి తాబేదారై వర్గపోరాటాల్నివదిలేసి క్యూబా విప్లవవిజయాలకు వెన్నుపోటు పొడుస్తున్న కాస్ట్రోను యీనాటితరం నిరాకరిస్తున్నది. ఈ రకం అపరిణత అవగాహనలవల్లనే శివారెడ్డి విప్లవోద్యమంనుంచే తప్పిపోయాడు. సాయుధపోరాటం, మార్క్సిజం-లెనినిజం, ఎర్రజెండాల ప్రసక్తి రాకుండా కవితల్లో జాగ్రత్తపడ్డాడు. ఈ అనవసర జాగ్రత్త అవసరవిషయాల్లో అజాగ్రత్తకు దారితీసింది.

భౌతికవాదంమీద శివారెడ్డి పరిజ్ఞానం మరీ నేలబారుగావుంది.

"ఈ ముక్క భౌతికం
ఈ స్పూనూ ఈప్లేటూ
ఈ వుల్లివాయా టొమాటో భౌతికం
ఈ బిర్యానీ ఈ తాగుడు భౌతికం"

"సెక్స్ సెంటరాఫ్ గ్రావిటీ"

భౌతికవాదాన్ని ఇంత తెలివితక్కువగా ఎవరూ చెప్పివుండరు? ఈ ఉల్లిపాయ భౌతికవాద పరిజ్ఞానంతో శివారెడ్డి భౌతికవాదాన్నిగూర్చి రాయటానికి పూనుకోవటం దుస్సాహసం.

"జీవితాన్ని సూత్రీకరించకు"

అనేది మరొక అపరిణతమైన రచన. తాను భౌతికవాదినని. మావోవారసులతో బృందగానంచేయటానికి సంకల్పించుకొని సూత్రీకరణకు అందదని రాస్తారే?

పైగా—

"ఈ నాణానికి
రెండు పక్కలుండటం
ధమనులు, సిరలు వున్నంత అవసరం"

అని సహజమైన వుపమానాలతో అసహజమైన సాంఘిక వైరుధ్యాలను సమర్థిస్తూ, ఇంకా ధనవంతుల్ని తిట్టడం ఎందుకు? పీడితులపక్షాన నిలబడి చేసేదేముంది? జీవితం "రస గుళిక" అని అనుకుంటే గుళికల్ని చప్పరిస్తూ కూర్చుంటేచాలు.

"భగవంతుడు బీదతనాన్ని సృష్టించాడని
దుఃఖం అనేది జీవుడే నిర్మించాడని(?)
మతాలు వేదాలు ఘోషిస్తే
గుడ్డిగా నమ్మే అంధత్వానికి
విడాకులిచ్చేరోజు
ఈ వైన్‌గ్లాసులోనే ఉదయిస్తుంది"

ఏమిటి యీ వాక్యాలకు అర్థం? భగవంతుడు బీదతనాన్ని సృష్టిస్తే, జీవుడు దుఃఖం నిర్మించటం ఏమిటి? ఏ వేదాల్లోవుంది యీ విషయం? గుడ్డిగా నమ్మే అంధత్వానికి విడాకులిచ్చే రోజు శివారెడ్డికి ఎప్పుడు వస్తుంది? ఇంతకీ భావవాదాన్ని అధ్యాత్మిక భావ వాదాన్ని వైన్‌గ్లాసుతో పోగొడతారా శివారెడ్డిగారు.

మనం వ్యతిరేకిస్తున్న విషయాలనుగురించి మనకు ఎక్కువ తెలియాలి. రాసే ముందు కాస్త ఆలోచించుకోవటం అవసరం. లేకపోతే తానునమ్మే ఆదర్శాలకే నష్టం వస్తుంది. రక్తం సూర్యుడు కవితల్లో అనేకం ప్రగతిభావాలను వెక్కిరించేవిగావున్న విషయం శివారెడ్డి గమనించినట్టులేదు.

వస్తువులో అపరిణతే శిల్పంలో స్పష్టంగా కనిపిస్తున్నది. వాక్యాలకు అన్వయం లేదు. ప్రతి గేయం పగిలిన గాజుగిన్నె ముక్కలు ఒకచోట చేర్చినట్టుగా వున్నాయి. ఒక భావం, దానిని సమర్థించే ఇమేజరీలు, వాతావరణసృష్టిలేకుండా పరస్పరవిరుద్ధంగా తయారయ్యాయి. భావాన్ని ఇమేజి ఖండిస్తూవుంటే. రెండింటికీ సంబంధంలేని వాతా వరణం అడ్డుకొంటూవుంది. వచన కవిత్వం కవిత్వస్థాయిని నిలబెట్టటం కష్టమైనపని.

"లేదు వసంతం
రాదు వసంతం
ఏ ఒక్క గుండెన్నా
ఆకలి ఎంగిలాకులు తిన్నన్నాళ్ళు
అసంతృప్తి పేలికలు చుట్టినన్నాళ్ళు
అశాంతి చలిలో గడ్డకట్టినన్నాళ్ళు
లేదు వసంతంలేదు!"

ఇలాంటి వాక్యాలు తిలక్‌కూ, "బస్టాండులో వుదయం" (పంది రాజకీయాల మధ్య) లాంటివి దిగంబరకవులకూ అనుకరణలు. శివారెడ్డి కవితల్లో చిన్న చిన్న నగరాల్లోని వాతావరణం అసంఘటితంగా కనిపిస్తుంది. విప్లవం కావాలనుకునే కవులు గ్రామ జీవి తాన్ని చిత్రించటానికి ప్రయత్నించాలి.

ఈనాడు విప్లవంలోవున్న కవులున్నారు. విప్లవాన్ని వ్యతిరేకిస్తున్న కవులున్నారు. శివారెడ్డి నిస్సందేహంగా విప్లవాన్ని ఆకాంక్షిస్తున్నకవి. ఆయన గ్రహించవలసిందల్లా విప్లవంలో చేరకుండా ఆయన ఆకాంక్ష ఫలప్రదం కాదనేదే. చాలామంది మంచివాళ్ళవలె శివారెడ్డి మంచిని కోరుతున్నాడు. కాని వర్గపోరాటంలేకుండా పీడితులకు మంచి జరుగదనేది, అధికసంఖ్యాకులైన ప్రజలకు శ్రామికవర్గ నియంతృత్వంలో తప్ప మంచి జరుగదనేది శివారెడ్డి గ్రహించవలసిన గతి తార్కిక సత్యం ఆయన వూహించుకుంటున్న రక్తం సూర్యుని దగ్గరికి విప్లవ సాంస్కృతిక సైనికునిగా ప్రయాణం చేసినపుడు మాత్రమే చేరుకోగలడు. ఈ పుస్తకం వెలువడిన్నాటినుండి యీ సమీక్ష వెలువడిన్నాటికే శివారెడ్డి ఆ ప్రయాణంలోనే వున్నాడనేది ఆశావహమైన పరిణామం.

వియత్నాం మహిళల విముక్త గీతం

దక్షిణ వియత్నామ్‌తోపాటు ఆ దేశపు మహిళలకుకూడా స్వేచ్ఛ, విముక్తి లభించాయి. మహిళలహోదాపట్ల ప్రజలలో కొంగ్రొత్తభావాలు వెల్లివిరిస్తున్నాయి. మహిళ శ్రోతలతో సైగాన్ రేడియో ఒక ప్రశ్నావళి కార్యక్రమం నిర్వహించింది.

ప్రశ్న : భవిష్యత్తులో వియత్నాం మహిళలకు అంగవైకల్యం పొందిన సైనికులతో బలవంతంగా వివాహాలు చేస్తారని వదంతులు వ్యాపిస్తున్నాయి. ఇది నిజమా ?

సమాధానం : అమెరికాచేతిలో కీలుబొమ్మగా వ్యవహరించిన పాత ప్రభుత్వంలోని అధికార గర్వాంధులు మహిళల్ని తమ కామతృష్ణ తీర్చుకోవడానికి ఆటబొమ్మలుగా ఉపయోగించుకొన్నారు ఇప్పుడు వినూతనంగా ఆవిర్భవించిన ప్రభుత్వం మానవ హక్కుల్ని గౌరవిస్తుంది.

జీవితంలో తమ భాగస్వాములను ఎన్నుకోవడానికి ఇప్పుడు మహిళలకు స్వేచ్ఛ ఇచ్చారు. విమోచనసంస్థ అధికారులు మహిళలు, వారి కుటుంబజీవనానికి రక్షణకల్పించి బలవంతపు వివాహాలను నిషేధిస్తారు. దక్షిణ వియత్నాంతోపాటు, మహిళలకు కూడా విమోచనం లభించింది.

ప్రశ్న : భవిష్యత్తులో పిల్లల్ని పెంచడానికి వేరేకేంద్రాలకు పంపుతారట నిజమేనా? తల్లినుండి పిల్లల్ని విడదీయడంకన్నా క్రూరమైనది మరొకటి వుండదు.

సమాధానం : భవిష్యత్తులో తల్లి, పిల్లలు ఎడబాటు వుండదు. విప్లవం తల్లి పిల్లల్ని సన్నిహితంచేస్తుంది. విప్లవం పిల్లల్ని మరింత ఆరోగ్యవంతులుగా, అందమైనవారిగా తీర్చిదిద్దుతుంది.

తల్లులు పనులు చేస్తుండగా, పిల్లల క్షేమం చూడడానికై వారికొరకు యింకా ఎక్కువ శిశుసంక్షేమ కేంద్రాలు నెలకొల్పుతారు.

దక్షిణ వియత్నాం విమోచన మహిళల సంఘంకూడా స్థాపించారు.

విరసం కార్యవర్గం (కాకినాడ 18-5-75) తీర్మానాలు :

1 భారత విస్తరణవాదాన్ని ప్రతిఘటించండి. సిక్కిం ప్రజల పోరాటాన్ని సమర్థించండి.

పాకిస్తానును చీల్చడంలో పరోక్షంగానూ, సిక్కింను కబళించడంలో ప్రత్యక్షంగానూ సైనికచర్యలు పూనుకున్న భారత పాలకవర్గాలు తమ విస్తరణవాదాన్ని ప్రపంచ ప్రజలముందు ఇక దాచుకోలేవు. సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులకు దేశాన్ని తాకట్టుపెట్ట సాహసిస్తున్న ప్రభుత్వం రష్యాలోని కొత్తజారుల చేతి కీలుబొమ్మగా మారిపోయి ప్రపంచ విప్లవకేంద్రమైన జనచైనాను చుట్టుముట్టే ప్రయత్నంలో భాగంగా రంగస్థలం సిద్ధంచేస్తోంది. కాని ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని ధిక్కరించి సిక్కింలో బూటకపు 'రిఫరెండం' జరిపి సిక్కిం ప్రజలముందు నేరస్తురాలిగా నిలుచుంది భారత ప్రభుత్వం.

దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్న ఈ యుగంలో సిక్కిం ప్రజలు నిరంతర పోరాటంజరిపి తమ విముక్తిని సాధించుకుంటారు. భారత పాలకవర్గాల కుట్రను భగ్నంచేస్తూ బహిర్గతపరుస్తూ సిక్కిం ప్రజలకు మద్దతుగా ఇక్కడి కార్మికవర్గం, మేధావులు, విద్యార్థులు ఉద్యమాలు నిర్వహించి సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదాన్ని భారత విస్తరణవాదాన్ని ప్రతిఘటించవలసిందిగా విరసం ప్రజాస్వామికవాదులందరికీ విజ్ఞప్తిచేస్తోంది.

2 ఇండో-చైనా విప్లవవీర ప్రజానీకానికి విరసం జేజేలు.

పీడిత ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువైన అమెరికా సామ్రాజ్య వాదం కేవలం కాగితపు పులేనని ఇండో-చైనా ద్వీపకల్పంలోని వియత్నాం, కాంబోడియా, లావోస్ ప్రజలు తమ ఘన విజయాలద్వారా తీర్పుచెబుతున్నారు. చిన్న దేశం పెద్ద దేశాన్ని, బలహీనమైనదేశం బలాధికమైన దేశాన్ని ప్రజాయుద్ధపంథాలో మన్నుగరిపించగలదన్న మావోసూక్తిని రుజువుచేస్తున్నారు. దక్షిణ వియత్నాం విముక్తి సంఘటనను కాంబోడియా ఖ్మేర్ రూజ్ దళాలకు లావోస్‌లోని పేథెట్‌లావోలకు విరసం తన విప్లవజేజేలు అర్పిస్తోంది.

అమెరికా సామ్రాజ్యవాదం గెంటివేతద్వారా ఆగ్నేయాసియాలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసి తన ప్రపంచాధిపత్యవ్యూహంలో ఈ ప్రాంతాన్ని చైనావ్యతిరేకమైన రంగంగా వాడుకుందామని సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం తన స్వార్థప్రయత్నాలు ప్రారంభించింది. వియత్నాంలో అమెరికా అనుభవిస్తూ ఉండిన ఒక యుద్ధస్థావరాన్ని తాను చేసిన ఆయుధసహాయానికి బదులుగా తనకివ్వవలసిందిగా ఒత్తిడిచేస్తోంది. వియత్నాం యుద్ధకృషికి రష్యా చైనాలు చేసిన సహాయంలో ఇదే మౌలికమైనభేదం. చైనా చేసిన

సహాయం విస్వార్థమైనది. బ్రెజ్నేవ్ ప్రతిపాదించిన ఆసియా సమిష్టి పథకాన్ని భారత దేశంద్వారా ఆగ్నేయాసియా దేశాలకు రష్యా విక్రయించబూనుకుంటుంది. మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, థాయిలెండ్, ఫిలిప్పైన్స్‌వంటి ఆగ్నేయాసియా దేశాలను దువ్వుతూ వియత్నాం, కాంబోడియా, లావోస్‌లను కూడా తటస్థ పాత్రింతాలుగా రూపొందించేందుకు టిటోవంటి రివిజనిస్టుల అండదండలతో సోవియట్ సోషల్‌సామ్రాజ్యవాదుల పేరిరేపణతో భారత దేశం ప్రయత్నిస్తోంది. చైనా వ్యతిరేక వ్యూహానికి ఇది రెండవముఖం మాత్రమేగాని చిత్తశుద్ధితోకూడిన ప్రయత్నంకాదు. జాతీయ విమోచనను సాధించి సోషలిజంవైపు పయనించనున్న ఇండోచైనా విప్లవ ప్రజానీకానికి అలీనతను బోధించడమంటే రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవడమే కాగలదని విరసం భావిస్తోంది.

③ మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ తెలంగాణ గెరిల్లాయోధులు కామ్రేడ్స్ కిష్టాగౌడ్ భూమయ్యల ఉరిశిక్షలు రద్దుచేయాలి.

ఇప్పటికి రెండుసార్లు సర్వసన్నాహాలుచేసి కామ్రేడ్స్ కిష్టాగౌడ్, భూమయ్యలను ఉరికంబం ఎక్కించబోయి విఫలమైన ప్రభుత్వం రాజకీయ కార్యకర్తలమీద ఫాసిస్టు హస్తాన్ని ప్రయోగిస్తోంది. దేశంలో ప్రజాకంటకులైన ఏ ఒక్క దోపిడీదారునికిగాని, భూస్వామికి, స్మగ్లర్‌కుగాని ఈ ప్రభుత్వం మరణశిక్ష విధించలేదు. పట్టుమని అయిదేళ్లు జైళ్లలోనైనా ఉంచలేదు. కాని పీడిత పక్షం వహించి శ్రామికవర్గ నియంతృత్వ స్థాపనకు సాయుధపోరాటమే ఏకైక మార్గంగా నమ్మిన విప్లవకారుల్ని మాత్రం ఉరికంబాలెక్కిస్తోంది. కా॥ కిష్టాగౌడ్, భూమయ్యల ఉరిశిక్షల రద్దువరకే పరిమితం చేయకుండా ఉరిశిక్షను శిక్షాస్మృతినుండి తీసివేసేదాక పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టవలసిందిగా అన్ని ప్రజాసంఘాలకు ప్రజాస్వామిక వాదులకు ముఖ్యంగా విద్యార్థులకు, కార్మికవర్గానికి విరసం విజ్ఞప్తి చేస్తోంది. విప్లవకారుల్ని ఉరితీసి విప్లవాన్ని ఎవరూ ఆపలేరని హెచ్చరిస్తోంది.

④ హైదరాబాదు జన నాట్యమండలి, విప్లవ రచయిత భూషణం అరెస్టు-విరసం ఖండన.

పోరుపదే జాతరో, పోదాంపదే జాతరో, శ్రీకాకుళయాతర అంటూ శ్రీకాకుళం జిల్లా పల్లెల్లో ప్రదర్శనలిస్తున్న హై. జ.నా.మం.బృందాన్ని, విరసం కార్యవర్గసభ్యుడైన కా॥ భూషణాన్ని ఏప్రిల్‌లో పార్వతీపురంలో రాజద్రోహ నేరంమోపి అరెస్టుచేసారు. గజ్జెలు, డప్పులు, కర్రతుపాకుల్ని లాక్కున్నారు. ఇదంతా డప్పునృత్యాలు చేసినందుకు గళాలువిప్పి పాడినందుకు, సాయుధ పోరాటాన్ని గానంచేసినందుకు. అంతకుముందు కా॥ సంధ్యను హైదరాబాద్‌లో నిర్బంధించారు. చల్లపల్లి జ.నా.మం. సభ్యుడైన కా॥ చుచేను అక్రమంగా కస్టడిలోకి తీసుకున్నారు. కారంచేడులో ప్రకాశంజిల్లా జ.నా.మ

సభ్యుణ్ని గృహ నిర్బంధంలో దహనం చెయ్యాలని అక్కడి భూస్వాములు, గుండాల మద్దతుతో ప్రయత్నించారు. అనంతపురం జిల్లా కోనాపురంలో పోలీసులు జ.నా.మం. మీద దాడి చేశారు. ఇలా పోలీసులు, భూస్వాములు జననాట్యమండలి భేరీని జోకొట్టాలని చూస్తున్నారు. గ్రామగ్రామాన వెలుస్తున్న జననాట్యమండలి బృందాలు శత్రు నిర్బంధాల్ని ధిక్కరిస్తూ ముందుకే సాగుతున్నాయి. నిర్బంధాల్ని లెక్కచేయక మరింత విప్లవదీక్షతో సాంస్కృతిక సైన్యంగా తమవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తాయని విరసం నమ్ముతోంది. ప్రభుత్వ ఫాసిస్టు చర్యను విరసం తీవ్రంగా ఖండిస్తోంది.

5 సి.పి.ఐ. గూండాల ఫాసిస్టు ఘాతుకాలు సాయుధపోరాటాన్ని అడ్డుకోలేవు. భారత పాలకవర్గాలకు కావలి కుక్కలుగామారి అధికారంలో అర్ధస్థానాన్ని ఆక్రమించి కూర్చున్న రివిజనిస్టుల చర్యలు నాజీల ఫాసిస్టు చర్యల్ని మరిపిస్తున్నాయి. మొన్న ఏప్రిల్ 13న తుమ్మల పాలెంలో మృతవీరుల స్మారక సభను యం.యల్. కార్యకర్తలు జరుపుతుండగా ఎర్రచొక్కాలు ధరించి కర్రలతోదాడిచేసి అనేకమందిని కొట్టారు. ఈ దాడి కరణం రంగారావు, గుంటూరు టౌన్ పార్టీ సెక్రటరీ గంగాధర్ రావు నేతృత్వంలో జరిగాయంటే పార్టీ సంకల్ప పూర్వంగా ఈ పనులు చేస్తోందని బోధపడుతూంది. కా॥ సయ్యద్ హుస్సేన్ సాయుధ పోరాటం ఎర్రజెండాను నిలబెట్టే ప్రయత్నంలో ఆనాడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ మృత వీరుడి విప్లవదీక్షకు విరసం విప్లవాభినందనలు తెలుపుతూంది. సి.పి.ఐ. గూండాల సర్కారీమద్దతు ఫాసిస్టుచర్యల్ని విరసం తీవ్రంగా ఖండిస్తోంది.

* * *

ఏ. పి. యస్. ఆర్. టి. సి. (వరంగల్, ఖమ్మం) ఎంప్లాయీస్ యూనియన్ సిబ్బంది కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు వెంటనే రద్దుచేయాలని తీర్మానించింది.

— చక్రపాణి

సహాయ కార్యదర్శి, ఏ.పి.యస్.ఆర్.టి.సి. (ఖమ్మం)

* * *

విజయవాడ సోషలిస్టు పబ్లికేషన్స్‌పై పోలీసుల దాడి

ది. 23-5-75న కె. ప్రకాశ రెడ్డిగారిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకొని ది. 24-5-75న సోషలిస్టు పబ్లికేషన్స్‌పై పోలీసులు దాడిచేశారు.

ప్రచురణకు సిద్ధంగావున్న అనేత వ్రాతప్రతులు, కొంత రికార్డు, మావో ఫోటోలతోసహా తీసుకొనిపోయారు.

— రమణ

"....గుర్తుంచుకోండి :

వాళ్ళనొకవేళ ఉరితీస్తే వాళ్ళ కళ్ళుంటాయి: అవి నిన్నూ, నన్నూ కనిపెడు తూనే వుంటాయి. ప్రతిక్షణం మన చర్యలను కనిపెడుతూనే వుంటాయి. మనంచేసే వర్గ న్యాయాన్నికూడా కనిపెడుతూనే వుంటాయి. ఈ రెండు మానవజీవితాలకు జరుగ బోతున్న దానిపట్ల మనం ఉదాసీనంగా ఉండగలమా।"

— కె. ఎ. అబ్బాస్

"....మరణశిక్షపడి ఆంధ్రప్రదేశ్ ముషీరాబాద్ జైల్లో మ్రగ్గుతున్న భూమయ్య, కిష్టాగౌడ్ తమను ఉరితీసినాక తమకళ్ళను ఎవరికైనా యివ్వండని కోరారు.

మన న్యాయ చట్టాల, శాంతి భద్రతల పరిరక్షకులకన్నా వీరెంతటి మానవాతీత వాదులో వీరి యీ నిర్ణయం రుజువుచేస్తున్నది- మనదేశపు అత్యున్నతాధికారి యీ యిరువురు నిందితులు ప్రదర్శించిన అత్యంత గొప్ప ఆదర్శందృష్ట్యా వారి మరణశిక్షలను మారుస్తారని ఆశిస్తున్నాం.

— మృణాల్ సేన్, ఉత్పల్ దత్, తపన్ సేన్, అశోక్ మిత్రా

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డిఫెన్స్ కమిటీ కృషివల్ల హైకోర్టు యిచ్చిన స్టేవల్ల కామ్రేడ్స్ భూమయ్య. కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు మే 10న రెండవసారి వాయిదాపడినవి. అనేక ప్రజా సంఘాలు, పార్టీలు, విద్యార్థులు కలిసి విశాల ప్రాతిపదికపై కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దు కమిటీ ఏర్పడింది. రాష్ట్ర పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పత్తిపాటి వెంకటేశ్వర్లుగారు యీ కమిటీకి కన్వీనర్. ఉరిశిక్షలు రద్దయేదాకా కూడ అలసట లేకుండా ఆందోళనను నిర్వహించవలసిందిగా యీ కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

"అమరవీరుల మరణానికి చలించిపోకండి
నెత్తురుమాత్రమే చరిత్రను కొత్తరంగుల్లో రాస్తుంది"

— గోర్కీ

SRJANA Telugu Monthly June '75 H/WL-1(
Regd. No. with Registrar of News Papers 10953/67

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)